ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 209 పేజీలు: 8+4 వెల: 6.50


మళ్లీ ఎన్నికలు జరిగితే ఎన్డీయేకే పట్టం

మూడు వారాల్లోనే 60 మంది నవజాత శిశువుల మృతి

5లో



# పెను విపత్తే!

హిమనదం కూలడంతోనే నేపాల్‌లో జలప్రళయం

ఉపగ్రహ చిత్రాలు బయటపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు

భూకంపం కాదు... మంచుకొండే విరిగిపడింది

యుఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు

332కు చేరిన మృతుల సంఖ్య... 1400మందికి పైగా గల్లంతు

28 దేశాలకు చెందిన 500మంది పర్యాటకుల ఆచూకీ లేదు

21మంది భారతీయులను రక్షించిన సహాయక బృందాలు


నేపాల్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారుల వెల్లడి

ఇషా ఫౌండేషన్ క్యాంప్‌లో 80మంది యాత్రికులు అదృశ్యం

ఆధ్యాత్మిక వేత్త సద్గురు జగ్గీ వాసుదేవ్ కన్నీటి పర్యంతం

ఇదొక ఊహించని ప్రకృతి విపత్తు: భారత్‌కు బాలేన్ షా కృతజ్ఞతలు

చైనా చర్యలతోనే ఈ ప్రమాదం: నేపాల్, నిందలేయొద్దన్న డ్రాగన్



288 మంది

## టిబెట్‌లో విరిగిపడ్డ కొండచరియలు

- ముగ్గురు మృతి.. 800మంది మిస్సింగ్
- ముంచుకొస్తున్న మరో ముప్పు
- బారియర్ సరస్సు పొంగిపొర్లుతోంది
- జాగ్రత్త అంటూ చైనా హెచ్చరిక

## సరిహద్దులో వాటర్ బాంబ్

- బ్రహ్మపుత్ర నదిపై భారీ రిజర్వాయర్
- 60వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యం
- ఈ డ్యాంతో భారత్-నేపాల్‌కు ముప్పు
- వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరిక

5లో

## భారతీయుల జాడ లేదు

విదేశాంగ శాఖ ప్రకటన

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

రంగంలోకి ఎన్‌డిఆర్ఎఫ్

విపత్తు పరిస్థితిపై పర్యవేక్షణ

## అమరావతిలో నైలిట్!

రాజధానికి మరో జాతీయ విద్యా సంస్థ

రూ.730 కోట్లతో దేశంలోనే తొలి క్వాంటమ్-ఎఐ యూనివర్శిటీ ఏర్పాటు

సెప్టెంబర్ 13 నుంచి ఆంధ్రా యూనివర్శిటీలో ఎన్ఐఇఎల్ఐటి తరగతులు

8.5 ఎకరాల్లో ఎన్ఐఇఎల్ఐటి క్యాంపస్ ఏర్పాటుకు సిఆర్‌డిఎ ఆమోదం

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిని అత్యున్నత సాంకేతికత, ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రీకృతమైన జాతీయ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-ఎన్ఐఇఎల్ఐటి డీమ్డ్ టూ బీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా క్వాంటమ్ అండ్ ఎఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు సిఆర్‌డిఎ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాజధాని ప్రాంతంలో కేటాయించిన 8.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.730.70 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం 100 శాతం గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ ఫండ్‌లో సమకూర్చనుంది. సచివాలయంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. >>2

## రాజధాని గ్రామాల్లో రూ.1437 కోట్లతో

# మౌలిక సదుపాయాల కల్పన

లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు

మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్డీ త్రాగునీరు సరఫరా

ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్ల నుండి రాజధాని వరకు ల్యాండ్ పూలింగ్

సిఎం చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో నిర్ణయం

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడి



గురువారం అమరావతిలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ సమావేశ దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని గ్రామాల్లో రూ.1437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదం తెలిపిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశ వివరాలను ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో రూ.596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, హ్యూమన్ రిసోర్స్ భవనాలు నిర్మాణానికి సిఆర్‌డిఎ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు. ముఖ్యంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రేనేజీలు, మంచినీటి పైపులు,వీధి దీపాల ఏర్పాటుకు 1437 కోట్ల రూ.లకు అనుమతి ఇచ్చిందని వివరించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్ల నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందించాల్సి ఉందన్నారు. కావున ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా పైపులైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాదనకు సిఆర్‌డిఎ అథారిటీ ఆమోదించిందని తెలిపారు. ఆయా గ్రామాల గుండా వెళ్తున్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగిస్తామని ఇందుకై మరో రూ.533 కోట్లు మంజూరు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. గతంలో ఈ 29 గ్రామాల్లో మౌలిక సౌకర్యాల నిమిత్తం >>2



అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రంనుంచి పర్యవేక్షిస్తున్న అధికారులు

## నేపాల్‌లో చిక్కుకున్న ఏపి యాత్రికులు

# రంగంలోకి ప్రభుత్వం

ఆర్‌టిజిఎస్ నుంచి 24/7 అధికారులు పర్యవేక్షణ

ఢిల్లీ ఎపి భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సిఎం ఆదేశాలతో మంత్రి లోకేష్ ఉన్నత సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నేపాల్ వెళ్లి వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖల మంత్రి లోకేష్ ఆర్‌టిజిఎస్ అధికారులు, సిబ్బందిని రంగంలోకి దించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లారు. ఆకస్మిక వరదల నేపథ్యంలో కొంతమంది అక్కడ చిక్కుకున్నారు. వీరందరి ఆచూకీ తెలుసుకుని వారి యోగ క్షేమాలుకనుక్కునేలా మంత్రి లోకేష్ ఆర్‌టిజిఎస్ యంత్రాంగాన్ని >>2

## ఎపిసిపిడిసిఎల్ మరో కీలక ముందడుగు

'పిఎం కుసుం గ్రిడ్'కు ఎన్.ఎన్ తండా 3 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ అనుసంధానం

ఎన్.ఎన్. తండాలో 3 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించిన సిఎండి పి.పుల్లారెడ్డి 2లో



గురువారం మంగళగిరిలో మోడరన్ రైతు బజార్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్

5.90 ఎకరాల్లో రూ.18.55 కోట్ల వ్యయంతో నిర్మాణం

భూమిపూజ చేసిన మంత్రి లోకేష్ 2లో



## గ్రీన్ ఆంధ్రా!

డి.సిఎం పర్యవేక్షణలో కార్యాచరణ

ప్రజా భాగస్వామ్యం ఉండేలా ప్రణాళిక

మొక్కలు పెంపుతో ఉపాధి అవకాశాలు

జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమాలు

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి. ఉన్న అడవులను కాపాడుకుంటూ, కొత్త అడవులను సృష్టించాలి. ప్రతి గ్రామాన్ని పచ్చదనపు ఛత్రం కిందకు చేర్చాలి. చెట్లను కాపాడుకుంటూ, ఆ చెట్ల నుంచి వచ్చే ఫలసాయం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించుకుంటూ, గ్రామాల్లో ప్రకృతి ఆధారిత జీవనోపాధి లక్ష్యాలు సాధించాలన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనల నుంచి ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ రూపుదిద్దుకొంది. భవిష్యత్ తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు చేపడుతున్న 50శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసం ఏర్పాటుకు అడుగులుపడ్డాయి. స్వయం ప్రతిపత్తి కలి >>2

## లోపాల్లేకుండా ఓటర్ల జాబితా

- సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం
- ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం
- అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణ
- పైస్థాయి నుంచి బిఎల్‌ఓ వరకు సరైన సమన్వయం, సహకార స్ఫూర్తి కీలకం
- జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఇసిఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ.



**విజయవాడ.ఆగస్టు27,ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. గురువారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.ఢిల్లీ రావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పు గోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఇఆర్‌వోలు ప్రత్యక్షంగా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు >>2

## పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ...

# చిలకలూరిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

ఆటోను ఢీ కొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఏడుగురు దుర్మరణం... 8మందికి గాయాలు

మృతులు, క్షతగాత్రులంతా వేలూరువాసులు

సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, సంతాపం

**చిలకలూరిపేట, ఆగస్టు 27 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున ఆటోనే ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్రగాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మృతులందరూ చిలకలూరిపేట మండలం వేలూరుకు చెందినవారిగా గుర్తించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రకాశం జిల్లా కొండమంజులూరులో పుట్టినరోజు వేడుకలలో పాల్గొని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. >>2

## అనంతపురం జిల్లా రమణేపల్లిలో మరో ఇద్దరు మృతి 2లో



మంత్రి లోకేష్‌కు రాఖీ కడుతున్న మహిళ

# మంత్రి లోకేష్‌కు రాఖీలు కట్టిన మంగళగిరి మహిళలు

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు మహిళా నేతలు మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌కు రాఖీలుకట్టి ప్రేమను, సోదరభావాన్ని చాటుకున్నారు. గురువారం మంగళగిరి మోడ్రన్ రైతు బజార్ భూమిపూజ, శంకు స్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్‌ను మహిళా నేతలు మర్యాదపూర్వకంగా కలసి రాఖీలు కట్టారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్య, టిటిడి ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, టిడిపి సీనియర్ మహిళా నాయకురాలు విజ మూరి ఆషాబాల తదితరులు మంత్రి లోకేష్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. వారందరికి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు.

# గ్రీన్ ఆంధ్రా!

>> గిన ఈ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విధులు నిర్వహిస్తూ, అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, పరిశ్రమలు, జలవనరులు, పట్టణ స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సిఎస్ఆర్ సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ సూచనల మేరకు ముందుకు తీసుకువెళ్తుంది.

**మూడంచెల వ్యవస్థతో ఏపీ గ్రీన్ కార్యకలాపాలు.**

ఏపీ గ్రీన్ మూడంచెల వ్యవస్థ ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తుంది. రాష్ట్ర స్థాయి పాలక మండలికి రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ చైర్మన్‌గా, ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ, జలవనరులు, రోడ్లుభవనాల శాఖల ప్రధాన కార్యదర్శులు, పీసీసీఎఫ్ డైరెక్టర్లుగా ఉంటారు. వీరితోపాటు ఏపీ గ్రీన్ సీఈఓ, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ రంగానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా సంస్థ ప్రతినిధి, ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక అటవీకరణ రంగంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజానికి చెందిన ప్రతినిధులతో కలిపి మొత్తం 24 మంది పాలక మండలిలో భాగస్వాములుగా ఉంటారు.

రాష్ట్ర స్థాయి పాలక మండలి ఏటా రెండుసార్లు సమావేశమై విధానాల రూపకల్పన, ఏపీ గ్రీన్ కార్యకలాపాల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రెండో అంచెలో ఎగ్జిక్యూటివ్ కమిటీ కేబినెట్ హోదా కలిగిన ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన విధులు నిర్వహిస్తుంది. కమిషనర్ గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశమవుతుంది. జిల్లా స్థాయి గ్రీన్ డెవలప్‌మెంట్ అథారిటీ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పని చేస్తుంది. జిల్లా స్థాయి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, దేవాదాయ, జల వనరులు, విద్యాశాఖల అధికారులు సభ్యులుగా కార్యక్రమాలను సమర్థ వంతంగా అమలు చేసే బాధ్యతలు చేపడతారు.

# ఓటర్ల జాబితా

>> వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాల్లోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలకమని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాలద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు.

## అనంతపురం జిల్లా రమణేపల్లిలో మరో ఇద్దరు మృతి

**కళ్యాణదుర్గం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఇద్దరు ఆర్యవైశ్యులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం రమణేపల్లి క్రాస్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలుగుప్ప నాగరాజు (60), కోమటి గుప్తా (45) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ఒకే కారులో ప్రయాణిస్తున్న సమయంలో రమణేపల్లి క్రాస్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బెలుగుప్ప నాగరాజు, కోమటి గుప్తా ప్రాణాలు కోల్పోయారు. నాగరాజు పట్టణంలో శ్రీ లలితా సిల్క్ సారీస్ పేరుతో బట్టల దుకాణాన్ని నిర్వహిస్తూ వ్యాపారవర్గాల్లో, పట్టణ ప్రజల్లో సుపరిచితుడిగా ఉన్నారు. మృదుస్వభావంతో అందరితో కలిసిమెలిసి ఉండే నాగరాజు మృతి స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కోమటి గుప్తా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. అదే కారులో ప్రయాణిస్తున్న బలిజ నరహరి, కోమటి హార్షలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతులకు నివాళులర్పించారు.

# మౌలిక సదుపాయాల కల్పన

>> విడుదల చేసిన రూ.904 కోట్లుతో కలిపి మొత్తం రూ.1437 కోట్లతో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు.

రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లోని లే అవుట్లలో రహదారులను గతంలో సిసి రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది అయితే సిఆర్ఆర్ఐ న్యూఢిల్లీ, ఐఐటి ఖరగ్ పూర్ ఆర్గనైజేషన్‌లతో పరిశీలన చేయించగా 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను సైతం సిసి కాకుండా బిటి రోడ్లుగా మర్చాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు. నిపుణుల సలహా మేరకు ఆయా రహదారులను సైతం బిటి రోడ్లుగా నిర్మించడానికి సిఆర్‌డిఎ అథారిటీ సమ్మతి తెలిపిందన్నారు.

మంగళగిరి పట్టణానికి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ లీటర్లు(ఎంఎల్డీ) ప్రతి కిలో లీటర్(కెఎల్డీ) రూ.10 చొప్పున ఇవ్వడానికి అనుమతి లభించిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తులో 80 ఎంఎల్డి నీరు ఆ పట్టణానికి అవసరం ఉంటుందని తెలిపారు. డిస్ట్రిక్ కూలింగ్ సిస్టమ్‌కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. మిక్స్ డ్ యూజ్ క్రింద ప్రైవేట్ వారికి భూమి ఇవ్వడానికి పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు, తుళ్లూరులో 5ఎకరాలు, మందడంలో 12.38, మరియు 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు ఇలా మొత్తం 42 ఎకరాలు సిఆర్‌డిఎ గుర్తించడం జరిగిందని వాటికి ఆర్ఎఫ్పి పిలవడానికి అనుమతి లభించిందన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే నిబంధనల మేరకు కేటాయించిన భూమి కంటే ఎక్కువ కావాలని కోరుతున్న స్కూల్స్, హోటల్స్ తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ.4.1 కోట్లు కంటే 250శాతం ఎక్కువ అంటే సుమారు రూ.10.25 కోట్లు చెల్లిస్తే వారికి ఆ భూమి అందించడానికి అనుమతి లభించిందన్నారు. రాజధానిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ యూనిర్సిటీ నిర్మాణానికి 8.5ఎకరాలు కేటాయించేందుకు సిఆర్‌డిఎ అథారిటీ అనుమతిచ్చిందని చెప్పారు. అమరావతి రాజధాని ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఐఐసిఎల్‌తో ఎంఒయు కుదుర్చుకోవడానికి సిఆర్‌డిఎకి అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్లు కంతేరు, తాడికొండ ప్రాంతాల గుండా వెళుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. రాజధాని ప్రాంతం నుండి వాటి వరకు ఉండే భూములను ల్యాండ్ పూలింగ్ క్రింద తీసుకోవడానికి సిఆర్‌డిఎ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు. రాజధాని ప్రాంతంలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే భూముల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందన్నారు. అదీ 2026 జనవరి 6 కంటే ముందు వ్యవసాయ రుణాలు తీసుకున్న వారికి రూ.1లక్ష వరకు రుణమాఫీ అందుతుందని స్పష్టం చేశారు.

# రంగంలోకి ప్రభుత్వం

>> ఆదేశించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. తెలుగు ప్రజల భద్రతకు సంబంధించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత ఏజెన్సీలతో సమర్థవంతమైన సమన్వయం ఏర్పాటు చేసి, నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఆర్‌టిజిఎస్ తన పర్యవేక్షణ, సమాచార సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆర్‌టిజిఎస్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, సిఇఒ ప్రఖర్ జైన్‌లు అటు ఎపి భవన్, ఇటు ఎపి ఎన్ఆర్‌టిలను సమన్వయపరచుకుని పరిస్థితులను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అటు ఎపి భవన్ అధికారులకు, ఇటు సిఎంఒ, ఐటీ మంత్రికి అందజేశారు. తిరుపతి నుంచి మానస సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికు బృందం ఆచూకీ తెలుసుకుని వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వీరంతా ఖాట్మాండులోని ఒక హోటల్‌లో సురక్షితంగా ఉన్నారు. వీరితో పాటు నేపాల్‌లో ఇలాగే పలు ప్రాంతాల్లో చిక్కుకున్న యాత్రికుల వివరాలన్నీ వివిధ మార్గాల ద్వారా సేకరించారు. ఆర్‌టిజిఎస్ బృందం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని న్యూ ఢిల్లీలోని ఎపి భవన్ అధికారులకు అందజేస్తోంది. తద్వారా బాధితులకు తక్షణ సహాయం, భద్రత, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమమయ్యేలా చేసింది.

**రియల్ టైమ్ ట్రాకింగ్, సమన్వయం**

నేపాల్‌లో వరద ప్రభావిత ప్రాంతాల గుండా ప్రయాణిస్తున్న తెలుగు యాత్రికులకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌టిజిఎస్ నిశితంగా పర్యవేక్షిస్తోంది. ముఖ్యంగా కైలాస మానస సరోవర్ యాత్రికులు ఉపయోగించే నేపాల్-టిబెట్ మార్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, క్రాస్ వెరిఫికేషన్ చేస్తూ, ఎపి భవన్‌తో పాటు ఇతర సంబంధిత సంస్థలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తోంది. ఆర్టీజీఎస్ అందించిన సమాచారం ఆధారంగా ఎపి భవన్ అధికారులు విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులు, చైనా అధికారులతో సమన్వయం ఏర్పరుచుకుని నేపాల్‌లో చిక్కుకున్న ఎపి యాత్రికులను సురక్షితంగా తీసుకొచ్చే చర్యలను ప్రారంభించింది. బాధితులకు సంబంధించిన యోగ క్షేమాల గురించి వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కోసం ఎపి భవన్‌లో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**ఆర్‌టిజిఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ**

నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికులందరూ క్షేమంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునేంత వరకు ఆర్‌టిజిఎస్ 24 గంటలూ నిరంతరాయంగా పర్యవేక్షించాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఎపి యాత్రీకులందరి సురక్షితంగా తిరిగి వారి స్వస్థలాలకు చేరేంత వరకు ఆర్‌టిజిఎస్ అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

# అమరావతిలో నైలిట్!

>> ఈ ప్రాజెక్టు ద్వారా క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ఇతర అధునాతన డీప్‌టెక్ రంగాలలో విద్యా బోధన, ఉపాధి శిక్షణ, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ఒకే వేదిక మీదకు తీసుకురానున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయమైన నైలిట్ పంజాబ్‌లోని రోపర్‌లో ప్రధాన క్యాంపస్, దేశవ్యాప్తంగా 56 కేంద్రాలు, 11 రాజ్యాంగ విభాగాలు, 700కు పైగా గుర్తింపు పొందిన సంస్థల నెట్‌వర్క్‌తో పనిచేస్తున్న నైలిట్, అమరావతి వేదికగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తన డీప్‌టెక్ క్యాంపస్‌ను విస్తరిస్తోంది. అమరావతిలో శాశ్వత ప్రాంగణ నిర్మాణం పూర్తయ్యేంతవరకు ఆగకుండా, వచ్చే నెల నుంచే విద్యార్థులు, వృత్తినిపుణులకు కోర్సులను అందుబాటులోకి తేనున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఎఎన్‌యు) ప్రాంగణంలో ఏర్పాటు చేసే తాత్కాలిక వసతిలో విద్యా బోధన, అధునాతన సాంకేతిక శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయి. ఈ క్యాంపస్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, విఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ హెచ్‌పిసి వంటి కీలక రంగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పిహెచ్‌డి, డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేయనున్నారు.

# ఎపి సిపిడిసిఎల్ మరో కీలక ముందడుగు



**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పిఎం కుసుం) పథకంలోని కాంపోనెంట్ సి కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ కార్యక్రమాన్ని ఎపిసిపిడిసిఎల్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. వ్యవసాయ అవసరాలకు వినియోగించే 33/11 కెవి ప్రత్యేక లేదా మిశ్రమ ఫీడర్లకు అనుసంధానమైన వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట సౌర విద్యుత్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని సిఎండి పి.పుల్లారెడ్డి తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ఆర్థిక సహాయం కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం సుమారు 65,000 వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్ పనులు కొనసాగుతున్నాయని, ఎపిసిపిడిసిఎల్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో మొత్తం 191.5 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఏర్పాటవుతోందని తెలిపారు. ఇందులో బాపట్ల జిల్లాలో 17 మెగావాట్లు, ఎన్టీఆర్ జిల్లాలో 23 మెగావాట్లు, పల్నాడు జిల్లాలో 42.5 మెగావాట్లు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 109 మెగావాట్ల సామర్థ్యం ఉందన్నారు.ఈ సందర్భంగా పల్నాడు సర్కిల్, మాచర్ల డివిజన్‌లోని ఎన్.ఎన్. తండాలో ఏర్పాటు చేసిన 3 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించడం ఎంతో గర్వకారణమని సిఎండి పేర్కొన్నారు. పిఎం కుసుం పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో గ్రిడ్‌కు అనుసంధానం చేయబడుతున్న తొలి సోలార్ పవర్ ప్లాంట్‌గా ఎన్.ఎన్. తండా 3 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రత్యేక గుర్తింపు పొందుతోందని తెలిపారు.ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి అనుసంధానం చేసి, అనుసంధానిత వ్యవసాయ పంపుసెట్ల పగటిపూట విద్యుత్ అవసరాలను తీర్చేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మరింత విశ్వసనీయమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి, సకాలంలో ప్రారంభించేందుకు కృషి చేసిన ఎపిసిపిడిసిఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ హెచ్ఆర్ టివిఎస్ఎన్ మూర్తి, పల్నాడు పవర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, అలాగే ప్రాజెక్టు విజయవంతానికి సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర భాగస్వామ్య సంస్థలకు సిఎండి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఎన్.ఎన్. తండా సోలార్ ప్లాంట్ విజయంతో వ్యవసాయ విద్యుత్ అవసరాలను పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా తీర్చే దిశగా ఎపిసిపిడిసిఎల్ మరో కీలక ముందడుగు వేసిందని సిఎండి అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి, స్థిరమైన, విశ్వసనీయమైన, పర్యావరణహిత విద్యుత్ వ్యవస్థ నిర్మాణానికి ఎపిసిపిడిసిఎల్ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

28-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.పౌర్ణమి ఉ.9.46
న.శతబిష రా.3.12
వ.ఉ.9.43-ఉ.11.23
దు1. ఉ.8.23-ఉ.9.13
దు2. మ.12.33-మ.1.23
రాహు. ఉ.10.30-మ.12.00
శుభ ఉ.5.00-ఉ.6.00

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. ధన లాభం.

**వృషభం :** సంతానం విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తారు. నూతన పరిశ్రమలను ప్రారంభిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం :** విధుల నిర్వహణలో వ్యాపార రంగాలలో అభివృద్ధి విదేశీ యానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**కర్కాటకం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కన్య :** ఉద్యోగాలలో మంచి మార్పులు వుంటాయి. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. భూముల కొనుగోలు చేస్తారు.

**తుల :** సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన వార్తలు అందుకుంటారు. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం :** నూతన ఉద్యోగానికై చేసే దరఖాస్తులు, సంప్రదింపులు, పర్యటనలు లాభిస్తాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**ధనుస్సు :** ఆస్తి తాలూకా వివాదాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసుకోవడమే మంచిదని భావిస్తారు.

**మకరం :** ఋణ యత్నం ఫలిస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. పనులు నెమ్మదిగా పూర్తి చేస్తారు.

**కుంభం :** పెట్టుబడులకు తొందరపాటు వద్దు. భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** సాంకేతిక విద్యావైద్య రంగాలలో రాణిస్తారు. మీ పేరు మీద ఇతరులు చేసే వ్యాపారాలు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం బొప్పూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

## బొప్పూడి కొండపై కల్యాణ వెంకటేశ్వరస్వామి

# ఆలయ జీర్ణోద్ధరణ

### గవర్నర్ చేతుల మీదుగా అలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన..

**చిలకలూరిపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త:** బొప్పూడి కొండపై కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.10.99 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టిన పలు పనులకు గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణ మోహన్, జిల్లా న్యాయమూర్తి, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహా పలువురు ప్రముఖులతో కలిసి గొప్ప దైవకార్యంలో పాలుపంచుకోవడం మంచి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. గురువారం బొప్పూడిలో జరిగిన ఆలయాభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బొప్పూడి గ్రామ విశిష్టత, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ విశేషాలను ప్రత్తిపాటి స్వయంగా గవర్నర్ కు వివరించారు. తమ నియోజకవర్గంలో ఒక మంచి కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్‌కు ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. గురువారం చిలకలూరిపేట మండలం బొప్పూడి పర్యటనకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్ స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలో నిర్మించనున్న పుష్కరిణి పనులకు భూమిపూజ చేసిన ఆయన, అక్కడే ఏర్పాటుచేయనున్న గరుడ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ పండితుల వేదాశ్వీరచనం పొందారు. తర్వాత కొండపైకి వెళ్లే మెట్లమార్గం వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఆయన.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్‌లో పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

# మంగళగిరిలో మోడరన్ రైతు బజార్

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందుగా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఆధునిక హంగులతో మంగళగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు:** మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేష్ మోడరన్ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. 5.90ఎకరాల విస్తీర్ణంలో,అరబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులు రూ.18.55 కోట్ల వ్యయంతో ఈ రిటైల్ హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటుచేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులు. రిటైల్ మార్కెట్‌లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60 షాపులు ఏర్పాటుచేస్తారు. హోల్ సేల్ మార్కెట్‌లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు.ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ జి.భీముడు, ఎంటిఎంసి కమిషనర్ షేక్ అలీమ్ బాషా, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ రావు, గుంటూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టిడిపి అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టిడిపి అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టిడిపి అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.

# చిలకలూరిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

>> చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటోలో 15మంది ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాబుతోపాటు మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద ఘటనాస్థలిలోనే నలుగురు మృతి చెందగా, ఇద్దరు గుంటూరు జిజిహెచ్‌లో, ఒకరు చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. మృతులు మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మీ, గంగమ్మ, మరియమ్మ, సువార్తలుగా గుర్తించారు. దుర్ఘటనలో ఒక చిన్నపాప సురక్షితంగా బయటపడింది. ఆటోడ్రైవర్ అకస్మాత్తుగా టర్న్ తీసుకోవడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. వేలూరుకు చెందిన ఆరుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరం: ఎమ్మెల్యే ప్రత్తిపాటి**

చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 12.45 గంటలకు ప్రమాదం జరిగిందని, దుర్ఘటనపై వెంటనే పోలీసులను, వైద్యాధికారుల్ని అప్రమత్తం చేశామని ఆయన చెప్పారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని ప్రత్తిపాటి గురువారం ఉదయం పరామర్శించారు. బాధితులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడిన ఆయన, అధైర్యపడవద్దని, అన్నివిధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. దుర్ఘటన గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియచేశామని, మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరినట్టు ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే సిఎంఒ అధికారులు, హోం మంత్రి అనిత అధికారులతో మాట్లాడారని ప్రత్తిపాటి తెలిపారు.

**సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..**

**విజయవాడ ఆగస్టు 27,ప్రశాతవార్తప్రతినిధి:** పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సిఎం విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారిగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు.ఇక పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు.ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగొస్తూ..ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ విచారం**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందించాలని స్పష్టం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేటు బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు.

# గల్లంతైన వారి ఆచూకీ కనుగొనండి

## కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపండి

## బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చాలి

## అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఎపివాసుల పరిస్థితిపై సమీక్ష



గురువారం అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు సిఎంకు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఎపికి చెందిన పలువురు యాత్రీకులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సిఎంకు తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడు గురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని వారితో తాము మాట్లాడమని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు కాఠ్మండ్‌లో సురక్షితంగా ఉన్నారని, వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు అధికారులు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఇషా ఫౌండేషన్ తరపున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని అధికారులు సిఎంకు వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఎపి భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు కాఠ్మండ్, చైనాల్లోని ఎంబసిలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఎపి వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియ జేయాలని అధికారులను ఆదేశించారు.

# నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులను క్షేమంగా తీసుకొస్తాం: హోంమంత్రి అనిత

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్తప్రతినిధి:** నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల గురించి హోంమంత్రి అనిత ఆరా తీశారు. ఏపీ యాత్రికుల క్షేమ సమాచారం తెలుసుకోవాలని అధికారులకు ఆదేశించారు. దిల్లీలోని ఏపీ భవన్, విదేశాంగశాఖ, భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని సూచించారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ యాత్రికులను క్షేమంగా తీసుకొస్తామన్న హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు.

# పునర్విభజనపై మోడీకి ఖర్గే ఘాటు లేఖ



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మరోసారి ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రతిపాదనలను ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తాజాగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని ఓ టీవీ ఇంటర్వ్యూలో చెప్పిన నేపథ్యంలో ఖర్గే ఈ లేఖ రాశారు. డీలిమిటేషన్ వంటి దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశంపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లకూడదని ఖర్గే సూచించారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రధాని ముందు మూడు కీలక డిమాండ్లు పెట్టారు. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలని, లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల వారీ సీట్ల సంఖ్యను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలని, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అన్ని పార్టీలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ఖర్గే కోరారు. రాష్ట్రాల ప్రాతినిధ్యం, లోక్‌సభ సీట్ల సమతుల్యత వంటి అంశాలకు డీలిమిటేషన్‌పై చర్చల్లో కీలక ప్రాధాన్యత ఉందని కాంగ్రెస్ భావిస్తోందన్నారు. ఇప్పటికే జూలై 16న ప్రధానికి రాసిన లేఖలో అఖిలపక్ష సమావేశాల వేళ ఎలాగైనా డీలిమిటేషన్ బిలు ను నెగ్గించుకునేందుకు మహిళా బిల్లుతో కలిపి పెట్టిన కేంద్రానికి విపక్షాలన్నీ ఏకమై 2/3 వంతు మెజార్టీ రాకుండా అడ్డుకున్నాయి. దీంతో ఈసారి వర్షకాల సమావేశాల్లో ఈ బిల్లును ఎలాగైనా ప్రవేశపెట్టి నెగ్గించుకోవాలని ప్లాన్‌చేసి, ఆ మేరకు మెజార్టీకి సైతం ఇబ్బందుల్లేకుండా విపక్షాల్ని అడ్డంగా చీల్చిన కేంద్రం స్వత్ఫలితాలు సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలోవేశం నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలను పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఖర్గే కోరారు. తాజాగా ఆ డిమాండ్లను మరోసారి ప్రధాని దృష్టికి తీసుకొచ్చారు.దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు ఆటంకాలు తప్పడం లేదు.



తెలుగు, సంస్కృత అకాడమీ సంస్కృత సప్తాహంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర తెలుగు,సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ శరత్ చంద్ర

# సంస్కృతాన్ని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

## ఐదువందల గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు:

## రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడెమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ శరత్ చంద్ర

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ వాదానికి సంస్కృతమే ఊతమని రాష్ట్ర తెలుగు,సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్‌శరత్ చంద్ర అన్నారు. ఐదు వందల గ్రామాలను సంస్కృత గ్రామాలుగా తీర్చిదిద్దుటకు చర్యలు చేపట్టామని చెప్పారు. శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాలలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ సౌజన్యంతో తెలుగు.సంస్కృత అకాడమీ సంస్కృత సప్తాహం వారోత్సవాలలో భాగంగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతం అమృత భాష అన్నారు. సంస్కృతం పండితుల భాషగా ప్రజల్లో నానుడి ఉందని దాన్ని చెరిపివేసి సామాన్యులకు సంస్కృత భాష చేర్చే కార్యాచరణ అకాడమీ చేపడుతుందని చెప్పారు. "అందరికీ సంస్కృతం అందరిలోకి సంస్కృతం" శీర్షికన ముందుకు వెళుతున్నామని చెప్పారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సౌజన్యంతో అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో రూ.5 వందల కోట్లతో నిర్మించుటకు ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు అనుబంధంగా 100 పడకల ఆయుర్వేద వైద్యశాల రానుందన్నారు. బహుళ ప్రయోజనాలు సమకూర్చే సంస్కృత విశ్వవిద్యాలయం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృత అకాడమీ అభివృద్ధి చెందుతుందని, పుస్తకాలు మొత్తం ప్రింటింగ్ చేసే అవకాశం కూడా వస్తుందన్నారు.

సంస్కృత సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న శ్రీకాకుళం, విజయనగరం లలో, 26న విశాఖపట్నం, కొవ్వూరులలో, 27న తణుకు, గుంటూరులలో నిర్వహించామన్నారు. 28న జిల్లెళ్ళమూడి, నెల్లూరులలో, 29న తిరుపతి, కడపలలో, 30న అనంతపురం, కర్నూలు లలో, 31న గుడివాడ, విజయవాడలలో జరుపుతున్నామని చెప్పారు. సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమం విజయవాడలో ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత కళాశాలలో జరుగుతుందన్నారు. సప్తాహం కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు భారతం, భాగవతంతో పాటు ఇతర క్విజ్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సంస్కృతంలో విశేష కృషి చేసిన వారికి సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగష్టు 29న తెలుగు భాషను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన గిడుగు రామూర్తి జయంతికి తెలుగు భాషా, తెలుగు సంస్కృతికి విశేషంగా కృషి చేసిన తెలుగు భాషా ప్రముఖులకి అవార్డు బహుకరణ ఉంటుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ శ్రావణ పౌర్ణిమ రోజున సంస్కృత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శారద నికేతనానికి మహాత్మా గాంధీ విచ్చేశారని, ఇది గొప్ప ముదావహం అన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సంస్కృత భాషలో ఉన్న జ్ఞానాన్ని అందించి, ఆకర్షితులను చేయాలని సూచించారు. ఉత్సవ ప్రముఖులు డా. దీవి నరసింహ దీక్షిత్ మాట్లాడుతూ సంస్కృత భాష సరళమైన భాష అని చెప్పుటకు ఏర్పాటు చేసిన మంచి కార్యక్రమం అన్నారు. సంస్కృత విద్యార్థి పి.శ్రీవాణి మాట్లాడుతూ సంస్కృత భాష వైశిష్ట్యాన్ని వివరించారు. సంస్కృత పండితులు డా. పి.టి.జి రంగాచార్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి,సంస్కారానికి సంస్కృత భాష గొప్ప వారధి అన్నారు. సంస్కృతపడితులు డా. శ్రిష్టి లక్ష్మీకుమార శర్మ, డా. ఆకెళ్ళ మల్లు సోమయాజులు, సుఖవాసి మల్లిఖార్జునరాయ శాస్త్రి,కూనిశెట్టి స్వరాజ్య లక్ష్మి తదితరులను సత్కరించారు. ఈకార్యక్రమంలో తెలుగు, సంస్కృత అకా డమీ ఉప సంచాలకులు డా. పి.కోటిరత్నం, శారదా నికేతన్ ఓరియంటల్ కళాశాల కార్యనిర్వహణ టి.శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు ఆరిఫ్ బేగ్, కార్యనిర్వాహకులుడా.మరుధూరి నరసింహాచార్య,డా.పి.దేవేంద్ర గుప్తా,పాల్గొన్నారు.

# ఎపి,తెలంగాణ జల వివాదాలపై సెప్టెంబర్ 7న ఢిల్లీలో సిడబ్ల్యుసి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు27:** ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా, గోదావరి జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ రెండో సమావేశం సెప్టెంబర్ 7న న్యూఢిల్లీలో జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన గతేడాది జూలై 16న ఢిల్లీలో తెలంగాణ, ఏపీ సిఎంలతో నిర్వహించిన సమావేశంలో సంప్రదింపుల ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవడానికి ఓ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకోగా, కమిటీ తొలి సమావేశం గత జనవరి 30న జరిగింది. తదుపరి సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలతో ఎజెండాను ప్రతిపాదించాలని రెండు రాష్ట్రాలకు ఆ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ సూచించారు.పోలవరం -బనకచర్ల/నల్లమల్లసాగర్ ప్రాజెక్టుపై ఈ కమిటీ సమావేశాల్లో చర్చించడానికి అప్పట్లో తెలంగాణ అభ్యంతరం తెలిపింది.

# నేపాల్‌లో కుప్పం వాసి అదృశ్యం!

## యుఎస్ఎ నుంచి హైదరాబాద్, ఆపై నేపాల్‌కు పయనం

**కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త :** నేపాల్ దేశంలో సంభవించిన అకాల వరదల్లో ఓ కుప్పం వాసి అదృశ్యమైన సంఘటన గురువారం వెలుగు చూసింది. మానస సరోవర్ యాత్రకు వెళ్లి ఈనెల 28న హైదరాబాద్‌కు తిరిగి రావాల్సిన అతని ఆచూకీ కానరాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుప్పం పట్టణంకు చెందిన ప్రముఖ న్యాయవాది విఎస్ శ్రీకాంత్ సోదరుడు విఎస్ బాల సుబ్రమణ్యం అమెరికా దేశంలో గ్రీన్‌హోల్డర్‌గా ఉంటున్నారు. ఆయన యుఎస్ఎ నుంచి హైదరాబాద్‌లో ఉన్న తన అత్తమామల ఇంటికి వెళ్లాడు. ఈనెల 13వతేది బాలసుబ్రమణ్యం ఈశా కైలాష్ (ఫౌండేషన్)గ్రూప్ అధ్వర్యంలో మానస సరోవర్ యాత్రకు హైదరాబాద్ నుంచే బయలుదేరి వెళ్లాడు. ఈనెల 25వతేది మం గళవారం సైతం బాలసుబ్రమణ్యం తమకు ఫోన్ చేశాడని ఈనెల 28న హైదరాబాద్‌కు వస్తానని బాలసుబ్రమణ్యం చెప్పినట్లు ఆయన సోదరుడు శ్రీకాంత్ తెలిపారు. అయితే మంగళవారం నుంచి అతని నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవ డంతో పాటు నేపాల్‌లో అకాల వరదల బీభత్సం గురించి తెలియడంతో తాము ఆందోళనకు లోనవుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఇమ్మిగ్రేషన్ వద్ద సుమారు 73మంది యాత్రికుల బృందంలో తన సోదరుడు సైతం ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంగా తాను తన సోదరుడి ఆచూకీ కోసం సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు వినతిచేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంగా వారు సైతం స్పందించారన్నారు. తన తమ్ముడి ఆచూకీ కనుగొని కుప్పంకు చేర్చాలని న్యాయవాది శ్రీకాంత్ కోరారు. కాగా అదృశ్యమైన బాలసుబ్రమణ్యంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా మంత్రి లోకేష్ నేపాల్‌లో చిక్కుకున్న



బాలసుబ్రమణ్యం(ఫైల్)

ఎపి యాత్రికుల యోగక్షేమాలపై సమీక్షిస్తున్నారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఎపి యాత్రికుల క్షేమ సమాచారాలను ఢిల్లీలోని ఎపి భవన్ అధికారుల ద్వారా తెలుసుకుంటున్నారు. కాగా నలుగురు యాత్రికులు సురక్షితంగా ఉన్నారని కుప్పం ప్రాంతంకు చెందిన బాలసుబ్రమణ్యం, ఈశ ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్,రాజ్యలక్ష్మిల ఆచూకీ లభించ లేదని ఎపిభవన్ అధికారులు వెల్లడించారు. అదృశ్యమైన ముగ్గురిఆచూకీ కనుగొనేందుకు కేంద్రంతో నిరంతరం చర్చలుజరపాలనిమంత్రి పేర్కొన్నారు.

# హెచ్‌పివి వ్యాక్సిన్ 98.47శాతం పంపిణి

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

## మిగిలిన 5,269 మందికి 31లోగా ఇచ్చేందుకు చర్యలు

## కొత్త వారి కోసం కూడా రాష్ట్రానికి 1.90 లక్షల డోసుల వ్యాక్సిన్ త్వరలో రాక




**విజయవాడ, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** హెచ్‌పివి టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడిం చారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను 14- 15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి 3,40,108 మంది (98.47శాతం )కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా 14 ఏళ్లు నిండిన బాలికల కోసం కూడా. తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47 శాతం మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి వ్యాక్సిన్ కోసం నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలని అధికారులు సూచించారు.

వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి. దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు.

**రియాక్షన్ కేసులు లేవు:** వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. " గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతమైంది. సురక్షితమైంది కూడా. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే వేచి ఉంటున్నారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. గార్డాసిల్4 క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సింగిల్ డోస్ విధానంలో 0.5 మి.లీ. మోతాదుగా ఎడమ పైభుజంలో ఇంట్రా మస్క్యులర్‌గా ఇస్తున్నారు అని చక్రధర్‌బాబు వివరించారు. జిల్లాల వారీగా టీకా సాధన100 శాతం, అంతకంటే ఎక్కువ సాధించిన వాటిలో అనకాపల్లి (103.93శాతం ), బాపట్ల (103.54 శాతం), చిత్తూరు (102.15శాతం ), కాకినాడ (103.51శాతం ), కోనసీమ (104.12 శాతం), కృష్ణా (103.52శాతం ), కర్నూలు (100.72శాతం ), మార్కాపురం (112.64శాతం ), నంద్యాల (101.83శాతం ), ఎన్‌టీఆర్ (100.58శాతం), పల్నాడు (103.49శాతం ), పార్వతీపురం మన్యం (101.51 శాతం), తిరుపతి (103.67 శాతం), వైఎస్సార్ (105.00శాతం ).90నుంచి 99.99 శాతం సాధించిన జిల్లాలను గమనిస్తే అనంతపురము (94.57 శాతం ), అన్నమయ్య (95.81శాతం ), తూర్పు గోదావరి (99.52 శాతం), ఏలూరు (94.30 ), ప్రకాశం (96.45), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (95.22శాతం), శ్రీసత్యసాయి (96.37 శాతం), శ్రీకాకుళం (98.12శాతం), విశాఖపట్నం (92.31శాతం),విజయనగరం (98.84శాతం), పశ్చిమ గోదావరి (99.19శాతం ) 90 శాతం కంటే తక్కువ సాధించిన జి ల్లాలు గమనిస్తే అల్లూరి సీతారామరాజు (54.51 ), గుంటూరు (87.20 ), పోలవరం (73.68 )లు ఉన్నాయి.

# అంతర్జాతీయ క్రీడల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

## ఖేలో ఇండియాలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశంలోని క్రీడాకారులు, యువతతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యక్షంగా సంభాషించారు. అంతర్జాతీయ క్రీడల్లో క్రీడాకారులు మరింత రాణించాలని, భారత పతాకం రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. ఖేలో ఇండియా డైలాగ్ - ఖేల్ కీ బాత్, ప్రధాని మోడీతో అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లు, యువత, యువ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. సుమారు 1,500కి పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని క్రీడా రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో క్రీడా సంస్కృతిని పటిష్టం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి ప్రతిభను వెలికితీయడం అత్యంత ఆవశ్యకమని నొక్కిచెప్పిన మోడీ, ఆడేవాడే ఆనందంగా వికసిస్తాడు" అనే బలమైన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు, క్రీడా రంగానికి చెందిన ప్రతీ ఒక్కరికీ ప్రధాని మోడీ జాతీయ క్రీడా దినోత్సవ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, వర్ధమాన క్రీడాకారుల గుర్తింపు, సరైన శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ వినియోగం, క్రీడాకారుల భవిష్యత్తుకు భరోసా వంటి కీలకమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఖేలో ఇండియా ఉద్యమం ద్వారా చిన్న చిన్న నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మౌలిక వసతులు, వనరుల కొరత ఉన్న ప్రాంతాలకు సైతం క్రీడా సౌకర్యాలను చేరువ చేసి, క్రీడా కారులకు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలు స్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా, అంత ర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరె పలాడించే దిశగా, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్‌ను క్రీడా రరంగంలో అగ్రగామిగా నిలిపేం దుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాబోయే ఏళ్లలో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఇప్పటి నుంచే అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రణాళిక అని వెల్లడించారు. ఈ దిశగా క్రీడల్లో భారత్‌ను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై యువత కూడా తమ సలహాలు, సూచనలను ప్రధానితో పంచుకున్నారు. క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం సాధ్యమని పునరు ద్ఘాటిస్తూ, మోడీ మరోసారి ఆడేవాడే ఆనందంగా వికసిస్తాడు అని గుర్తుచేస్తూ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.

# రాట్కో మ్లాడిచ్ మృతి

## 84 యేళ్ల వయసులో కన్నుమూత



**సరజేవో, ఆగస్టు 27:** బోస్నియా యుద్ధంలో మారణహోమం, యుద్ధ నేరాలకు పాల్పడినట్లు తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ బోస్నియన్ సెర్బ్ సైనిక కమాండర్ రాట్కో మ్లాడిచ్ 84 ఏళ్ల వయసులో మృతి చెందాడు. నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని జైలు ఆసుపత్రిలో ఆయన కన్నుమూసినట్లు ఐరాస అధికారి, ఆయన న్యాయవాది వెల్లడించారు. యుగోస్లావియా విచ్ఛిన్నం అనంతరం 1992-95 మధ్య జరిగిన బోస్నియా యుద్ధంలో మ్లాడిచ్ అత్యంత కీలక వ్యక్తిగా ఉన్నాడు. సారాజేవో ముట్టడికి నాయకత్వం వహించిన ఆయన యుద్ధంలో జరిగిన అత్యంత దారుణమైన అకృత్యాలకు బాధ్యుడిగా నిలిచాడు. బోస్నియన్లు, క్రొయాట్లను లక్ష్యంగా చేసుకుని బోస్నియన్ సెర్బ్ దళాలు చేపట్టిన జాతి నిర్మూలన కార్యక్రమంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. 2017లో ఐరాస యుద్ధ నేరాల ట్రైబ్యునల్ మ్లాడిచ్‌ను మారణహోమం, మానవాళికి వ్యతిరేక నేరాలు, యుద్ధ నేరాల్లో దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించింది. 1995లో జరిగిన స్రెబ్రెనికా మారణహోమం కూడా ఆయనపై నమోదైన నేరాల్లో ప్రధానమైనది. ఈ ఘటనలో 8,000 మందికి పైగా బోస్నియాక్ ముస్లిం పురుషులు, బాలురను హతమార్చారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో జరిగిన అత్యంత ఘోరమైన దారుణంగా దీనిని పరిగణిస్తారు. మ్లాడిచ్ 2011లో సెర్బియాలో అరెస్టయ్యే వరకు దాదాపు 16 ఏళ్ల పాటు పరారీలో ఉన్నాడు. అరెస్టు అనంతరం ఐరాస కస్టడీలోనే ఉన్నాడు. ఇటీవలి సంవత్సరాల్లో ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పలుమార్లు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బోస్నియా యుద్ధంలో 1 లక్ష మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 10 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. మాజీ యుగోస్లావియా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ విచారణలో మ్లాడిచ్ బోస్నియన్ సెర్బ్ రాజకీయ నేత రాడోవన్ కరాడ్జిచ్, మాజీ సెర్బియా అధ్యక్షుడు స్లోబోదాన్ మిలోసెవిచ్‌లతో కలిసి నేరపూరిత కుట్రలో భాగస్వామిగా ఉన్నట్లు తేలింది. గ్రేటర్ సెర్బియా కోసం తమకు కావాల్సిన ప్రాంతాల నుంచి సెర్బియాయేతరులను తొలగించడమే ఈ కుట్ర లక్ష్యమని ట్రైబ్యునల్ పేర్కొంది. మ్లాడిచ్ తనపై వచ్చిన ఆరోపణలను చివరి వరకు తిరస్కరించాడు. విచారణ సమయంలోనూ పెద్దగా పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. ఆయన మరణంతో బాల్కన్ యుద్ధాల్లో అత్యంత అపఖ్యాతి పాలైన సైనిక కమాండర్లలో ఒకరి జీవితం ముగిసినప్పటికీ ఆయన నాయకత్వంలో జరిగిన అకృత్యాల ప్రభావం బోస్నియాహెర్జెగోవినాలో ఇప్పటికీ కొనసాగుతోంది.స్రెబ్రెనికా మారణహోమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు, బాధితులు మ్లాడిచ్‌కు విధించిన శిక్షను న్యాయం దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

# 50 కోట్లు దాటిన జనధన్ ఖాతాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** దేశంలో ఆర్థిక సమ్మిళితతను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి జనధన్ యోజన దాదాపు తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుంది. 2014 ఆగస్టు 28న ప్రారంభమైన ఈ పథకం కింద 2023 ఆగస్టు 9 నాటికి జనధన్ ఖాతాల సంఖ్య 50 కోట్లు దాటింది.బ్యాంకులు సమర్పించిన తాజా నివేదికల ప్రకారం మొత్తం జనధన్ ఖాతాల్లో 56 శాతం మహిళలకు చెందినవే కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. ఈ ఖాతాల్లోని మొత్తం డిపాజిట్లు రూ.2.03 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. అలాగే, సుమారు 34 కోట్ల రూపే కార్డులను ఖాతాదారులకు ఉచితంగా జారీ చేశారు. జనధన్ ఖాతాల్లో సగటు బ్యాలెన్స్ రూ.4,076గా ఉంది. 5.5 కోట్లకు పైగా జనధన్ ఖాతాలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అంటే డిబిటీ ప్రయోజనాలు అందుతున్నాయి. ప్రధానమంత్రి జనధన్ యోజన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు దోహదపడిందని ప్రభుత్వం పేర్కొంది. పెద్ద సంఖ్యలో పెద్దలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా దేశంలో బ్యాంకు ఖాతాల విషయంలో దాదాపు సంపూర్ణ స్థాయికి చేరుకునేలా ఈ పథకం సహాయపడింది.సాంకేతికత, పరస్పర సహకారం, వినూత్న విధానాలను ఉపయోగించుకుని బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న చివరి మైలును కూడా అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించడమే పిఎంజెడివై విజయానికి ప్రధాన కారణమంది.


దేవాదాయ ధర్మదాయశాఖ ఆం.ప్ర.

శ్రీ గుంటి గంగమ్మ దేవతా దేవస్థానము

చింతపర్తి గ్రామం, వాయల్పాడు మం॥, అన్నమయ్య జిల్లా.

e-Procurement Tender

NIT.No.P/COE/1614/2026, Dt. 24.07.2026

ఆలయ పునర్నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వహణాధికారిణి

దేవాదాయ ధర్మదాయశాఖ ఆం.ప్ర.ప్ర.

శ్రీ నేల మల్లేశ్వర స్వామి దేవస్థానము

తవళం గ్రామం, నిమ్మనపల్లి మం॥, అన్నమయ్య జిల్లా.

e-Procurement Tender

NIT.No.P/COE/1154/2026, Dt. 14.06.2026

మండపం, ప్రహరీగోడ నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వహణాధికారిణి

వార్త


శత్రువులోని మంచిని, మిత్రుడిలోని చెడును సమదృష్టితో చూడగలవాడు మహాత్ముడు.

న-కన్ఫూషియస్

# మానవాళి తప్పిదాలతోనే.. విపత్తులు!


హటాత్తుగా సంభవించిన విపత్తుకు హిమాలయ దేశం నేపాల్ చివురుటాకులగా వణికిపోయింది. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్య మార్పులు వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. హటాత్తుగా సంభవించిన మూడు జిల్లాల వరదలకు మృతులసంఖ్య ఐదు వందలకు చేరిందని అంచనా. ఇంచుమించుగా 1400మందికిపైగా ఆచూకీ కోసం అన్వే షిస్తున్నారంటే నేపాల్ చరిత్రలో ఇంతటి భారీ ఉపద్రవం ఇంతకుముందెన్నడూ చూడలేదనే చెప్పాలి. గ్రామాలకు గ్రామాలే కొట్టుకునిపోయాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు కావడంతో ముందు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం ప్రధాన బాధ్యతగా మారింది. అసలే పర్యాటక దేశం కావడంతో 30 దేశాలకు పైగా యాత్రీకులు ఈ దేశ పర్యటనకు వచ్చారు. ఆకస్మిక వరదల్లో వీరంతా ఏమ య్యారన్నదే ఆయా దేశాల ఆందోళన. ఇంతటి భారీ విపత్తుకు మానవాళి తప్పిదాలేనా, లెక్కకుమించిన అంచనాలను అధిగమించిన పారిశ్రామికీకకరణ కూడా కారణమేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. హరిత వనాలు అంతరించిపోతూ ఆ ప్రాంతాల్లో పట్టణీకరణ పెరగడం కూడా ఇందుకు కారణమన్న పర్యావరణ వేత్తల హెచ్చరికలు పట్టించుకోకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం అన్న భావన వ్యక్తం అవుతోంది. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది నిందించాల్సింది మానవుని పర్యావరణ విధ్వంసక చర్యలే బీభత్సాలకు, విపత్తులకు కారణం అవుతున్నాయని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేసాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకున్న నాధుడే లేకుండా పోతున్నాడు. అభివృద్ధి పేరుతో ఆయా దేశాల ప్రభుత్వాలు చేస్తున్న కొన్ని కార్యక్రమాలు పర్యా వరణానికి చేటుచేస్తున్నాయి. తాజాగా ప్రకృతి ధాటికి బుధవారం నేపాల్ చివురుటాకులగా వణికిపోయింది. రాజధాని ఖాట్మండు సమీపంలోని రాసువా, దాడింగ్ జిల్లాల ఎగువప్రాంతాల్లో సంభవించిన ప్రకృతి ప్రకోపంతో మంచుకొండ విరిగిపడటంతో అనూహ్య రీతిలో నది ప్రవాహం నీటిమట్టాలు పెరిగాయి. ఒక్కసారిగా మెరుపు వరదలు సంభవించి లోతట్టుప్రాంతాలను ముంచెత్తి వేసాయి. టిబెట్‌లో మొదలయిన వరద, బురద ఉప్పెన ఉరుముల్లేని మెరుపుల్లా వచ్చి నేపాల్ మధ్యప్రాంతాన్ని దాదాపు తుడిచిపెట్టేసిందనే చెప్పొచ్చు. గ్రామాలు, పట్టణాలు జలసమాధి అయ్యాయి. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం దాదాపు 500 మందికిపైగా మృతిచెందినట్లు చెపుతుంటే వీరిలో భారతీయులే 300మందికిపైగా ఉన్నారు. వాస్తవంగా నేపాల్, టిబెట్ సరిహద్దుల్లోని బోటికోశి నది బుధవారం ఉదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. మొత్తంగా ఏడు జిల్లాలకు పైగా విరుచుకుపడింది. అమెరికా, మలేసియా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, నెదర్లాండ్స్, దక్షిణకొరియా తదితర దేశాల నుంచి వచ్చిన పర్యాటకుల జాడ తెలియడంలేదని చెపుతున్నారు. ఆ వరద ధాటికి నేపాల్ చైనా రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసం అయింది. బురదలో కూరు కుపోయిన ఆ ప్రాంతాన్ని భీతావహంగా మార్చింది. ఎటుచూసినా అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద సాయం కోసం అర్థిస్తున్న జనం హాహాకారాలతో ఆప్రాంతం విషాద వాతావరణం రాజ్యమేలింది. సమాచారం అందుకున్న నేపాల్ సైన్యం సాయుధ పోలీస్ బలగాలు, నేపాల్ పోలీసులు జాతీయ విపత్తు విభాగ బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన తీసుకున్నారు. అయితే మంచు కొండ విరిగిపడి వరదలు ఉధృతంగా వస్తున్న విషయం దాదాపు 45 నిమిషాలముందే చైనాకు తెలిసినా ఏమాత్రం సంకేతాలివ్వలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను చైనా తోసిపుచ్చుతున్నది. భారత్‌లోకూడా ఈ ఉపద్రవాలకు ఏమాత్రం లోటులేదు. మొన్న ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో వరదల బీభత్సాన్ని చవిచూసింది. గతంలో కేరళలాంటి దేవభూమి, అసోంలలో వరదలతో ప్రకృతి బీభత్సం సృష్టించింది. భారత్ ఉపద్రవాల మాట ఎలా ఉన్నా తరచూ భూకంపాలకు లోనయ్యే నేపాల్‌లో ఈసారి చైనా సరిహద్దువైపునుంచే ముప్పేట ముప్పు వచ్చిందన్న ఆరోపణలకు ఈ వరదలు కూడా కారణం అవుతున్నాయి. ఈ ఆరోపణలకు మూలం కూడా ఉంది. నేపాల్,భారత్ సరిహద్దుల్లో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని చైనా భారీ ఎత్తున జలవిద్యుత్‌ప్రాజెక్టులు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుపరిధిలో నీటిని వదిలిన పక్షంలో ముందుగా దెబ్బతినేది నేపాల్ ప్రాంతం. ఆపై భారత్‌లోని ఈశాన్యప్రాంతం అని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ ఆరోపణలన్నింటినీ డ్రాగన్ పాలకులు ఖండిస్తున్నా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్లనే ఇలాంటి ముప్పు సంభవిస్తున్నదని విదేశీ శాస్త్రసాంకేతిక సంస్థలు చేస్తున్న హెచ్చరికలు ఈ దేశం పెడచెవిన పెట్టిందన్న భావన వ్యక్తం అవుతోంది. ముందు భూ కంపం వల్లనే ఈ వరదలు సంభవించాయని ఒకింత ఆందోళన వ్యక్తంచేసినా భారత అంతరిక్ష సంస్థ ఇస్రో, ఎన్ఆర్ఎస్ఎ, అమెరికా భూగర్భసర్వే సంస్థలు చేసిన అధ్యయన నివేదికలతో కేవలం మంచుకొండ పగలడం వల్లనే దిగువ ప్రాంతం మొత్తం జలమయం అయినట్లు నిర్ధారించారు. ఇలాంటి ఉపద్రవాల సమయంలో జరిగే ప్రాణ, ఆస్తినష్టాలను తగ్గించుకోగలిగితే అదే మేలు. ప్రస్తుత పరిస్థితుల నుంచి కోలుకునేందుకు ఈ దేశానికి వందలకోట్ల సాయం అవసరమేనన్నది నిర్వివాదాంశం. ఇలాంటి విపత్కరంలోనే ప్రపంచదేశాలు ఆపన్న హస్తం అందించాల్సిన అవసరముందని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.

మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.



జాన్ కెనడీ

యజమాని కావడం కోసం సేవకుడిగా నటిస్తాడు రాజకీయ నాయకుడు.



చార్లెస్ డీగాల్

# సాంకేతిక సాక్ష్యాలను చట్టంలో చేర్చండి!

**నిజాలు బహిర్గతం కావడానికి ఒక అవకాశం ఉన్నట్లే అని ఎందుకు భావించకూడదు? పోలీసులు 'ఫేషియల్ రికగ్నిషన్‌న ఎక్విప్మెంట్ గొడవ జరుగుతున్న ఏరియాలో ఉందనీ, దాన్ని వినియోగించుకున్నామని ఎఫిడవిట్ ద్వారా కోర్టుకు తెలియపర్చారు. (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు) అయితే ఈ ఎక్విప్మెంట్ ప్రైవేట్ కాంట్రాక్టర్స్ ద్వారా వినియోగించుకోవడం జరిగింది. ఆ విధంగా చేయడం చట్టపరమా కాదా అనేది తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఫేషియల్ ఎక్విప్మెంట్ వాడేందుకు చట్టమేమీలేదు. చట్టపరంగా చెల్లే విషయాన్ని అటుంచితే ముందుముందు ఇలాంటి ఉద్యమాలు చేసే వారికి ముఖ్యంగా జొరబడే సంఘ విద్రోహులకు భయాన్ని మాత్రం కలిగిస్తుంది. రైట్ టు ప్రైవసీ లాంటి విషయాలు కూడా వాదనపరంగా బయటకు వస్తాయి. చట్టపరమైన నిబంధనలు ఇలాంటి సాక్ష్యాలను బయటపెట్టే విషయంలో పరికరాల వాడకాన్ని ప్రభుత్వాలు చేయగలుగుతే పోలీసులు చట్టపరంగా పనిచేసే అవకాశం మరింతగా పెరుగుతుంది.**



రావులపాటి సీతారాంరావు

పోలీసు దర్యాప్తు కొత్త పుంతలు త్రొక్కుతున్న మాట నిజం! అయితే ఈ దర్యాప్తు చట్ట ప్రకారంగానే వుందా అన్న అనుమానాలు మీడియాతో పాటు,మేధావులు కూడా లేవనెత్తుతున్నారు! చట్టపరంగా పోలీసు పనితనాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం సాంకేతికంగా అభివృద్ధి జరుగుతున్న ఈ తరుణంలో అవసరంగా మారింది! ప్రభుత్వాలు ఈ సందర్భంగా చట్టపరమైన నిబంధనలు త్వరగా చేయక తప్పదు!పోలీసులు చట్టానికి బాధ్యులు! చట్టప్రకారం ఏ చర్య అయినా వుండక తప్పదు! స్వాతంత్ర్యం తర్వాత కూడా పోలీసులను ప్రజలు తమలో కలుపుకోలేకపోతున్నారు. ఇప్పుడు ఆ కారణాలను వెతకాల్సిన అవసరం ప్రస్తుతానికి లేదు! బ్రిటిష్ వారి పాలనలో పోలీసులను మన దేశస్థులతో కఠినంగా వ్యవహరించే రీతిలో తీర్చిదిద్దారు! వారి అవసరాల నిమిత్తమే వాడుకున్నారు. అయితే బ్రిటిష్ దేశంలోని పోలీసులను మరోవిధంగాఅక్కడి ప్రభుత్వాలు చూసుకున్నాయి! ఇక్కడి పోలీసుల ముందు నిందితులు నేరాన్ని ఒప్పుకుంటే అది ఇక్కడి చట్టం ఒప్పుకోదు! అలాంటి నిబంధన ఏ ఇతర దేశాల్లో కూడా లేదని అంటారు. బ్రిటిష్ వారు వారి స్వార్థం కోసం అలాంటి పోలీసు యాక్టను అమలు చేసారు. వారు దేశం వదిలి వెళ్ళిన తర్వాత మన రాజ్యాంగ నిపుణులు కానీ,రాజకీయ నాయకులు కానీ, ప్రజాస్వామ్య వాదులు కానీ, ఈ చట్టాలను ముఖ్యంగా పోలీసులకు సంబంధించిన నిబంధనలను సవరించక పోవటంవల్ల, మన దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మార్పులు,చేర్పులూ తేకపోవటం వల్ల ఇంకా మన పోలీసును మనమే నమ్మలేని స్థితిలో వున్నాం,వుంచుతున్నాం! బ్రిటిష్ పాలకులు మన దేశం వదిలి వెళ్లినా మన రాజకీయ నాయకులు ప్రజాస్వామ్య పరిధిలో పోలీసుల వృత్తి వ్యవహారాలకు సంబంధించి తగు మార్పులు, సంస్కరణలు పేరుకే తలపెట్టారు కానీ, వాటిని ఆచరణలో పెట్టిన దాఖలాలు లేనే లేవు! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ ఎనభై ఏళ్ల చరిత్ర తవ్వకోవాల్సిన అవసరం లేదు కానీ ఇప్పటి పాలకులు, అప్పటి పాలకులు వదిలివెళ్ళిన తర్వాత పోలీసులకు ఏం చేసారు అని విశ్లేషించుకోవటానికి పదవిలో వున్న రాజకీయ నాయకులు ఎవర్ని అడిగినా, చిరునవ్వుతో 'అడిగినవన్నీ ఇస్తున్నాం కదా! గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీసు దళాలు పోలీసులకు ఇళ్ళు కట్టించటాలు' లాంటివి ఏకరవు పెడ్తారు! అదే మాటను అధికారంలో లేని వారిని అడిగితే 'అవ్వన్నీ మేము ఇచ్చినవే కదా! వాళ్ల ఖాతాలో వేసుకుంటున్నారు! అయినా పోలీసులు మాత్రం తక్కువా? ఎవరు పవర్లో వుంటే వారి భజనే చేస్తారు!' అని సన్నాయినొక్కులు బోనస్‌గా ఇస్తారు! పూర్వం రాజుల దగ్గర వుండే 'దెబ్బల అబ్బాయి' పరిస్థితిలా మారింది!ఎవరు అధికారంలో వున్నా, ప్రజాస్వామ్య పరిధిలో వున్నా, పోలీసుల పనితీరు ఎవరు అధికారంలో వుంటే వారికే వత్తాసు పలుకుతారు, చట్టాలకు కాదు అన్న అవగాహనతోనే ఈనాటి భారత పౌరులువుండటం దురదృష్టం! బ్రిటిష్ వారి పాలన తర్వాత పోలీసులకు సంబంధించినంతవరకూ సౌకర్యాలు కలిగించటం వేతనాలు పెంచటం, ఆరోగ్యభద్రత కల్పించటం లాంటి సంక్షేమ కార్యక్రమాలు ఏపార్టీ అధికారంలోకి వచ్చినా చేస్తునే వుంది.కానీ వారి 'ఇమేజ్'ను వృత్తిపరంగా వున్న బాధ్యతలను గౌరవించే ఏ చట్టం, ఏ సంస్కరణా, ఏ నిబంధనా, అర్ధవంతంగా చేయకపోవటం, విశ్లేషణలో ఒక భాగంగా ఎవరైనా ఎత్తిచూపినా రాజకీయ నాయకులు పట్టించుకోవటం లేదు. ప్రజలు ఎన్నికల సమయంలో ఓటు వినియోగించుకోవటం మాత్రమే ప్రస్తుత పరిస్థితుల వల్ల చేయగలుగుతున్నారు. పోలీసులు ఈ సందర్భంగా ఎవర్నీ నిందించలేని అగమ్యగోచర పరిస్థితులలో వున్నారు! అత్యున్నతాధికారులు (అందరూ కాదు ఎక్కువమంది) అధికారంలో వున్నవారి ఆదేశాలనే (చట్ట ప్రకారం కాకపోయినా) పాటిస్తున్నారు! ఇతర దేశాల్లోమాదిరి కనీసం పోలీసు ముందు నేరం ఒప్పుదలను చట్ట పరిధిలోకి తీసుకొని వచ్చే అవకాశం పరిశీలించండి అని ప్రభుత్వాలకు విన్నవించుకొనే పరిస్థితిని కూడా కోల్పోయారు. ఇక సంస్కరణల మాట సరేసరి! అటకెక్కిన రిపోర్టులతో సరిపుచ్చుకుంటున్నారు! అనేక వైవిధ్యభరితమైన నేరాలను కానీ,ఛాలెంజి ధోరణిలో విస్తరిస్తున్న శాంతి భద్రతల సమస్యలను కానీ అందుబాటులోకి వచ్చిన సాంకేతిక నైపుణ్యాన్ని క్రమపద్ధతిలో, శాస్త్రీయంగా వినియోగించుకొనే ఎన్నో అవకాశాలను, అవగాహన వున్నా నిష్ణాతులైన ఉన్నతాధికారులు ఇంకా కొందరు పోలీసు వ్యవస్థలో బలమైన స్థంభాలుగా మారి శాఖాపరంగా సామర్థ్యాన్ని పెంపొందించాలని తహతహలాడుతున్నా, వారికి అధికారంలో వున్న వారి తోడ్పాటు కాగితాలకే పరిమితమవుతున్నది! చట్టపరంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచే సామర్థ్యాన్ని చట్టాలు చేసే ప్రతినిధులు ప్రయార్టీ పరంగా ఎజెండాలోకి తీసుకోకపోవటం వల్ల పోలీసులు ప్రతి వైఫల్యానికీ జ్యుడిషియరీ ముందు తల దించుకోక తప్పటం లేదు. జ్యుడిషియరీ చాలా వరకు ఎత్తి చూపుతున్నా సవరించుకోవాల్సిన పాలకులుపట్టించుకోవటం లేదు! నిన్న గాక మొన్న ఢిల్లీ జంతర్ మంతర్ ఏరియాలో జరిగిన బొద్దింకల పార్టీ (కాక్రోచ్ జనతా పార్టీ) ఉద్యమంలో ఎందరో గాయపడ్డారు. పోలీసులకు కూడాగాయాలయ్యాయి! కేవలం విద్యార్థులే ఈ ఉద్యమంలో ఆవిధంగా బరితెగించటానికి కారణం పోలీసుల దురుసుతనం బలప్రయోగం పెల్లెట్లు తగిలేలా, లాఠీఛార్జీ భాష్పవాయు ప్రయోగాలతో సహా ఎన్నో చట్ట విరుద్ధమైన యాక్షన్ల వల్ల ఈ పరిస్థితి ఉద్భవించింది అని అంటున్నారు. శాంతియుతంగా జరుగుతున్న 'ప్రొటెస్టు'ను కాదనే హక్కు ఈ ప్రజాస్వామ్యంలో లేదు అని గట్టిగా వాదిస్తున్న తరుణంలో, పోలీసులు,సంఘ విద్రోహ శక్తులు ఈ ఉద్యమంలో జొరబడటం వల్లపోలీసుల చేయిదాటే పరిస్థితి ఏర్పడింది అని చెపుతున్నారు! సాక్ష్యాలు పోలీసుల వాదాన్ని బలపర్చేవి అఫిడవిట్ల ద్వారా ప్రవేశపెట్టమని సుప్రీంకోర్టు అడుగుతున్న నేపథ్యంలో నిజానిజాలు కొందరు (పోలీసులకు సానుభూతి పరులే కావచ్చు) పరిశీలించినప్పుడు కొన్ని విషయాలు బయటపడ్డాయి అని చెబుతున్నారు. 'ఫేస్ రికగ్నిషన్' ద్వారా (మొహం ద్వారా మనిషిని గుంపులో గుర్తుపట్టడం) ఈ మధ్య సాంకేతికంగా, నేరస్థులను పట్టుకుంటున్నారు. సిసి కెమెరాలతోసహా ఈ సాక్ష్యాలు చట్టపరంగా ప్రస్తుత చట్టాలు ఒప్పుకుంటాయా లేదా అనేది అనుమానాస్పదంగా మారింది. నిజాలు బహిర్గతం కావడానికి ఒక అవకాశం ఉన్నట్లే అని ఎందుకు భావించకూడదు? పోలీసులు 'ఫేషియల్ రికగ్నిషన్‌న ఎక్విప్మెంట్ గొడవ జరుగుతున్న ఏరియాలో ఉందనీ, దాన్ని వినియోగించుకున్నామని ఎఫిడవిట్ ద్వారా కోర్టుకు తెలియపర్చారు.(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు) అయితే ఈ ఎక్విప్మెంట్ ప్రైవేట్ కాంట్రాక్టర్స్ ద్వారా వినియోగించుకోవడం జరిగింది. ఆ విధంగా చేయడం చట్టపరమా కాదా అనేది తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఫేషియల్ ఎక్విప్మెంట్ వాడేందుకు చట్టమేమీలేదు. చట్టపరంగా చెల్లే విషయాన్ని అటుంచితే ముందు ముందు ఇలాంటి ఉద్యమాలు చేసే వారికి ముఖ్యంగా జొరబడే సంఘ విద్రోహులకు భయాన్ని మాత్రం కలిగిస్తుంది. రైట్ టు ప్రైవసీ లాంటి విషయాలు కూడా వాదనపరంగా బయటకు వస్తాయి. చట్టపరమైన నిబంధనలు ఇలాంటి సాక్ష్యాలను బయటపెట్టే విషయంలో పరికరాల వాడకాన్ని ప్రభుత్వాలు చేయగలుగుతే పోలీసులు చట్టపరంగా పనిచేసే అవకాశం మరింతగా పెరుగుతుంది. ●




# అన్ని భాషలకు ఆధారమైనది సంస్కృతం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఇండో యూరోపియన్ మాండలికాల నుండి ఆవిర్భవించిన అతి పురాతన సంస్కృత భాష హిందూ సమాజ ఆదరణ, ఆధ్యాత్మిక భావనలకు ప్రతిరూపంగా కొనసాగుతున్నది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలకు నెలవుగా సంస్కృతం పేరు గాంచింది. భారతీయ నాగరితతో విడదీయరాని బంధాలను పెనవేసుకున్న సంస్కృత భాష ప్రాధాన్యాన్ని, ప్రయోజనాలను, పునరుజ్జీవన ప్రయత్నాలను, రేపటి తరానికి భాష రుచిని పరిచయం చేయడం, భాషా సౌందర్యాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏటా శ్రావణ మాస పూర్ణిమ పుణ్య గడియల్లో, అనగా 28 ఆగష్టు 2026న 'విశ్వ సంస్కృత దివస్' లేదా 'ప్రపంచ సంస్కృత దినోత్సవం' పాటించడం 1969 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి రోజున ప్రపంచ సంస్కృత దినం జరుపుకోవడం పరిపాటిఅయింది. ప్రముఖ సంస్కృత పండితుడు, వ్యాకరణ కర్త అయిన పాణిని జన్మదినం సందర్భంగా ప్రపంచ సంస్కృతి దినం పాటించడం ముదావహం. అత్యంత పురాతనమైన సంస్కృత భాషకు ప్రత్యేక లిపి ఇతర భాషల నుంచి ఉద్భవించింది. పాణిని, కాళిదాస్, పతంజలి, వేదవ్యాసుడు, ఆదిశంకరాచార్యుడు లాంటి ప్రముఖులు సంస్కృత భాషకు పట్టం కట్టిన వ్యక్తులుగా నిలిచిపోయారు. ఋషులను సంస్కృత సాహిత్య మూల వనరులుగా భావిస్తాం. అందువల్లనే శ్రావణిపూర్ణిమ లేదా రాఖీ పూర్ణిమను బుల్లిట్ పర్వంగానే కాకుండా ప్రపంచ సంస్కృత దినం పాటిస్తున్నాం. అన్ని భారతీయ భాషలకు తల్లి అయిన సంస్కృతాన్ని 'అన్ని భాషల తల్లి' అని పిలుస్తున్నాం. దాదాపు 3500 ఏండ్ల క్రితం భారతంలో పుట్టిన సంస్కృతాన్ని దేవతల భాషగా పిలుస్తాం. సంస్కృత భాషను కంప్యూటర్ సైన్స్, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత, గణితం, మత సంప్రదాయాలు, సాహిత్యం, కళల అభివృద్ధికి ఉపగించడం సంతోషదాయకం. సంస్కృత భాష నుంచి ప్రఖ్యాత నినాదాలు పుట్టడం, ప్రజాదరణ పొందడం జరిగింది. 'సర్వే భవంతు సుఖినః (అందరూ సంతోషంగా ఉండాలి)', 'విద్యా దదాతి వినయం (జ్ఞానం వినయాన్ని ఇస్తుంది', 'సత్యం వధ ధర్మం చర (నిజం మాట్లాడండి, ధర్మాన్ని పాటించడం)', లోకః సమస్తాః సుఖినో భవంతు (అని లోకాల జీవులు సంతోషంగా ఉండాలి)' లాంటివి బహుళ ప్రచారం, ప్రభావాలను కలిగి ఉంటూ, సామాన్య జనాలు నాలుకల్లో నానుతూ ఉన్నాయి.కంప్యూటర్ సైన్స్, కృత్రిమమేథ,డిజిటల్ భాషాశాస్త్రంలో సంస్కృతం పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచ సంస్కృతదినం రోజున విద్యాలయాల్లో సంస్కృత శ్లోకాల పఠనం, వ్యాస రచన, ఉపన్యాస, పేయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించవచ్చు. అదే విధంగా సెమినార్లు, వెబినార్లు, కార్యశాలలు, ప్రవచనాలు లాంటి కార్యక్రమాలను కూడా నిర్వహించవచ్చు. విద్యార్థులు, యువత, భాషావేత్తలు, ఉపాధ్యాయులు, భాషా సంఘాలు చేయిచేయి కలిపి సంస్కృత పునర్వైభవానికి కృషి చేస్తూ, మన భాషా తల్లిని ప్రపంచమానవాళికి రుచి చూపే ముమ్మర ప్రయత్నాలు చేద్దాం. ●

# పిల్లల భవిష్యత్తు ఎవరి చేతుల్లో?

తరిగోపుల నారాయణస్వామి

ప్రస్తుత సమాజంలో పిల్లల పెంపకం, విద్య, క్రమశిక్షణ, మానసిక ఒత్తిడి వంటి అంశాలు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు తల్లిదండ్రులు చెప్పిన మాటకు, ఉపాధ్యాయులు చెప్పిన మాటకు ఎంతో విలువ ఇచ్చే పిల్లలు ఇప్పుడు చిన్నచిన్న విషయాలకే తీవ్రంగా స్పందిస్తున్న ఘటనలు మన ముందుకు వస్తున్నాయి. సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్య చేసుకోవడం, తల్లిదండ్రులు మందలించారని ప్రాణాలు తీసుకోవడం, ఉపాధ్యాయుడు మందలించాడని మనస్తాపానికి గురికావడం వంటి సంఘటనలు కేవలం పిల్లల సమస్యలుగా కాకుండా మొత్తం సమాజం ఆలోచించాల్సిన సమస్యలుగా మారాయి. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఇటీవల పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు ఒక ఉపాధ్యాయురాలిపై దాడి చేసి చంపిన తర్వాత, ఆమె ఇంట్లో ఉన్న నగదును కూడా తీసుకెళ్లిన ఘటన వెలుగులోకి రావడం. విద్యను అందించాల్సిన వయస్సులో ఉన్న పిల్లలు ఇంతటి దారుణానికి పాల్పడటం వెనుక ఉన్న కారణాలను మనం లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితికి పిల్లలను మాత్రమే నిందించడం సరైనదికాదు. పిల్లల ప్రవర్తనపై కుటుంబవాతావరణం, తల్లిదండ్రుల పెంపకం, పాఠశాల వాతావరణం, స్నేహితుల ప్రభావం, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక పరిస్థితులు, విద్యా పోటీ, మానసిక ఒత్తిడి వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్ పిల్లల జీవితంలో అవసరమైన సాధనంగా ఉండాల్సింది పోయి, కొన్నిసార్లు వారి జీవితంలో ప్రధానమైన వస్తువుగా మారుతోంది. పిల్లలకు ఫోన్ ఇవ్వకూడదని తల్లిదండ్రులు నిర్ణయించడంతప్పు కాదు, కానీ ఎందుకు ఇవ్వడం లేదో వారికి అర్థమయ్యేలా చెప్పడం ముఖ్యం. అదే సమయంలో పిల్లలు కోరిన ప్రతి దాన్ని కొనివ్వడం ప్రేమకు నిదర్శనం కాదని తల్లిదండ్రులు గుర్తించాలి. పిల్లల ప్రతి కోరిక తీర్చడం కంటే అవసరమైనది ఏది, అవసరం లేనిది ఏది అనే విషయాన్ని వారికి చిన్నప్పటి నుంచే నేర్పాలి. జీవితంలో ప్రతిదీ మనకు అనుకూలంగా జరగదని, నిరాశను కూడా ఎదుర్కోవాలని, తిరస్కారాన్ని కూడా స్వీకరించాలని పిల్లలకు తెలియాలి. మరోవైపు తల్లిదండ్రుల ఆశలు పిల్లలపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ప్రతి తల్లిదండ్రి తన బిడ్డ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకోవడం సహజమే. అయితే తమ బిడ్డ తప్పని సరిగా డాక్టర్ కావాలి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలి, ఐఏఎస్ కావాలి అనే కోరికలను పిల్లల ఆసక్తి, సామర్థ్యాలతో సంబంధం లేకుండా వారిపై రుద్దడం సరికాదు.పిల్లలప్రతిభను, అభిరుచిని, మానసిక స్థితిని గుర్తించి వారికి తగిన మార్గాన్ని చూపాలి. తల్లిదండ్రుల కలలకు విలువ ఉన్నట్లే పిల్లల కలలకు కూడా విలువ ఉంది. ప్రతి విద్యార్థి ఒకే విధంగా ఆలోచించడు, ప్రతి ఒక్కరిలో ఒకే రకమైన ప్రతిభ ఉండదు. కొందరికి చదువుపై ఆసక్తి ఉంటే మరికొందరికి క్రీడలు, కళలు, సంగీతం, సాంకేతిక రంగాలు లేదా ఇతర వృత్తులపై ఆసక్తి ఉండవచ్చు. పిల్లల భవిష్యత్తును నిర్ణయించే ముందు వారి మనసును అర్థంచేసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. మార్కులు జీవితానికి కొలమానం కావు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినంత మాత్రాన విద్యార్థి జీవితంలో విఫలమైన వ్యక్తికాదు. అలాగే ఎక్కువ మార్కులు సాధించినంత మాత్రాన జీవితంలో విజయం సాధించినట్లు కాదు.



విద్య అసలు లక్ష్యం కేవలం ఉద్యోగం సంపాదించడానికి అవసరమైన మార్కులు ఇవ్వడం కాదు, మంచి ఆలోచన, మంచి ప్రవర్తన, బాధ్యత, క్రమశిక్షణ,మానవత్వం, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం వంటి విలువలను పెంపొందించడం కూడా విద్యలో భాగమే. పిల్లలపై చదువు పేరుతో అంతులేని ఒత్తిడి పెంచితే వారు ఆ ఒత్తిడిని తట్టుకోలేక తప్పు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లల మార్కుల గురించి అడిగినంతగా వారి మనసు గురించి కూడా అడగాలి. పాఠశాలలో ఏం జరుగుతోంది, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, స్నేహితులతో ఎలా ఉంటున్నారు, ఏ విషయాలు వారిని బాధిస్తున్నాయి అనే విషయాలను తెలుసుకునేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలి. ఇక పాఠశాలల్లో క్రమశిక్షణ విషయంలో కూడా సమతుల్యత అవసరం. ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టకూడదు, తిట్టకూడదు, అవమానించకూడదు. పిల్లల హక్కులను గౌరవించడం అత్యవసరం. అయితే శారీరక శిక్షను నిషేధించడం అంటే పాఠశాలలో క్రమశిక్షణ అవసరం లేదని కాదు. విద్యార్థులను భయపెట్టి క్రమశిక్షణలో పెట్టడం ఒక పద్ధతి అయితే, వారికి బాధ్యతను అర్థం చేయించి క్రమశిక్షణను అలవాటు చేయడం మరొక మంచి పద్ధతి. పాఠశాలలో స్పష్టమైన నియమాలు ఉండాలి,వాటిని విద్యార్థులకు ముందుగానే తెలియజేయాలి. తప్పు చేసినప్పుడు తగిన విధంగా కౌన్సెలింగ్ చేయాలి. అవసరమైతే తల్లిదండ్రులను పిలిపించి సమస్యను పరిష్కరించాలి. ఉపాధ్యాయులకు కూడా విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకునే విధంగా శిక్షణ అవసరం. అదే సమయంలో విద్యార్థులకు తమకు హక్కులు ఉన్నట్లే బాధ్యతలు కూడా ఉన్నాయని స్పష్టంగా చెప్పాలి. ఉపాధ్యాయుడిని ప్రశ్నించడం తప్పుకాదు, కానీ అవమానించడం తప్పు. తమ అభిప్రాయాన్ని చెప్పడం విద్యార్థి హక్కే అయినా, ఉపాధ్యాయుడిపై దాడి చేయడం, బెదిరించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం మాత్రం ఏ పరిస్థితిలోనూ సమర్థించలేం. ఉపాధ్యాయుడి గౌరవాన్ని కాపాడటం కూడా విద్యావ్యవస్థ బాధ్యతే. ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు భయంతో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్ప డితే అది విద్యావ్యవస్థకు ప్రమాదకరం. అదే సమయంలో విద్యార్థి భయంతో కాకుండా బాధ్యతతో క్రమశిక్షణ పాటించే వాతావరణాన్ని పాఠశాలలు కల్పించాలి. తల్లిదండ్రుల పెంపకంలో కూడా సమతుల్యత అత్యవసరం. పిల్లల ప్రతి సమస్యను తల్లిదండ్రులే పరిష్కరించడంవల్ల వారు స్వయంగా సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయే అవకాశం ఉంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే బాధ్యతలుఅప్పగించాలి, శ్రమ విలువ తెలియజేయాలి, డబ్బు విలువ నేర్పాలి, సమ యం విలువ అర్థంచేయాలి. ముఖ్యంగా ఓటమిని అంగీకరించడం, తప్పును ఒప్పుకోవడం, క్షమాపణ చెప్పడం, తిరిగి ప్రయత్నించడం వంటి జీవిత నైపుణ్యాలను నేర్పాలి. పిల్లలను ప్రేమించడం అంటే వారుఅడిగిన ప్రతిదీ ఇవ్వడంకాదు, వారు సరైన మార్గంలో నడిచేలా చేయడమే నిజమైనప్రేమ. మానసిక ఒత్తిడి విషయంలో కుటుంబం, పాఠశాల రెండూ అప్రమత్తంగా ఉండాలి. పిల్లలప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఎప్పుడూ ఒంటరిగా ఉండటం, చదువుపై ఆసక్తి తగ్గడం, చిరాకుపెరగడం, నిరాశగా కనిపించడం వంటి మార్పులను పెద్దలు గమనించాలి. సమస్యను చిన్నదిగా భావించి పిల్లలను మందలించడం కంటే, ముందుగా వారి మాట వినాలి. తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు నిపుణుల సహాయం తీసుకోవడంలో ఎలాంటి సంకోచం ఉండకూడదు. ప్రేమకు వివేకం, స్వేచ్ఛకు బాధ్యత, విద్యకు విలువలు, క్రమశిక్షణకు మానవత్వం జోడించినప్పుడే మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలం. ●

# ప్రజావాక్కు



## ఎఐ నిర్ణయాధికారి కాదు..

కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్నఈ యుగంలో అసలు ప్రశ్న యంత్రాలు మనుషుల్లా ఆలోచించగలవా అనేదికాదు. భూమి, నీరు, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు అవి ఎంతవరకు తోడ్పడగలవన్నదే ప్రధాన అంశం. సాంకేతికత లక్ష్యం కేవలం పనులను సులభతరం చేయడం మాత్రమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, ప్రకృతి సంపదను కాపాడడం కూడా కావాలి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో హైదరాబాద్ వంటి మహానగరాలకు కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగపడు తుంది. ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు, విద్య, ప్రజా సేవలు, విపత్తుల నిర్వహణ, నీటి వనరుల సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో ఏఐ సమర్థవంతమైన పరిష్కారాలను అందించగలదు. సమయాన్ని ఆదా చేయడంతో పాటు ప్రభుత్వసేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా మార్చే సామర్థ్యం దీనికి ఉంది.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

## విశ్వాసం కోల్పోతున్న బ్యాంకులు

జాతీయ బ్యాంకులలో బంగారం తనఖా పెట్టి మోస పోయిన బాధితులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. ఈ నెలలో ఖాతాదారులకు చెందిన బంగారు ఆభరణాలు భారీగా మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. బంగారం మాయమైన ఘటనతో ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేద ప్రజలు ఎంతో కష్ట నష్టాలను ఓర్చుకొని రూపాయి రూపాయి కూడ పెట్టుకుని బంగారం కొనుగోలుచేసి బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయి, వడ్డీతక్కువ ఉంటుందని బ్యాంకులను ఆశ్రయిస్తే బ్యాంకులే ఈ విధంగా మోసం చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి?

- డి. వెంకటరెడ్డి, బెంగుళూరు

## అలవాట్లు మార్చుకోవాలి

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడి వరకు జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండే. శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటికాలుష్యం,ప్లాస్టిక్ భూతం, మద్యపానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

## ధరలను నియంత్రించండి!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను తగ్గించుట చేతకాక అవి కొనొద్దు, ఇవి కొనొద్దు విమానాలు ఎక్కి దూర ప్రయాణాలు చేయొద్దు, కార్యాలయాలకి టూ వీలర్, ఫోర్ వీలర్ మీద కాకుండా సైకిళ్ల మీద వెళ్లండని ఖర్చులు తగ్గించుకోండని పొదుపు పాటించడంటూ ఉచిత సలహాలిచ్చాయి. ఏ సౌకర్యాలు లేని కాలంలో కట్టెలపొయ్యి మీద వండుకుతినే వారు ప్రజలు. చాన్నాళ్ల తరువాత వారికి మళ్లీ అలాంటి స్థితి దాపురించింది. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలో సామాన్యుడిపైభారం పెరిగిపోతున్నది.బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు జమచేయలేదు. ఇచ్చిన హామీలు నెర వేర్చకుండా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలుపెంచేస్తూ ప్రజలనుఆర్థికంగా కృంగదీస్తున్నారు.

- కె.రామారావు, హైదరాబాద్

## గ్రామీణ రోడ్లను బాగుచేయాలి

వాతావరణ మార్పులతో ఇటీవల కాలంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండడంతో గ్రామీణ రోడ్ల వెంట ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తరుచుగా చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడుతుండడం, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుండడంతో కరెంట్ తీగలు తెగి రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గ్రామస్థాయిలో అధికారులు వర్షాకాలంలో అప్రమత్తంగాఉండి ఇలాంటి పరిస్థితులలో వెంటనే రోడ్లపైఉన్న చెట్లను తొలగించేవిధంగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ శాఖవారు విద్యుత్ వైర్లు తెగిన చోట ప్రమాదాలు జరగకుండా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మరమ్మతులు చేయాలి. రోడ్లు బాగా దెబ్బతిన్న చోట సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. వానాకాలంలో రోడ్ల వెంట ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. యోగేందర్, నల్లగొండ జిల్లా

## రిజర్వేషన్లు ప్రతిభకు గొడ్డలిపెట్టు!

ప్రతిభకు పట్టం కట్టడం అంటే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో శరవేగంగా పయనింపచేయడం! రిజర్వేషన్లకు మంగళం పాడి,ప్రతిభే కొలమానంగా పెద్దఎత్తున ఉద్యమానికి అంకురార్పణ గావించేలా ప్రజా సంఘాల వారు మేధావి వర్గాల వారు తీవ్రకృషిసల్పాలి! ఎందుకంటే అగ్రవర్ణాలవారికి 100 ర్యాంకు వచ్చినదక్కని ఫలం, రిజర్వేషన్ వున్నవారికి ఎక్కువ ర్యాంకు వచ్చినా ఫలం దక్కడం తీరని అన్యాయం.

-బి.మధుపాళి, నంద్యాల జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)








# హిమానీనద విస్ఫోటన ముప్పు

**47 సరస్సులు ప్రమాదకరం, నేపాల్‌లో 21, టిబెట్‌లో 25 శాస్త్రీయంగా ఐసిఐఎంఒడి గుర్తింపు, జనావాసాలు, జలవిద్యుత్ ఆస్తులు, మౌలిక సదుపాయాలకు ఎప్పటికైనా నష్టమే**

**కాఠ్మండు, ఆగస్టు 27:** అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం (ఐసిఐఎంఒడి), నేపాల్ ప్రభుత్వం జరిపిన శాస్త్రీయ అంచనాల ప్రకారం, ప్రధాన హిమాలయ నదీ మార్గాలలో 47 ప్రమాదకరమైన హిమానీనద సరస్సు (జిఎల్ఒఎఫ్)లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సరస్సులు హిమానీనద విస్ఫోటన వరదలను ప్రేరేపించగలవు, దీనివల్ల దిగువ ప్రాంతాలలోని ప్రజలకు, కీలకమైన మౌలిక సదుపాయాలకు ముప్పువాటిల్లుతుంది. గుర్తించిన సరస్సులలో 21నేపాల్‌లో ఉండగా, 25 టిబెట్‌లోని సరిహద్దు సరస్సులు. ఇవి దక్షిణంగా నేపాల్‌లోకి ప్రవహించే నదుల ఎగువ ప్రాంతాలకు సమీపంలో ఉన్నాయి. విపత్తు నిర్వహణ అధికారులు, యుఎన్‌డిపి, వేగంగా విస్తరిస్తున్న అనేక మోరైన్-ఆనకట్టసరస్సులను గుర్తించాయి. వీటిలో లోయర్ బరున్, తులగి, లుమ్డింగ్ త్సో, హోంగు 2, త్సోరోల్పా, ఇంజాత్సో వంటివి ఉన్నాయి. వీటికి తక్షణ ప్రమాద నివారణ చర్యలు అవసరమని పేర్కొన్నాయి. కోసి, బాగమతి బేసిన్‌లలోని ప్రమాదకర జిల్లాలలో అత్యధిక ప్రమాదం కేంద్రీకృతమై ఉంది. ఇక్కడే 85శాతం కంటే ఎక్కువ ప్రాంతీయ ప్రమాదం కేంద్రీకృతమై ఉంది. సోలుఖుంబు, సంఖువాసభ, దోలఖా, సింధుపాల్‌చోక్ జిల్లాలతో పాటు, రామెఛాప్, క్రవేపలాంచోక్, రసువా దిగువ ప్రాంతాలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న జిల్లాలలో ఉన్నాయి. పశ్చిమ, సుదూర పశ్చిమ నేపాల్ కూడా గండకి, కర్నాలి నదీ పరివాహక ప్రాంతాలలో ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. మనంగ్, లామ్‌జుంగ్, గోర్ఖా, ముస్తాంగ్, మ్యాగ్ది, హమ్లా ప్రాంతాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్న నదీ మార్గాల వెంబడి ఉన్నాయి. దీనివల్ల, హిమానీనద సరస్సులు ఉప్పొంగే ప్రమాదం నుండి స్థానిక ప్రజలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు ప్రమాదంలో పడవచ్చు. ప్రమాదకరమైనవిగా మారగల 47 హిమానీనద సరస్సులను గుర్తించడం అనేది, నేపాల్‌లోని బలహీనమైన హిమాలయ సమాజాలను, మౌలిక సదుపాయాలను రక్షించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు,సరస్సుల నీటిమట్టాన్ని తగ్గించే చర్యలు, సరిహద్దుల వెంబడి సమన్వయంతో కూడిన విపత్తు సన్నద్ధత ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## భూకంపం కాదు..మంచుకొండే విరిగిపడింది

### యుఎస్ జియోలాజికల్ సర్వే

**కాట్మాండు, ఆగస్టు 27:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలకు కారణం ఏమిటన్న దానిపై అమెరికా జియోలాజికల్ సర్వే ఓ ప్రకటన చేసింది. టిబెట్ వైపు ఉన్న హిమాలయ పర్వతంలోని మంచుకొండ విరిగిపడడం వల్ల.. శిథిలాలు, బురదతో కూడిన వరద విలయం వచ్చినట్లు పేర్కొన్నది. ముందుగా అంచనా వేసినట్లు భూకంపం కాదు అని యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మంచుపర్వతం బద్దలు కావడం, దాంతో బురద నీరు మహోగ్రంగా పోటెత్తిందని ఆ ప్రవాహం దిగువ ప్రాంతాలను ముంచెత్తినట్లు ఆ సంస్థ తెలిపింది. బుధవారం టిబెట్‌లో 4.4 తీవ్రతతో భూకంపం రావడం వల్ల.. జల విలయం సంభవించినట్లు తొలుత యుఎస్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. కానీ మరింత విశ్లేషణ తర్వాత తమ ప్రకటనలో మార్పు చేశారు. సమీపంలో ఉన్న సెసిమిక్ స్టేషన్లు, సెసిమిక్ వేవ్స్, శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తాజా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మంచు శిఖరం కుప్పకూలడంతో భీకర స్థాయిలో బురద పోటెత్తినట్లు గుర్తించారు. భూకంపం ఏమీ సంభవించలేదని యుఎస్‌జీఎస్ తాజాగా పేర్కొన్నది. నేపాలీ అధికారులు కూడా ఇదే తరహా వివరణ ఇచ్చారు. హిమాలయ శిఖరంపై ఉన్న మంచు ఫలకం కుప్పకూలిందని, ఆ భారీ శిథిలాలతో రాళ్లు కూడా కొట్టుకువచ్చాయని నేపాలీ అధికారులు చెప్పారు. ప్లానెట్ ల్యాబ్స్‌కు చెందిన శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా కూడా ఓ అంచనా వేశారు. రసువా-రసువాగాదీ బోర్డర్ క్రాసింగ్‌కు ఈశాన్య ప్రాంతంలో సుమారు 20 కి.మీ. దూరంలో మంచుపర్వతంపై కొండచరియలు విరిగిపడ్డాయని నేపాలీ అధికారులు పేర్కొన్నారు. అయితే బోటెకోశికి ఉప నది అయిన లిండే నదిలో ఆ కొండచరియల వల్ల డ్యామేజ్ అయ్యిందని, అక్కడనుంచి బురద వరద తిమూరు నుంచి త్రిశూలి నదిలోకి ప్రవేశించినట్లు చెబుతున్నారు. నదీవ్యవస్థలోకి బురద ప్రవేశించడం వల్ల ఆకస్మిక వరదలు సంభవించినట్లు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటేన్ డెవలప్‌మెంట్ పేర్కొన్నది. అయితే త్రిశూలీ నది మార్గంలో ఎక్కడైనా తాత్కాలికంగా బ్లాకేజీలు ఏర్పడ్డాయా లేదా అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఎక్కడైనా బ్లాకేజీ ఉంటే, దాని వల్ల సెకండ్ ఫ్లడింగ్ ఏర్పడే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. మంచుపర్వతంపై ఉన్న సరస్సు ఆకస్మికంగా ఖాళీ అయ్యిందా లేక నది మార్గంలో బ్లాకేజీల వల్ల ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చాయా అన్న కోణంలో అధ్యయనం చేస్తున్నారు.

## నేపాల్‌లో వరద బీభత్సం.. 332కి చేరిన మృతుల సంఖ్య

**ఖాట్మండు, ఆగస్టు 27:** నేపాల్‌లో ఆకస్మిక వరదల కారణంగా సంభవించిన మృతుల సంఖ్య 332కి చేరింది. మరో 1,400 మంది వరకు గల్లంతైనట్లు సమాచారం. కొండచరియలు విరిగిపడటంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోవడంతో సహాయక బృందాలు అక్కడికి చేరుకోవడం కష్టంగా మారింది. గల్లంతైన వారిలో 300 మంది భారతీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం భోటే కోశి, త్రిశూలి నదులకు వచ్చిన ఆకస్మిక వరదలు రసువా, నువాకోట్, ధాడింగ్, గోర్ఖా జిల్లాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రభావిత ప్రాంతాల్లో ట్రెక్కింగ్, టూరిజం సంస్థల నుంచి అందిన ప్రాథమిక వివరాల ప్రకారం 644 మంది ప్రయాణికులు గల్లంతైనట్లు గుర్తించామని నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. వీరిలో 127 మంది నేపాలీలు ఉన్నారు. ఈ వివరాలను ట్రావెల్ ఏజెన్సీలు, గైడ్లు, స్థానిక అధికారులు, భద్రతా సంస్థల సహకారంతో ధ్రువీకరిస్తున్నట్లు తెలిపింది. బాధితులకు వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయాలు, ఆహారం, తాగు నీరు, మందులను అందిస్తున్నారు. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయ వర్గాల ప్రకారం 28 దేశాలకు చెందిన 500మంది గల్లంతైనట్లు సమాచారం అందింది. అయితే సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు కొన సాగుతున్నందున ఈ సంఖ్యలు ఇంకా ధ్రువీకరణకు లోబడి ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారత ప్రధాని నరేంద్ర మోడీ నేపాల్ ప్రధాని బాలెన్‌షాతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసు కుంటున్నారు. 40కిపైగా ప్రైవేట్ హెలికాప్టర్ విమానాలువరద బాధిత ప్రాంతాలకు సహాయక సామగ్రిని తరలించేందుకు గురువారం కాఠ్మాండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాయి.

**నేపాల్‌కు భారత్ భారీగా సహాయం**

వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత మానవతా సాయాన్ని మరింత విస్తరించింది. 37.5 టన్నుల మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల సామగ్రి, మందులు, ఆహార ప్యాకెట్లతో రెండో విమానాన్ని పంపినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. సహాయం కోరే భారతీయుల కోసం నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చింది: +977 985 131 6807, +977 970 910 7500, +977 981 032 6117. ఈ నంబర్లను వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది.

## మానస సరోవర్ యాత్ర నిలిపివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** నేపాల్, టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన భారీ ఫ్లాష్ ఫ్లడ్స్ ప్రభావం కైలాస మానస సరోవర్ యాత్రపై పడింది. నేపాల్ మీదుగా కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లేందుకు భక్తుల బ్యాచ్‌లను ఇప్పటికే షెడ్యూల్ చేశారు. ముఖ్యంగా ఖాఠ్మాండు-రసువగఢీ-కీరుంగ్ మార్గం మీదుగా మానస సరోవరం చేరుకునేందుకు పలువురు యాత్రికులు బుకింగ్ చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా పదుల సంఖ్యలో భక్తులు ఈ యాత్రకు బుక్ చేసుకున్నట్లు సమాచారం. అయితే రసువగఢీ ప్రాంతంలో భారీగా వరదలు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. దీంతో రేపటి నుంచి ఖాఠ్మాండు నుంచి ప్రారంభం కావాల్సిన యాత్రను నిలిపివేసినట్లు సమాచారం. ఇప్పటికే సెప్టెంబర్ 23వ తేదీకి యాత్ర బుక్ చేసుకున్న భక్తులకు పరిస్థితిని సమీక్షించిన తర్వాత త్వరలో పూర్తి సమాచారం అందిస్తామని అధికారులు, సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.

## 21 మంది భారతీయులను రక్షించిన సహాయక బృందాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 27:** నేపాల్‌లో భోటేకోషి నది విపత్తులో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు, 21 మందిని రక్షించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన యాత్రికులు, త్రిశూలి1 జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. వీరిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం నేపాల్ అధికారులతో కలిసి ప్రయత్నిస్తోందని చెప్పారు. విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ త్రిశూలి పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది భారతీయులతో సంబంధాలు తెగిపోయినట్లు వెల్లడించారు. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన రెండు బృందాల్లోని 37 మంది, 49 మంది భారతీయుల ఆచూకీ కూడా అందుబాటులో లేదు. వీరు సమ్మిట్ ట్రావెల్స్, ఫై ఎవరెస్ట్ ట్రావెల్స్ ద్వారా వేర్వేరుగా కైలాస యాత్రకు వెళ్లారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరో 32 మంది భారతీయులు విపత్తు సంభవించిన రుసువా జిల్లాలోని టిమురే ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం. రివా టూర్స్ ద్వారా వెళ్లిన వివిధ రాష్ట్రాలకు చెందిన 61 మంది, కేరళకు చెందిన 33 మంది భారతీయులు ఆచూకీ కూడా ప్రస్తుతం దొరకలేదు. వీరందరిని కనుక్కోలేకపోతున్నామని,వారంతా గల్లంతయ్యారని అర్థం కాదని విదేశాంగశాఖ చెప్పింది. మరోవైపు, తమిళనాడుకు చెందిన 21మంది భారతీయులను సురక్షితంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది.



## ఊహించని ప్రకృతి విపత్తు

### భారత్‌కు నేపాల్ ప్రధాని బాలేన్‌షా కృతజ్ఞతలు

**ఖాట్మండు, ఆగస్టు 27:** టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఊహించని విధంగా వచ్చిన ఆకస్మిక వరదల వల్ల నేపాల్ తీవ్రంగా నష్టపోయింది. ఈ దారుణ విపత్తుపై నేపాల్ ప్రధాని బాలేంద్ర బాలేన్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది దేశం ఎన్నడూ చూడని రీతిలో సంభవించిన ఘోర విపత్తు అని ఆయన అభివర్ణించారు. బాధితుల రక్షణ, సహాయక చర్యల కోసం నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీసు బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయని వెల్లడించారు. ఇప్పటికే రసువా జిల్లాలోని తిమురే ప్రాంతం నుంచి 21 మంది భారతీయులతో సహా 116 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. భారత ప్రధాని మోడీ నేరుగా ఫోన్ చేసి పరామర్శించి, 10 టన్నుల అత్యవసర సహాయక సామాగ్రిని పంపించారని, వారికి ప్రధాని షా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులెవరూ అధైర్యపడవద్దని, అందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 80మంది ఇషా ఫౌండేషన్ యాత్రికులు గల్లంతు



**ఖాట్మండు, ఆగస్టు 27:** నేపాల్ చైనా (టిబెట్) సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వరదల ప్రభావంతో కైలాష్ మానసరోవర్ యాత్రకు వెళ్లిన ఇషా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు గిరాంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయినట్లు సమాచారం. యాత్రికులు తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇషా ఫౌండేషన్ నిర్వహించిన కైలాష్ మానసరోవర్ యాత్రలో భాగంగా యాత్రికులు టిబెట్‌లోని గిరాంగ్ ప్రాం తానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చైనా ఇమ్మి గ్రేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్న సమ యంలో అకస్మాత్తుగా భారీ వరద సంభవించింది. వరద ఉధృతికి ఇమ్మిగ్రేషన్ కేంద్రంతో పాటు గిరాంగ్ పట్టణంలోని చాలా ప్రాంతాలు నీట మునిగినట్లు సమాచారం. దీంతో అక్కడ ఉన్న యాత్రికులతో సంబంధాలు తెగిపోయాయి. 80 మంది భక్తుల పరిస్థితిపై కొంతకాలం స్పష్టమైన సమాచారం అందకపోవడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పరి స్థితిపై ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు స్పందించారు. యాత్రికుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు తాను స్వయంగా గిరాంగ్ ప్రాంతానికి చేరుకున్నట్లు తెలిపారు. సహాయక, రెస్క్యూ చర్యల్లో అధికారులతో కలిసి పనిచేస్తున్నామని సద్గురు పేర్కొన్నారు. ఇషా ఫౌండేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది మొత్తం 21 బృందాలు కైలాష్ యాత్రకు వెళ్లాయి. వారిలో 495 మంది సురక్షితంగా తిరిగి వచ్చారు. ప్రస్తుతం 743 మంది టిబెట్‌లో, 148 మంది నేపాల్‌లో ఉన్నట్లు సమాచారం. మరో 77 మంది యాత్రికులు ఇమ్మిగ్రేషన్ కేంద్రాల వద్ద చిక్కుకుపోయినట్లు లేదా వారితో సంబంధాలు లేకుండా పోయినట్లు ఫౌండేషన్ తెలిపింది. అదనంగా ముగ్గురు వాలంటీర్లు నేపాల్‌లోని తిమురే ప్రాంతంలో ఉన్నట్లు వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో ఉన్న సద్గురుయాత్రికుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బాధితులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆందోళనను తాను అర్థం చేసుకుంటున్నానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైన ప్రతి సహాయక చర్యను చేపట్టేలా తాను స్వయంగా అక్కడ ఉన్నానని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ యాత్రికులకు సహాయం అందించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భారీ వరదల కారణంగా సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలు, సమాచార వ్యవస్థలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో రెస్క్యూ చర్యలు సవాలుగా మారాయి.

## ముంచుకొస్తున్న మరో ముప్పు

### బారియర్ సరస్సు 72 గంటల్లో పొంగిపొర్లుతుందని చైనా హెచ్చరిక

**బీజింగ్, ఆగస్టు 27:** నేపాల్ టిబెట్ సరిహద్దుల్లో మరో ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరించింది. బ్యారియర్ సరస్సు 72 గంటల్లో పొంగిపొర్లే ప్రమాదం ఉందని అప్రమత్తం చేసింది. మంచుచరియలు విరిగిపడటంతో నేపాల్‌లో ఆకస్మిక వరదలు సంభవించి, ఇప్పటి వరకూ 350 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 1,600 ఈ ఘటనలో గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో ఎగువన మరిన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయని బీజింగ్ మరో హెచ్చరికను జారీ చేశారు. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ నేపాల్‌వైపున దాదాపు 100మంది చైనా పౌరులు గల్లంతైనట్లు తెలిపారు. నేపాల్‌లోని ఛోచెన్ ఖోలా, పురేపు త్సాంగ్పో నదుల సంగమం వద్ద ఏర్పడిన కృత్రిమ సరస్సు వచ్చే మూడు రోజుల్లో బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ తెలిపింది. గురువారం ఉదయానికి ఈ సరస్సులో ఇప్పటికే దాదాపు 20 లక్షల క్యూబిక్ మీటర్ల వరద నీరు చేరిందని, రాబోయే మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా ప్రవేశించవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ సరస్సుకు దిగువ ప్రాంతాలకు వరద ముప్పు ఉన్నట్టు చైనా మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో నదులు, తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచనలు చేసింది. మరోవైపు, టిబెట్‌లోని హిమానీనదం (గ్లేసియర్) బద్దలై ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. నేపాల్ పోలీస్ వర్గాల ప్రకారం కనీసం 3వేల మంది మరణించగా, 1,600 మంది గల్లంతయ్యారు. గల్లంతైన విదేశీయులలో అత్యధికంగా భారతదేశానికి చెందిన వారే ఉన్నారు. కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన వారు సహా 288 మంది భారతీయ పౌరులు గల్లంతైనట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, 65 మంది అమెరికన్లు, 51 మంది మలేషియా పౌరులు, 53 మంది ఉక్రెయిన్ పౌరులు, 35 మంది ఆస్ట్రేలియా, 33 మంది బ్రిటన్ పౌరులు కూడా గల్లంతయ్యారు. టిబెట్‌లోని గైరోంగ్ కౌంటీలో ముగ్గురు.. 260 మంది విదేశీయులు సహా 558 మంది గల్లంతయ్యారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనల వల్ల సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నప్పటికీ, చైనా, నేపాల్ సైన్యం రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

## మంచుకరిగితే రెండుదేశాలకు ప్రమాదమే

### నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్

**ఖాట్మండు, ఆగస్టు 27:** హిమాలయాల్లో మంచు కరిగితే అది నేరుగా సముద్ర మట్టాల పెరుగుదలకే దారితీస్తుందని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ వ్యాఖ్యానించారు. హిమాలయ పర్వత శ్రేణులు ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం భారత్, నేపాల్‌తో పాటు చైనా, భూటాన్‌లకు కూడా ఉమ్మడి ముప్పు అని ఆయన హెచ్చరించారు. ఖాట్మండులో గురువారం నిర్వహించిన వరల్డ్ అన్విక్షా సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. బుధవారం నేపాల్‌చైనా సరిహద్దులో ఆకస్మిక వరదలు సంభవించి దిగువ ప్రాంతాలు జలమయమైన ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. హిమాలయాల్లో మంచు కరుగుతున్న తీరుకు ఈ వరదలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వరదల ప్రభావం భారత సరిహద్దు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లపై తక్కువగా ఉన్నప్పటికీ, గతంలో ఇటువంటి ఘటనలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని, భవిష్యత్తులోనూ ఇటువంటి ముప్పు పొంచి ఉందని ఆయన గుర్తుచేశారు. భారత్, నేపాల్ దేశాల మధ్య రోటీబేటీ, సీతారామ్ వంటి చారిత్రక, సాంస్కృతిక బంధాలే కాకుండా, పర్యావరణ కోణంలోనూ ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. హిమాలయాల్లోని మంచినీటి వనరులపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 200 కోట్ల మంది ప్రజలు భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని, ఇది యావత్ మానవ నాగరికతకే పెను ముప్పుగా పరిణమించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.


## మూడువారాల్లోనే 60 మంది నవజాత శిశువుల మృతి

**మాల్డా, ఆగస్టు 27:** పశ్చిమబెంగాల్‌లోని మాల్దా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (ఎంఎంసీహెచ్)లో ఆగస్టు తొలి మూడు వారాల్లో 60 మంది చిన్నారులు మృతి చెందడంతో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వీరిలో ఒక్క రోజే 10 మంది చిన్నారులు మృతి చెందడం ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ ఎంఎంసీహెచ్ పనితీరును సమీక్షించడంతో పాటు, మృతిచెందిన చిన్నారులకు తొలుత చికిత్స అందించిన ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, బ్లాక్ స్థాయి ఆరోగ్య కేంద్రాలనూ పరిశీలిస్తోంది. తీవ్ర అనారోగ్యంతో ఉన్న చిన్నారులను ఆయా కేంద్రాల నుంచి ఎంఎంసీహెచ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఒక్క రోజే మృతి చెందిన 10 మంది చిన్నారుల్లో ఎనిమిది మంది ఇతర ఆసుపత్రుల్లో జన్మించినవారు కాగా, పరిస్థితి విషమించడంతో వారిని ఎంఎంసీహెచ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు చిన్నారులు ఎంఎంసీహెచ్‌లోనే జన్మించారు. ప్రాథమిక దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, ప్రాథమిక నివేదికను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. మృతి చెందిన నవజాత శిశువుల్లో శ్వాస సంబంధిత సమస్యలు, కామెర్లు, పుట్టుకతో వచ్చిన గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎంఎంసీహెచ్ సూపరింటెండెంట్ ప్రసెన్‌జిత్ బార్ మరణాలను ధృవీకరించారు. ఆసుపత్రి తరఫున రాష్ట్ర ఆరోగ్య శాఖకు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క రోజే 10 మంది చిన్నారులు మృతి చెందిన విషయం వాస్తవమేనని, వారిలో ఎనిమిది మందిని అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రికి తీసుకురాగా, ఇద్దరు అక్కడే జన్మించారని చెప్పారు. ఆగస్టులో నమోదైన 60 మంది శిశు మరణాల్లో 44 మంది ఇతర ఆసుపత్రుల్లో జన్మించినవారేనని అధికారులు వెల్లడించారు.

## హిమనదం కూలిపోవడం వల్లే నేపాల్‌లో జలప్రళయం

### ఇస్రో, ఎన్ఆర్ఎస్‌ఎ చిత్రాల విశ్లేషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** నేపాల్‌ను కనీవినీ ఎరుగని జలప్రళయం అతలాకుతలం చేసింది. ఊహించని రీతిలో క్షణాల్లో జలప్రళయం బీభత్సం సృష్టించింది. ఇప్పటి వరకు దాదాపు 332 మంది వరకు ప్రాణాలు కోల్పోగా ఇంకా భారతదేశంతో పాటు చైనా సహా ప్రపంచ దేశాలకు చెందిన వందలాది మంది గల్లంతయ్యారు. ఇక ఈ బీభత్సానికి కారణాలను ఇస్రో విశ్లేషించింది. ఎత్తైన హిమాలయ ప్రాంతంలో హిమనదం (గ్లేసియర్) కూలిపోవడం కారణమై ఉండొచ్చని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రాథమిక విశ్లేషణలో వెల్లడైంది. ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చింది. నేపాల్‌టిబెట్ సరిహద్దుకు సమీపంలోని ప్రాంతంలో హిమనదం కూలిన ఆనవాళ్లతో పాటు ఉప్పొంగిన భోటేకోసి నది, దిగువ ప్రాంతాల్లో భారీ వరదలను ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ నెల 26న తీసిన ఉపగ్రహ చిత్రాల్లో



త్రిశూలి నదికి సమీపంలోని ఎత్తైన పర్వతప్రాంతంలో భారీగా భూభాగ మార్పులు చోటుచేసుకున్నట్లు కనిపించింది. ఈ చిత్రాల్లో హిమనదం ప్రాంతంలో కూలిన ఆనవాళ్లు, నదీ ప్రవాహం విస్తరించడం, దిగువ ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరిన దృశ్యాలు నమోదయ్యాయి. ఈనెల 26న ఉదయం 10.30 గంటల సమయంలో ఇస్రోకు చెందిన రిసోర్సాట్ 2ఏ ఉపగ్రహంలోని సెన్సార్ ఈ చిత్రాలను సేకరించింది. ఈ చిత్రాలను ప్రమాదానికి ముందు తీసిన ఉపగ్రహ చిత్రాలతో పోల్చి పరిశీలించడం ద్వారా భూభాగం, నదీ వ్యవస్థలో వచ్చిన మార్పులను నేషనల్‌రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్‌ఎ గుర్తించింది. ఆగస్టు 26న తీసిన ల్యాండ్‌శాట్9 ఉపగ్రహ చిత్రంలో ఈ ప్రాంతాన్ని జోన్ ఆఫ్ 'గ్లేసియర్ బ్రేకేజ్ అండ్ కొలాప్స్'గా గుర్తించారు. అంతకుముందు 24న తీసిన సెంటినెల్2 ఉపగ్రహ చిత్రంలో ఇదే ప్రాంతం హిమనదంగా కనిపించింది. అయితే ఘటన తర్వాత తీసిన చిత్రాల్లో అదే ప్రాంతం భారీ మంచురాళ్ల కొండచరియలు విరిగిపడిన ప్రాంతంగా కనిపించింది. ప్రభావిత ప్రాంతంలోని కొన్ని భాగాలు మేఘాలతో కప్పబడి ఉండటంతో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పూర్తి స్థాయి అంచనా వేయడంలో పరిమితులు ఉన్నాయని ఎన్ఆర్ఎస్‌ఎ తెలిపింది. ఈ విశ్లేషణ ప్రాథమికమైనదేనని మరింత సమగ్ర అధ్యయనం అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో, అంతరిక్ష శాఖ స్పష్టం చేశాయి.

# సంక్షిప్త వార్తలు

## మళ్లీ ఎన్నికలు జరిగితే ఎన్డీయేకే పట్టం

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో ఎన్డీయేకే మళ్లీ ప్రజలు పట్టడం ఖాయం అన్న కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జనవరిలో నిర్వహించిన గత సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో 26 సీట్లు తగ్గాయి. తాజా సర్వేలో ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేయగా జనవరి 2026 ఎంఒఎన్ఎస్ సర్వేలో ఈ సంఖ్య 182గా ఉంది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీజేపీకి 39శాతం, కాంగ్రెస్‌కు 21 శాతం ఓట్లు వస్తాయని అం చనా వేసింది. జూలై 1 నుంచి ఆగస్టు 25 మధ్య 25,184 మంది నుంచి ప్రత్యక్షంగా అభిప్రాయాలను సేకరించారు.

## కుప్పకూలిన శిక్షణ విమానం: ఇద్దరు మృతి

**కాన్పూర్, ఆగస్టు 27:** నగరానికి సమీపంలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. గంగా నది బ్యారేజీ పరిసరాల్లోని ఓ పొలంలో గార్గ్ ఏవియేషన్ అనే కాన్పూర్ ఆధారిత శిక్షణ సంస్థకు చెందిన ప్రైవేట్ శిక్షణ విమానం కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు.

## మణిపూర్‌లో ఉగ్రదాడి: నలుగురు మృతి

**ఇంఫాల్, ఆగస్టు 27:** నిరంతరం హింసతో ఆందోళనకరంగా ఉండే మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన జరిగింది. ఒక వాహనంపై ఉగ్రవాదులు దాడిచేసి, నలుగురిని హతమార్చారు. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన మణిపూర్‌లోని కాంగ్‌గోక్పి జిల్లాలో, మకుయి అషాంగ్‌త బాంబా నాగా ప్రాంతాల మధ్య గురువారం జరిగింది. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా బలగాలు అక్కడికి చేరుకున్నాయి. నలుగురి మృతదేహాల్ని సేనాపతి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కనిపించకుండా పోయిన ఒక్కరి కోసం, ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## లాటరీలు షురూ చేస్తున్న హిమాచల్ ప్రభుత్వం

**సిమ్లా,ఆగస్టు 27:** రాష్ట్రంలో లాటరీలు ప్రవేశపెట్టేందుకు హిమాచల్ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటి ద్వారా ఏడాదికి కనీసం రూ.50కోట్ల ఆదాయమైనా వస్తుందని భావిస్తోంది. లాటరీల ప్రక్రియ నిర్వహించేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి హిమాచల్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఇతర రాష్ట్రాలు ఇప్పటికే లాటరీల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నాయి. దేశంలో లాటరీలకు అనేక రాష్ట్రాలువ్యతిరేకం. 28 రాష్ట్రాల్లో 13 రాష్ట్రాలు మాత్రమే లాటరీలకుఅనుమతిస్తున్నాయి. పంజాబ్ ఏటా రూ.235కోట్ల ఆదాయాన్ని పొందుతుంటే, కేరళ ఏకంగా రూ.13,582 కోట్లు ఆర్జిస్తోంది.

## పార్ట్‌టైమ్ మోడల్ ముస్కాన్ దారుణ హత్య


**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** దేశ రాజధాని ఢిల్లీలో 21 ఏళ్ల యువతి, పార్ట్ టైమ్ మోడల్ అయిన ముస్కాన్‌ను గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఇంట్లోనే దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్ పరిధిలో ఉన్న న్యూమహావీర్ నగర్‌లో బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ హత్య వెనుక ముస్కాన్ వెళ్లే జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్న ఇమ్రాన్ అనే వ్యక్తి ఉన్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## వివేకానంద కేంద్ర చైర్మన్ బాలకృష్ణన్ కన్నుమూత

**ఇటానగర్, ఆగస్టు 27:** వివేకానంద కేంద్రఅధ్యక్షుడు, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ చైర్మన్ ఏ.బాలకృష్ణన్(88) గురువారం కన్నుమూశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మారుమూల ప్రాంతాలకు విద్యను విస్తరించడంలో ఆయనచేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోను న్నాయి. 1938 మే3న జన్మించిన బాలకృష్ణన్ తొలుత భారత వైమానిక దళంలో పని చేశారు. ఏకనాథ్ రాణడేతో పరిచయం ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది.

# ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మున్సిపల్ రేసులో జనసేన, బిజెపి!

- తిరుపతి మేయర్‌పై టిడిపి జనసేన మధ్య పట్టు




**తిరుపతి, ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాగా వేయడానికి అధికార కూటమిలోని జనసేన, బిజెపి పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ స్థానిక రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాను ఒక రాజకీయ యూనిట్‌గా పరిగణిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో పార్టీ ఒక్కో కీలక స్థానంలో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు కార్పొరేషన్‌తోపాటు కుప్పం, పలమనేరు, నగరి మున్సిపాలిటీలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, శ్రీకాళహస్తి, పుత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. పుంగనూరు, మదనపల్లె అన్నమయ్య జిల్లాలో కలసిపోయాయి. అయితే ఉమ్మడి జిల్లా రాజకీయ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని మిత్రపక్షాలు తమ బలాన్ని పెంచుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను అవకాశంగా మలచుకోవాలని భావిస్తున్నారు.

**తిరుపతిపై జనసేన దృష్టి:**

2024 సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా తిరుపతి అసెంబ్లీ స్థానం నుండి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు పోటీ చేసి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తిరుపతి లోక్‌సభ స్థానం నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన వెలగపల్లి వరప్రసాదరావు ఓటమి చెందారు. ఈ నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా దీనికి మద్దతు ఇస్తున్న నేపథ్యంలో సిఎం, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే జనసేనను ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు తిరుపతితో బాటు ఇతర కీలక పట్టణాలపైనా దృష్టి సారిస్తున్నారు. చిత్తూరు కార్పొరేషన్ గానీ మదనపల్లె మున్సిపాలిటీ చైర్మన్ పదవుల్లో ఏదో ఒకటి జనసేనకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. చిత్తూరు జనసేన ఆశావహులు చిత్తూరు మేయర్ పదవికి జనసేన నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. గతంలో పట్టణ టిడిపి అధ్యక్షుడిగా పనిచేసి అనంతరం జనసేనలో చేరిన చందు కుమార్ మేయర్ టికెట్‌ను ఆశిస్తున్నారు. జనసేన పిఎసి సభ్యురాలు, న్యాయవాది ఆరణి కవిత, గంగనపల్లి గోపి, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్, ఆయన అన్న కుమారుడు ఆరణి శివ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న కాజుర్ బాలాజీకి అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నారనే సమాచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మదనపల్లెపైనా జనసేన చూపు:**

మదనపల్లెలోనూ జనసేనకు మంచి పట్టు ఉందని భావిస్తున్న ఆ పార్టీ నాయకులు అక్కడి చైర్మన్ పదవిని కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, సీనియర్ నాయకులు తోట కళ్యాణ్, రాందాస్ చౌదరి తదితరులు టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**తిరుపతిపై పట్టు వదులుకోని టిడిపి:**

రాజకీయ నేపథ్యంలో తిరుపతి మేయర్ పదవిని వదులుకోవడానికి అధికార టిడిపి నేతలు సిద్ధంగా లేరని సమాచారం. ఈ స్థానాన్ని టిడిపికే కేటాయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన, బిజెపిలకు ఉమ్మడి జిల్లాలోని మరో కీలక మున్సిపాలిటీని కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదని టిడిపి వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. మేయర్ పదవి టిడిపికి ఇచ్చి, డిప్యూటీ మేయర్ పదవిలో జనసేన, బిజెపికి అవకాశం కల్పిస్తే మిత్రపక్షాల మధ్య సమన్వయం సాధ్యమవుతుందని టిడిపి నేతలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

**బిజెపి వ్యూహం ఏమిటో?:**

ఇదిలా ఉంటే తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవి కోసం బిజెపి కూడా పట్టుపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంగా చర్చించేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ శుక్రవారం తిరుపతి వస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో తొలి నుండి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ కార్యకలాపాలు బలంగా ఉండటం, బిజెపికి సంప్రదాయ ఓటు బ్యాంకు ఉండటంతో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని బరిలోకి దింపాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పేరు కూడా తెరపైకి వస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. న్యాయవాదిగా పేరున్న ఆయన బలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం అదనపు అనుకూల అంశంగా ఆ పార్టీ వర్గాలు పరిగణిస్తున్నట్లు సమాచారం. ఇక టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి కుమారుడు జి.పృథ్వీరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. మొత్తంగా తిరుపతి మేయర్ పదవి టిడిపి–జనసేన మధ్య ప్రధాన చర్చనీయాంశంగా మారగా బిజెపి కూడా మేయర్, శ్రీకాళహస్తి చైర్మన్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు కార్పొరేషన్, మదనపల్లె మున్సిపాలిటీ వంటి కీలక స్థానాల్లో జనసేనకు అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి టిడిపి, జనసేన, బిజెపి మధ్య జరిగే సీట్ల సర్దుబాటుపైనే ఈ ఆశావహుల భవితవ్యం ఆధారపడి ఉండనుంది. తిరుపతి మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం కూటమి రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## గిరిజన విద్యార్థులకు నీట్ , ఐఐటి.జెఇఇ శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్త:** గిరిజన విద్యార్థులలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా మారికవలసలోని రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన వినినిగి, ॥గిరినిని లకు సన్నద్ధమయ్యే గిరిజన విద్యార్థులకు ఇక్కడ నాణ్యమైన రెసిడెన్షియల్ కోచింగ్ అందిస్తున్నామని వివరించారు. ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులను దేశంలోని ఐఐటీలు, నిట్లు , ఎయిమ్స్ , ప్రధాన వైద్య కళాశాలలు మరియు ఇతర జాతీయ ప్రాధాన్యత కలిగిన ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా మొత్తం 600 మంది విద్యార్థులను ఎంపిక చేసిందని, ఇందులో లింగ సమానత్వానికి ప్రాధాన్యతనిస్తూ 300 మంది బాలురు, 300 మంది బాలికలకు సమాన ప్రాతినిధ్యంతో ప్రవేశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఉచిత కోచింగ్‌తో పాటు వసతి, ఆహారం, పౌష్టికాహార డైట్ మరియు ఇతర పరిపాలనా అవసరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టిందని, వారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, ఐసీటీ పరికరాలు మరియు మానవ వనరుల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను ప్రాతిపదికన మంజూరు చేసిందని వివరించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధిత శాఖల సమన్వయంతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన విద్యార్థుల విద్యా పురోగతికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఒక కీలక ముందడుగుగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో గిరిజన బిడ్డలను ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాల్లో ముందుకు నడిపిస్తూ, దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సన్నద్ధం చేసే ఒక ఉత్తమ మోడల్ సంస్థగా అభివృద్ధి చెందనుందని స్పష్టం చేశారు.

# రికార్డుస్థాయిలో అమరావతి ఛాంపియన్‌షిప్

- 2.07 లక్షల మంది క్రీడాకారుల భాగస్వామ్యం
- 29న విజేతలకు బహుమతి ప్రధానం

**తిరుపతి,తిరుపతి (క్రీడ), ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ళపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుపతి నగరంలో నాలుగురోజులు నిర్వహించిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీలు రికార్డుస్థాయిలో జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 2.07లక్షల మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ ఛాంపియన్‌షిఫ్ పోటీల్లో విజేతలైన క్రీడా జట్లకు శనివారం(29న) తిరుపతిలో బహుమతులు, మెమొంటోలు ప్రదానం చేయనున్నారు. నాలుగు రోజులపాటు తిరుపతి కేంద్రంగా జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. 29 క్రీడ ప్రాంగణాల్లో 1200 క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్స్ చైర్మన్ అమినేని రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ, అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0కు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించిందని, చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ క్రీడా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించామన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0లో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 7 వేల మంది క్రీడాకారులు భాగస్వామ్యం కాగా, జిల్లాస్థాయి పోటీల్లో 84 వేల మంది ,రాష్ట్రస్థాయి 10 పదివేల మంది క్రీడాకారులు ప్రత్యక్షంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని తెలిపారు. భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్న ఈ క్రీడా పోటీలు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదవడం గర్వకాం ˇణమన్నారు. ఇది శాప్ చరిత్రలోనే ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. -29 క్రీడా ప్రాంగణాల్లో 1,200 మ్యాచ్‌లు: ఆగస్టు 24 నుండి ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలను 29 క్రీడా ప్రాంగణాల్లో, రెండు కేటగిరీల్లో అండర్ 17, అండర్ 23 కేటగిరీలలో 12 క్రీడల్లో (కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, హాకీ, బాడ్మింటన్, యోగ, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, చెస్, వెయిట్ లిఫ్టింగ్ బాక్సింగ్) నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. మొత్తం 1,200 మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించామని వెల్లడించారు. అమరావతి ఛాంపియన్‌షిప్ ద్వారా రాష్ట్రంలో క్రీడా వాతావరణం మరింత బలోపేతమైందని, ఆంధ్రప్రదేశ్‌ను 'క్రీడాంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక ముందడుగు అని రవి నాయుడు అన్నారు. శాప్ బోర్డు సభ్యురాలు డబుల్ ఒలింపియన్ ఇ.రజని పాల్గొన్నారు.




# సర్వీస్ ఈనామ్ భూములపై నిషేధం ఎత్తివేయాలి

- అమరావతికి ఇచ్చిన మినహాయింపులు మాకూ ఇవ్వాలి
- లక్ష ఎకరాల భూమి... కోటి మంది భూబాధితుల గోడు పట్టించుకోరా

**జగ్గయ్యపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఈనామ్ దారులకు సర్వహక్కులు కల్పించిన ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరించటం అన్యాయమని, నేడు ఈ ఈనామ్ భూములను అమ్ముకుంటే చెల్లదని ప్రభుత్వం నిర్దేశించటం దారుణమని సర్వీస్ ఈనామ్ భూబాధితుల సంఘ ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని జెఆర్‌సి కళాశాల సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, గింజుపల్లి రమేష్, గద్దె సుధీర్, సిహెచ్ ప్రసాద్, కళ్యాణం మురళి, అచ్యుతరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఎకరాల భూమి... కోటి మంది భూ బాధితుల గోడును కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయతగదన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు నేటి సిఎం చంద్రబాబునాయుడు ఈనామ్ భూములపై గల నిషేధాన్ని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. 1956లో రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఈనామ్ దారులకు సర్వహక్కులను ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. 2013లో ఉమ్మడి రాష్ట్రంలో సిఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన అనాలోచిత నిర్ణయం వలన కోట్లాదిమంది బాధితులుగా మారిపోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనామ్ భూములపై నిషేధం ఎత్తివేసేందుకు ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని మర్చిపోవటం శోచనీయమన్నారు. ఈనామ్ భూముల దేవాదాయశాఖ పరిధిలోకి రావని దేవాలయాల్లో పనిచేసే సేవకులు, పరిచారకులకు సంస్థానాధీశులు, జమిందారీలు, రాజులు బహుమతిగా ఇచ్చినవేనన్నారు. అధికారులు ఈ భూములను దేవాలయ భూములుగా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని తేటతెల్లంచేశారు. ఈసమస్యను ఎందుకు పరిష్కరించటంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడతామని విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళనకు సిద్ధమవుతున్నామని సంఘ నేతలు




మీడియాతో మాట్లాడుతున్న సర్వీస్ ఈనామ్ భూబాధితుల సంఘ ప్రతినిధి రంగాపురం నరసింహారావు.

# తిరుమల సమాచారం

## భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులరద్దీ అనూహ్యంగా పెరగడంతో కిటకిటలాడుతోంది. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. గురువారం ఉదయానికి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్ల దూరం శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీ కారణంగా ఎలాంటి దర్శన టిక్కెట్లు, టైమ్ స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం దాదాపు 24 గంటల సమయం పడుతోంది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి సిబ్బంది నిరంతరం తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. బుధవారం రాత్రి వరకు 77,568 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం 4.19 కోట్లు లభించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం సులభంగా జరిగేలా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దర్శనానంతరం లడ్డూలకోసం భక్తులు ఇబ్బందులు తప్పడంలేదు.

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్, కేరళ హై కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి సౌమన్ సేన్, పద్మశ్రీ డ్రమ్స్ శివమణి, సినీ నటుడు సప్తగిరి, నంద కిషోర్ రెడ్డి ( ఆస్ట్రాలజీ) ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## నేడు పౌర్ణమి గరుడసేవ

**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన శ్రావణపౌర్ణమి పురస్కరించుకుని తిరుమలలో నేటి రాత్రి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని మలయప్ప స్వామి గరుడునిపై మాఢవీధుల్లో ఊరేగనున్నారు.

# పేదరోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు

## స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డాక్టర్ జగదీష్

**తిరుపతిత్రిరుపతిహెల్త్,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** పేదరోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనితీరు సాగిస్తానని వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి(ఎఫ్ఏసి) డాక్టర్ జి.జగదీష్ తెలిపారు. గురువారం ఉదయం పాత డైరెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ అలోక్ సచన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకెళ్తామని తెలిపారు. స్విమ్స్ డాక్టర్ల బృందంతో సమన్వయం చేసుకుని పేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో బర్డ్ హాస్పిటల్‌తో బాటు స్విమ్స్ ఆస్పత్రిని రాష్ట్రంలోనే ప్రముఖ ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఎలాంటి వ్యాధులనైనా నయం చేసేలా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతామన్నారు. తిరుపతికి 50 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా అంబులెన్సుల ద్వారా స్విమ్స్‌కు తీసుకొచ్చి తక్షణం అత్యవసర చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మరో ఆరు నెలల్లో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రానుందని, ఈ భవనం పై అంతస్థులో ఎయిర్ అంబులెన్సు సౌకర్యం వుంటుందని చెప్పారు. స్విమ్స్‌లో అత్యవసరసేవల విభాగాన్ని మరింత విస్తరింపజేస్తామని, రక్తనిది సేవలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, టి.టి.డి. చైర్మన్ బి.ఆర్.నాయుడుకి, ఇఒ ముద్దాడ రవిచంద్రకి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు ఆయన స్విమ్స్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.



# సంస్కృత భాషా వైభవాన్ని చాటిన శోభాయాత్ర

- సంస్కృత వర్శిటీలో ఘనంగా సంస్కృత వారోత్సవాల ప్రారంభం



**తిరుపతి విద్య, ఆగస్టు 27 ప్రభాతవార్త:** సంస్కృత భాష గొప్పతనాన్ని, భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటుతూ తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న సంస్కృత సప్తాహ మహోత్సవంలో భాగంగా గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సంస్కృత శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్న శోభాయాత్రలో సంస్కృత భాష ప్రాశస్త్యాన్ని వివరించే ప్లకార్డులు, నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రొఫెసర్ ఎస్. దక్షిణామూర్తి శర్మ నేతృత్వంలో నిర్వహించిన శోభాయాత్రకు డాక్టర్ ఎస్.ఎల్. సీతారామ శర్మ, డాక్టర్ నందన రావు, డాక్టర్ వి. శ్రీనివాసరావు సమన్వయం చేశారు. అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్లా, విద్యార్థుల సంక్షేమ విభాగం డీన్ ప్రొ. ఎస్. దక్షిణామూర్తి, ప్రొ. వి. విష్ణుభట్టాచార్యులు, ప్రొ. కృష్ణేశ్వర్ ఝా, ప్రొ. రాధాగోవింద త్రిపాఠి, ప్రొ. కె. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాగ్వర్ధిని పరిషత్ ఆధ్వర్యంలో చెలికాని అన్నారావు అకడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వేద విద్యార్థుల మంగళాచరణ పఠనం, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జాతీయ గీతం, వందేమాతరం ఆలపించారు. కన్వీనర్ ప్రొ. సోమనాథ్ దాష్ స్వాగతోపన్యాసంచేశారు. అకడమిక్ వ్యవహారాల డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంస్కృత భాషకు ఉన్న శాశ్వత ప్రాధాన్యాన్ని వివరించారు. సంస్కృతంలో నిక్షిప్తమైన శాస్త్రీయ దృక్పథం, విశాలమైన విజ్ఞానం ఆధునిక విద్యా రంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణ రావు మాట్లాడుతూ భారతీయ భాషా వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువతలో సంస్కృత భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అతిథులుగా ప్రొఫెసర్ ఎస్. దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ పి. వెంకట రావు, ప్రొఫెసర్ కె. గణపతి భట్ పాల్గొని సంస్కృత భాష, సాహిత్యం, విద్య తదితర అంశాలపై ప్రసంగించారు. అతిథుల సన్మానం, సహ కన్వీనర్ డాక్టర్ కృష్ణ కుమార్ భార్గవ్ వందన సమర్పణ, శాంతి మంత్ర పఠనంతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసింది. డాక్టర్ నాగరాజ భట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే సంస్కృత వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, సంస్కృత గానం, ఉపన్యాసం తదితర సాహిత్య పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా పవిత్రోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 27, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు పవిత్రాలను సమర్పించారు. గురువారం మొదటి రోజు తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, పవిత్ర మాలాధారణ నిర్వహించారు. ఉదయం 8 గంటల తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వివిధ వైదిక హోమాలు, జపాలు, మూల మంత్ర హవనములు తదితర కార్యక్రమాలు దేవస్థానంలో నిర్వహించారు. దేవస్థానం మహా మండపంలో సమావేశమందిరం దుర్గమ్మవారి ఆలయంలోని శ్రీ మల్లిఖార్జున మహామండపంలో 4వ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరాన్ని గురువారం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రారంభించారు. పూజా కార్యక్రమం అనంతరం సిబ్బందితో చైర్మన్, ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో సమావేశ మందిరం ప్రాముఖ్యత అవసరం గుర్తించి ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు పి.రాఘవరాజు, ఏ.శ్రీనివాసరావు, ఎస్.సరిత, ఎం.కళావతి, దేవస్థానం ఇంజినీరింగ్, పరిపాలన అధికారులు పాల్గొన్నారు.



## మంత్రాలయం రాఘవేంద్రస్వామికి టిటిడిశేషవస్త్రం



**తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామికి టిటిడి పట్టువస్త్రాలు సమర్పించింది. రాఘవేంద్రస్వామి 355వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా టిటిడి తరపున ఇఒ ముద్దాడ రవిచంద్ర గురువారం శేషవస్త్రం సమర్పించారు. హైందవ సనాతన ధర్మవ్యాప్తికి కృషి చేసిన సద్గురువుల భగవత్ భాగవత సేవల దృష్ట్యా 2006వ సంవత్సరం నుండి రాఘవేంద్రస్వామికి శ్రీవారి శేషవస్త్రాన్ని టిటిడి అందిస్తోంది. ముందుగా మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామికి ఇఒ ముద్దాడ రవిచంద్ర శేషవస్త్రాలను అందజేశారు. అనంతనం సుముదేంద్రతీర్థస్వామి తీర్థప్రసాదాలు అందించారు.

## అన్నవరం పుణ్యక్షేత్రంలో మందుబాబుల వీరంగం

**అన్నవరం, ఆగస్టు 27, (ప్రభాతవార్త):** అన్నవరం సత్యనారాయణస్వామి కొండపై మందుబాబులు గురువారం తెల్లవారుజామున వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఉచిత కళ్యాణ మండపాల వద్ద ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్ తో గొడవకు దిగారు. దూషణలతో రెచ్చిపోవడంతో కొండపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొండపై జరుగుతున్న వివాహాలకి వచ్చిన సందర్భంగా కొంతమంది ఎలాంటి ఘటనాలకి పాల్పడి ఉండవచ్చని ఆలయ అధికారులు తెలిపారు. అర్ధరాత్రి జరిగిన సంఘటనతో భక్తులు భయాందోళన చెందారు. పుణ్యక్షేత్రంలో భద్రతాచర్యలు పూర్తిగా కొరవడ్డాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం తాగిన వారిని టోల్ గేట్ వద్ద ఎలా అనుమతించారని, తనిఖీలు సక్రమంగా చేయకపోవడం వల్లే తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. రత్నగిరిపై మద్య నిషేధం ఉన్నప్పటికీ కొంత మంది యథేచ్ఛగా మద్యం సేవించి వాహనాలతో హంగామా చేయడం పరిపాటిగా మారిందని దేవస్థానం అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తొండంగి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే మళ్లీ ఘర్షణ జరుపుకుంటా దేవస్థాన సెక్యూరిటీ గట్టి చర్యలు చేపట్టింది..

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి మంత్రి ఫరూఖ్



**గన్నవరం(కృష్ణా), ఆగస్టు 27, ప్రభాతవార్త :** మైనార్టీల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని రాష్ట్రమైనార్టీసంక్షేమశాఖామంత్రి ఎన్.యం.డి.ఫరూఖ్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుసు ఉత్సవంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్బంగా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ముస్లింమత పెద్దలు వీరిద్దరినీ సాంప్రదాయ పద్దతిలో సత్కరించారు. అనంతరం ముస్లింలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రంలో పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. గ్రామంలో రూ.17.50లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్‌రోడ్లను ప్రారంభించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం, విజయవాడరూరల్ మండలం నిడమానూరు గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణానికి, దర్గాకు ప్రత్యేక రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని యార్లగడ్డ మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూఖ్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉర్దుఅకాడమీ చైర్మన్ ఫారూఖ్‌షుబ్లీ, దర్గా పెద్దలు అల్తాఫ్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ టీచర్‌పై కత్తితో దాడి..!

### మెడకు ఇరువైపులా కత్తి గాయాలు

**గుంతకల్లు, ఆగస్టు 27 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిపై దుండగుడు కత్తితో దాడి చేసి పరారయ్యాడు. మెడకు ఇరువైపులా తీవ్ర గాయలు కావడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. వివరాల్లోకి వెళితే రాజేంద్రనగర్‌లోని చైతన్య ప్రాథమిక పాఠశాలలో అరుణ సైన్స్ టీచర్‌గా పని చేస్తోంది. భర్త కృష్ణారెడ్డి రైల్వే ఉద్యోగి కావడంతో తిమ్మనచర్ల రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. గత కొన్ని నెలల క్రితం అరుణ అనారోగ్యం కారణంగా పట్టణంలోని హోమియోపతి వైద్యున్ని సంప్రదించారు. ఆ సమయంలో తీసిన కొన్ని అసభ్యకర ఫోటోలతో అతడు అరుణను బ్లాక్‌మెయిల్ చేస్తూ వచ్చాడు. దీంతో ఆమె భర్తతో కలిసి రెండు నెలల క్రితం కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే వైద్యుడి రిక్వెస్ట్ మేరకు అరుణ కేసు నుండి రాజీ అయింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వైద్యుడు గురువారం మధ్యాహ్నం బ్యాంకుకు వెళ్లి స్కూలుకు వెళుతున్న అరుణపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. ఊహించని ఘటనతో అరుణ అక్కడికక్కడే కుప్పకూలింది. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వీఐటీఏపీ ప్రముఖ సాంకేతిక సంస్థ ఆక్టేవ్ మధ్య రెండేళ కీలక అవగాహన ఒప్పందం

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలోని వీఐటీఏపీ విశ్వవిద్యాలయం, ప్రముఖ సాంకేతిక సంస్థ ఆక్టేవ్ మధ్య రెండేళ్ల కాలపరిమితితో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి వేగంగా ఎదుగుతున్న ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆచరణాత్మక శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్ సంస్థకు చెందిన నిపుణులైన మెంటార్లతో కలిసి విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులోనూ ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటార్లు భాగస్వాములుగా ఉంటూ, మూడు నెలల నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనివల్ల విద్యార్థులకు రియల్‌టైమ్ అనుభవం నేరుగా లభించనుంది.అంతేకాకుండా, మార్కెట్ అవసరాలకు తగినట్లుగా వీఐటీ ఏపీలో ఏఐ., ఎంఎల్ పాఠ్యాంశాల రూపకల్పనకు ఆక్టేవ్ సంస్థ తగిన సూచనలు, సలహాలు అందించనుంది. సాంకేతిక రంగానికి అవసరమైన ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయ నిర్వాహకులు వెల్లడించారు.

## విద్యార్థుల పట్ల అసభ్య ప్రవర్తన

### టీచర్‌పై పోక్సో కేసు

**పీలేరు ఆగస్టు 27 ప్రభాతవార్త:** పీలేరు మండలంలోని ఒ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలు కలకలం రేపాయి. ఒకటో తరగతికి చెందిన ఇద్దరు, నాలుగో తరగతికి చెందిన మరో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు ఎర్రప్ప అసభ్యంగా ప్రవర్తించారంటూ గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయాన్ని బాలికల తల్లిదండ్రులు గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్ రజియాబీ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె ద్వారా మండల అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు పాఠశాలకు చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయుడు ఎర్రప్పను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల సమగ్ర దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పీలేరు ఆర్డీవో విజయలక్ష్మి గ్రామస్తులు, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆరోపణలకు సంబంధించిన విషయాలను నమోదు చేసుకున్నారు.

## పంట నష్టం పరిహారం కోసం డిమాండ్ చెల్లించాలి

### సంకిలి షుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతులు ఆందోళనకు



**రాజాం (విజయనగరం జిల్లా), ఆగస్టు 27 ప్రభాతవార్త :** రేగిడి మండలం సంకిలి ఇ ఐ డి చక్కెర పరిశ్రమ నుండి ఇథనాల్ హానికరమైన రసాయన విడుదల చేయడం వలన చుట్టుపక్కల ప్రాంతాలలో సుమారుగా 100 ఎకరాల భూములు పంటలు పండించడానికి పనికి రాకుండా పోయాయని రైతులు పరిశ్రమ వద్ద ఆందోళన దిగారు. పరిశ్రమ కు దగ్గరగా ఉన్న నాయిని చెరువులో విష పదార్థాలతో కూడిన వ్యర్థాలను పంపించడంతో చెరువు అంతా కలుషితం అయ్యిందని వాపోతున్నారు. ఈ చెరువు నుండి వచ్చిన రసాయనాలతో కలుషితం ఆయన నీరు మా పంట పొలాలను దెబ్బ తీస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు పండే భూములు ఇప్పుడు ఒక పంటకు కూడా పనికి రాకుండా ఉండే విధంగా తయారవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిశ్రమ విడుదల చేసిన వ్యర్థాలు వలన సుమారుగా 80 నుంచి 100 ఎకరాలు వరి పంట నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా పరిశ్రమ యాజమాన్యం చర్యలు చేపట్టాలని తెలిపారు లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం అని తేగేసి చెప్తున్నారు. నష్టపోయిన రైతులంతా పరిశ్రమ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే పరిశ్రమ మూసే విధంగా ఆందోళనలో చేపడతామని తేల్చారు. తక్షణమే పరిశ్రమ యాజమాన్యం స్పందించి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రైతు సంఘాలు, అలాగే నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

## అనంతలో దారుణం..!

- ఐశ్వర్యం వస్తుందని బాలికపై దొంగ బాబాల అరాచకం..
- మైనర్ బాలికను నగ్నంగా పూజలు..
- నిందితుల కోసం పోలీసుల గాలింపు..





**అనంతపురం క్రైమ్ ఆగస్టు 27 ప్రభాతవార్త:** గుప్త నిధులు, ధన లాభం వస్తుందంటూ మూఢనమ్మకాల పేరుతో ఒక మైనర్ బాలికపై దొంగ బాబాలు దారుణానికి ఒడిగట్టారు. పూజల పేరుతో బాలికను పలుమార్లు వివస్త్రను చేసి, అసభ్యకరంగా తాకుతూ నరకయాతనకు గురిచేసిన దిగ్భ్రాంతికర సంఘటన అనంతపురంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఘటనపై పోలీసులు ఐదుగురు నిందితులపై పోక్సో సహా వివిధ తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డుకు సమీపంలోని ఓ కాలనిలో ఓ వ్యక్తికి మహాలక్ష్మి అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అతనికి ఉన్న హోటల్ వ్యాపారంలో భారీగా లాభాలు వస్తాయని, లక్ష్మీదేవి కటాక్షిస్తుందని నమ్మబలికిన మహాలక్ష్మి.. అందుకోసం ప్రత్యేక పూజలు చేయాలని సూచించింది. పూజలో భాగంగా అతని మైనర్ కుమార్తెను వివస్త్రగా కూర్చోబెడితే కోరుకున్న ఐశ్వర్యం సొంతమవుతుందని మాయమాటలు చెప్పింది. మొదట ఆ తండ్రి ఒప్పుకోకపోయినా, మహాలక్ష్మి పదే పదే నమ్మబలకడంతో చివరకు అంగీకరించాడు.
6 నెలలుగా మూఢనమ్మకాల పేరుతో నరకం. బాధితురాలిని ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లిన హేమంత్ అనే దొంగ బాబా. ఆమెను వివస్త్రగా చేసి పూజల పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా పూజలు ఫలించలేదనే సాకుతో ఈ నెల 8న తన కుమారుడు బాలసుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ అనే వ్యక్తులతో కలిసి మళ్లీ బాలికను వివస్త్రను చేసి పూజలు నిర్వహించారు. అయినా ఫలితం రాలేదని చెప్పి.. ఈ నెల 9న బాలికను, ఆమె తల్లిని కడపలోని వెంకటేష్ యాదవ్ అనే మరో దొంగ గురువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల పేరుతో బాలికను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. ఈనెల 11న మరోసారి పూజలు చేయాలంటూ బాలికను నిందితులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్తుండగా, స్థానికులు గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసి భయాందోళనకు గురైన దొంగ బాబాలు, బాలికను ఆమె తల్లిని కారులో నుంచి దింపేసి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడప జిల్లా వల్లూరు పోలీసులు మొదట జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదనంతరం బుధవారం రోజున ఈ కేసును ఘటన పరిధిలోకి వచ్చే అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషనకు బదిలీ చేశారు. ఈ దారుణానికి పాల్పడిన దొంగ బాబాలు హేమంత్. బాలసుబ్రహ్మణ్యం, వెంకటేష్ యాదవ్‌తో పాటు వీరికి సహకరించిన మహాలక్ష్మి.. సాయి ప్రణవ్‌లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

## పులివెందుల అర్బన్ సిఐగా పురుషోత్తమరాజు

**పులివెందుల ఆగస్టు 27 ప్రభాత వార్త :** పులివెందుల పట్టణ అర్బన్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా పురుషోత్తమరాజు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఇప్పటివరకు అర్బన్ సీఐగా విధులు నిర్వహించిన శ్రీరామ్‌ను వీఆర్‌కు పంపిన నేపథ్యంలో ఆయన స్థానంలో పురుషోత్తమ రాజును నియమించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డికి సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని ఆర్డీవో ఆదేశించినప్పటికీ, అరెస్టు విషయంలో సీఐ శ్రీరామ్ అలసత్వం వహించారని ఆరోపిస్తూ సునీతారెడ్డి డీఐజీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ ఫిర్యాదు ఉన్నతాధికారులు శ్రీరామ్‌ను వీఆర్‌కుపంపినట్లుతెలుస్తోంది. అనంతరం పులివెందుల అర్బన్ సీఐగా పురుషోత్తమ రాజును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన సీఐ బాధ్యతలు స్వీకరించడంతో పట్టణంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై ఆయన దృష్టి సారించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



## జువినైల్ జస్టిస్ యాక్ట్‌పై సమీక్ష




**విజయవాడ, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో జువినైల్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్ అమలు చేస్తున్న జస్టిస్ చట్టం అమలుపై రాష్ట్రమహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఏ.సూర్యకుమారి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడ కానూరులోని కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, జువినైల్ జస్టిస్‌బోర్డు, తదితర శాఖల అధికారులతో సమీక్షా జరిపారు. ఈచట్టం ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 5వతేదీ రాష్ట్రస్థాయి జువినైల్ జస్టిస్ కమిటీ మీటింగ్‌కు ముందస్తుగా ఈకార్యక్రమం నిర్వహించారు. గడచిన 10 సంవత్సరాల కాలంలో వివిధ శాఖల వారీగా చట్టం అమలుతీరును సమీక్షించారు. సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్రమహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి, జువినైల్ వెల్‌ఫేర్ డైరెక్టర్ వసంతబాల, మిషన్ వాత్సల్య జాయింట్ డైరెక్టర్ శిరీష, ఏసిపి దైవప్రసాద్, యునిసెఫ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. నాగరాజు సహా మిగతా నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పును సెప్టెంబర్ రెండో తేదీకి వాయిదా వేశారు. సాయికృష్ణ లాకప్‌డెత్ అయినట్లు సిట్ నిందితుల రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసింది.ఈ కేసులో అప్పటికి సీఐతో సహా పలువురు నిందితులున్నారు

## కృష్ణా జిల్లా కంకిపాడులో డయేరియా కలకలం

**విజయవాడ,ఆగస్టు 27,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో డయేరియా కలకలం రేపింది. పలువురు అస్వస్థతకు గురై కంకిపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. వారికి వైద్యులు సత్వర చికిత్స అందించారు. మెరుగైన వైద్యంతో ఇప్పటికే 15 మంది బాధితులు కోలుకుని ఆసుపత్రి నుంచి ఇళ్లకు డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం మరో ముగ్గురు పేషెంట్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారు వేగంగా కోలుకుంటున్నారని వైద్యులు వెల్లడించారు.

## ఎస్సీ కమిషన్‌కు 196 దరఖాస్తులు



**నెల్లూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త-కలెక్టరేట్ :** జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్‌కు ఎస్సీ సంఘాల నేతలు, ప్రజలు మొత్తం 196 దరఖాస్తులు అందించారు. గురువారం ఉదయం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎస్సీ బాధితుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు శ్రీపతి బాబు, మెక్కల బిక్షం, రామాజనమ్మ, సెక్రటరీ చిన్నరాముడు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఎస్సీ ప్రజలు తమ సమస్యలు, కేసులకు సంబంధించి 196 అర్జీలను కమిషన్‌కు అందించారు. అందిన ప్రతి అర్జీని పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ తెలిపారు. తమకు అందిన అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, పలు పోలీసు కేసులపై కూడా ఫిర్యాదులు అందినట్లు ఆయన స్పష్టం చేశారు.


## ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలాలు

- రూ.3 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన తెలుగు గంగ అధికారులు



**నెల్లూరు క్రైం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడుతున్న అవినీతి అధి కారులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి దృష్టి సారించారు. తెలుగు గంగ ఇరిగేషన్ విభాగంలో సాగునీటి కాలువ పక్కన ఉన్న కల్వర్టుకు నిరభ్యంతర పత్రం ఇవ్వడానికి ఏకంగా రూ.3 లక్షలు లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కలువాయి మండలం, కనుపూరుపల్లికి చెందిన అమృత చిరంజీవి అనే రైతు తన పొలానికి సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువ కల్వర్టుకు సంబంధించి ఎన్ఓసీ కోసం అధికారులను ఆశ్రయించారు. ఈ సర్టిఫికేట్ జారీ చేయడానికి తెలుగు గంగ ఇరిగేషన్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న డీఈ గౌతమ్, ఏఈ నారాయణరాజు కలిసి రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు రైతు అమృత చిరంజీవి ధైర్యంగా ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చు పన్నారు. గురువారం నెల్లూరు ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడు నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో సదరు ఇద్దరు ఇంజనీర్లు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన డీఈ, ఏఈల కార్యాలయాలు మరియు నివాసాలలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో మరిన్ని ఆస్తులు, అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** యుద్ధ ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ.. భూతల దాడుల్లో యుద్ధ ట్యాంకులు కీలకమని తెలిపారు. అవి శత్రువుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తాయని, యుద్ధక్షేత్రంలో సైనికుల మనోధైర్యాన్ని పెంచుతాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని 'వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్'లో టి–సిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతుల కోసం రూ. 472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్రానికి శంకుస్థాపన చేసిన తర్వాత రాజ్‌నాథ్ ఈ మేరకు ప్రసంగించారు.'అత్యంత శక్తిమంతమైన సైన్యం కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. డ్రోన్లు, క్షిపణులు, ఇతర అధునాతన సాంకేతికతలతో యుద్ధం తీరు వేగంగా మారుతోంది. అంతమాత్రాన ట్యాంకులు ప్రాధాన్యం కోల్పోయాయని కాదు.. రణరంగంలో ఒకే వ్యవస్థపై ఆధారపడకుండా.. సమష్టి సామర్థ్యం కలిగి ఉండటం అవసరం. డ్రోన్లు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతోపాటు ఆధునిక ట్యాంకులూ ముఖ్యమే. భూతల దాడుల్లో టి–72, టి–90 ట్యాంకులు ఎంతో కీలకం. దేశ సరిహద్దుల్లో అవి ఉక్కు గోడలా నిలుస్తాఅన్నారు.

## ఎస్సీ వర్గాలకు ప్రభుత్వ ఫలాలు నూటికి నూరుశాతం అందించాలి

- అధికారులు, పోలీసులు ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి
- రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్




**నెల్లూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త - కలెక్టరేట్:** జిల్లాలో షెడ్యూల్డు కులాల అభివృద్ధికి, ఆయా వర్గాలకు కేటాయించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను నూటికి నూరు శాతం అందేలా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు శ్రీపతిబాబు, మెక్కల బిక్షం, రామాజనమ్మ, సెక్రటరీ చిన్నరాముడుతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా. అజితా వేజండ్ల అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలో ఎస్సీ వర్గాల ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వివిధ సంక్షేమ పథకాల కేటాయింపులో ఎస్సీ వర్గాలకు దామాషా ప్రకారం ప్రయోజనాలు అందుతున్నాయా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, అట్రాసిటీ కేసుల పురోగతి, పలు కేసుల్లో దళితులకు జరుగుతున్న అన్యాయాలపై ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యులు కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆయా వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాల్లో ప్రత్యేక వాటా కేటాయించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించి, ఆయా వర్గాలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాల్లో అభివృద్ధి సాధించేలా అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ప్రధానంగా పోలీసులు దళితులను గౌరవించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వివిధ కేసుల్లో న్యాయం జరగక బాధితులు ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారని, ప్రతి కేసులోనూ పోలీసులు మానవతా దృక్పథంతో వ్యవహరించి, నిరుపేద దళితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉందని, వారి సంక్షేమానికి ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయం, విద్య, ఉద్యోగ రంగాల్లో ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న అన్ని పథకాలు నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీలకు దక్కేలా ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కమిషన్ దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ డా. అజితా వేజండ్ల మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను ప్రత్యేకంగా విచారించి, త్వరితగతిన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీకి, కమిషన్ సభ్యుల సమక్షంలో వివరించగా, వారికి అండగా ఉంటామని, బాధితులు స్వయంగా తనను కలవాలని ఆమె భరోసా కల్పించారు. అన్ని పోలీసు స్టేషన్లలోనూ ఎస్సీ బాధితుల కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. తొలుత వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎస్సీ జనాభా వాటా కేటాయింపు, ఆయా వర్గాల అభివృద్ధికి చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం జిల్లాలో నమోదైన కేసులను బాధితుల సమక్షంలో చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ పోలీసులను ఆదేశించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో రాష్ట్ర షెడ్యూల్డు కులాల కమిషన్ సెక్రటరీ చిన్నరాముడు, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఎఎస్పీ సౌజన్య, డిఆర్వో విజయ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## ఆయన బతికే ఉన్నారు: ట్రంప్




**వాషింగ్టన్, ఆగస్టు 27:** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం త్వరలోనే ముగియనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడినప్పటికీ, ఇంకా ప్రాణాలతోనే ఉన్నారని పేర్కొన్నారు. ఒక కన్జర్వేటివ్ బ్రాడ్‌కాస్టర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయాలను వెల్లడించారు. 'ఆయన బతికే ఉన్నప్పటికీ చాలా తీవ్రంగా గాయపడ్డారు. ఆయన శరీరం ఎడమవైపు భాగం, చేయి, కాలు మొత్తం దెబ్బతిన్నాయి' అని ట్రంప్ తెలిపారు. అయితే తన వ్యాఖ్యలకు ఆయన ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఇరాన్ అధికారులు ఇప్పటికీ నిర్ణయాల కోసం ఖమేనిని సంప్రదిస్తున్నారని, ఇది ఆయన బతికే ఉన్నారనడానికి నిదర్శనమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికా సైనిక చర్యల్లో భాగంగా రాత్రికి రాత్రే ఇరాన్‌కు చెందిన 22 బోట్లను ధ్వంసం చేశామని ట్రంప్ ప్రకటించారు.'మా నేవీ, సైన్యం అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఈ యుద్ధంలో త్వరలోనే మేం పెద్ద విజయం సాధించబోతున్నాం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు చేయడం లేదని అడుగగా.. అక్కడ నిరసనకారులపై కాల్పులు జరపడానికి సైన్యం, స్నిఫర్లు సిద్ధంగా ఉన్నారని, అందుకే వారు బయటకు రావడం లేదని బదులిచ్చారు. ఇరాన్ నావికాదళం, వాయుసేన పూర్తిగా నాశనమయ్యాయని, ఆ దేశం చాలా బలహీనపడిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌ను అణ్వాయుధం దక్కించుకోకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. 2015 నాటి అణు ఒప్పందం నుంచి వైదొలగాలన్న తన నిర్ణయాన్ని కూడా ట్రంప్ సమర్థించుకున్నారు.

## ఐదు దినాల పని దినాలు కోసం బ్యాంకు ఉద్యోగుల అధికారులు పెద్ద ఎత్తున నిరసన


### స్టేట్ బ్యాంకు ఎదుట ఆందోళన



**అనంతపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త:** వారానికి ఐదు దినాలే పని దినాలుగా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, తదితర డిమాండ్లతో అనంతపురంలోని సాయి నగర్ స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ ఎదుట గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున వివిధ బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు అధికారులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఎన్.సి.బి.ఈ తరఫున ఖాదర్ బాషా, రఘురాం యాదవ్, ఏ. ఐ.బి.ఇ.ఏ తరుపున శంకర్, ఏ.ఐ.బి.ఓ.సి తరుపున నరేందర్ రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, వినియోగదారులు తమ వ్యాపార మరియు వ్యక్తిగత ఆర్థిక లాదేవీల కోసం ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గాలను విస్తృతంగా ఉపయోగిస్తుండటంతో బ్యాంకింగ్ శాఖలకు వినియోగదారుల రాక గణనీయంగా తగ్గింది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని ప్రభుత్వ సంస్థలు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు వారానికి 5 రోజులు మాత్రమే పనిచేస్తున్నాయి. కానీ బ్యాంక్ ఉద్యోగులకు మాత్రం 5 రోజుల పనిదినాల ప్రయోజనం దక్కకుండా వారు వంచింపబడుతున్నారు. ప్రభుత్వం బ్యాంక్ ఉద్యోగుల మధ్య వ్యత్యాసం చూపిస్తూ పక్షపాత పూరితంగా పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల ఉద్యోగుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం మరియు సమన్వయం దెబ్బతింటోంది. ఉద్యోగులందరూ ఒకే బృందంగా పనిచేస్తూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ, సబ్‌స్టాఫ్ నుండి స్కేల్ అధికారుల వరకు ఒక రకమైన తక్కువ చెల్లింపులు, స్కేల్‌IV మరియు ఆపై స్థాయి అధికారులకు అత్యధిక ప్రోత్సాహకాలు ఇస్తూ ప్రభుత్వం వ్యత్యాసాన్ని సృష్టిస్తోంది. ఇది శాఖలలో వ్యతిరేక వాతావరణాన్ని పెంచి, బ్యాంక్ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీసేలా ఉంది. ప్రతి రూపాయి ప్రజలది కాబట్టి, భవిష్యత్తులో ఇది బ్యాంకింగ్ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. 11వ, 12వ ద్వైపాక్షిక ఒప్పందాలలో అంగీకరించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు. ఉద్యోగుల పెన్షన్ సమస్యలు కూడా ఇంకా పరిష్కారం కాలేదు. యుఎఫ్‌బియుతో ఆరోగ్యకరమైన, అర్థవంతమైన చర్చలు జరిపి, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సిబిఈ తరఫున కామ్రేడ్ కె.ఖాదర్ బాషా, వి.బి.రఘురామ్ యాదవ్, ఎఐబిఈఎ తరఫున కామ్రేడ్ కె.శంకర్, ఎఐబిఓసి తరఫున కామ్రేడ్ నరేంద్ర రెడ్డి, నాయకులు సమ్మెకు గల కారణాలను వివరంగా స్పష్టం చేస్తూ, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్.చంద్రశేఖర్, మహేంద్రనాథ్, రమేష్, రేణుక, సునీత, నీలిమ, శ్రీకాంత్, ఇతరుల పాల్గొన్నారు.

# యుఎస్ ఓపెన్‌లో ముచోవా-మెన్సిక్‌కు మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



**న్యూయార్క్:** ముచోవా-మెన్సిక్ ద్వయం యూఎస్ ఓపెన్ 2026 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో కరోలినా ముచోవా-జాకుబ్ మెన్సిక్ ద్వయం 6-3 1-6 10-6 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన బెలిండా బెన్సిక్-ఇటలీకి చెందిన ఫ్లావియో కోబోలి జోడీని ఓడించి టైటిల్ గెలుచుకుంది. జట్టుగా వారికి ఇదే తొలి గ్రాండ్‌స్లామ్. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో చెక్ జంట అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. బలంగా సర్వ్ చేసే మెన్సిక్, సెట్ పాయింట్ వద్ద బెన్సిచ్‌ను దాటుకుంటూ ఏస్ కొట్టి 30 నిమిషాల లోపే తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ సెట్‌లో, బెన్సిచ్ ఒక రిటర్న్ విన్నర్‌తో సర్వ్‌ను బ్రేక్ చేసి 3-1 ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత, ఆమె కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్ నెట్ కార్డ్‌కు తగిలి ముచోవాను దాటి వెళ్లడంతో ఆ స్విస్ క్రీడాకారిణి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మకమైన 10పాయింట్ల మ్యాచ్ టైబ్రేక్‌లో, మెన్సిక్ యొక్క శక్తివంతమైన సర్వ్, నెట్ వద్ద అతని చురుకైన ఆట చెక్ జట్టు ఆధిక్యం సాధించడానికి సహాయపడ్డాయి. 20 ఏళ్ల యువతి ఒక గట్టి వాలీతో 8-4 ఆధిక్యాన్ని సాధించగా, ముచోవా మ్యాచ్‌లోనే తన అత్యుత్తమ సర్వ్‌తో ఛాంపియన్‌షిప్ పాయింట్లను సంపాదించింది.




## శ్రీలంక 2వ టెస్టు డ్రా:
# 51.52కు పడిపోయిన పాయింట్ల శాతం
## భారత్ ఫైనల్ ఆశలకు గట్టి దెబ్బ

**న్యూఢిల్లీ:** కొలంబోలో శ్రీలంకతో జరిగిన రెండో టెస్టును డ్రా చేసుకోవడంతో, 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్‌కు అర్హత సాధించే భారత్ అవకాశాలకు గండి పడింది. ఈ ఫలితంతో, టీమిండియా ఐదు విజయాలు, 68 పాయింట్లతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో నిలవగా, పాయింట్ల శాతం (పీసీటీ) 53.33 నుంచి 51.52కు పడిపోయింది. ఇక టీమిండియాకు మిగిలిన ఏడు టెస్టుల్లో, ఫైనల్ చేరే ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్‌కు వరుసగా మంచి ఫలితాలు రావాలి. అయితే, ప్రత్యర్థుల నాణ్యత దృష్ట్యా ఇది అంత సులభం కాదు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 80 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ 72.22 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత్, న్యూజిలాండ్ చివరిసారిగా తలపడినప్పుడు, బ్లాక్ క్యాప్స్ 3-0తో గెలిచి, 12 ఏళ్లలో స్వదేశంలో భారత్‌కు తొలి టెస్ట్ సిరీస్ ఓటమిని అందించింది. భారత్ తదుపరి సిరీస్ నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి సొంతగడ్డపై రెండు టెస్టుల సిరీస్ కాగా, ఆ తర్వాత 2027 ఆరంభంలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. మిగిలిన టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలిస్తే పాయింట్ల శాతాన్ని 60 శాతానికి పైగా చేరి భారత్ ఫైనల్ రేసులో నిలబడగలదు. టీమిండియా ముందున్న 7 టెస్టుల ప్రయాణం అంత తేలికైనదేమీ కాదు. శ్రీలంక పర్యటన ముగిసిన నేపథ్యంలో తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత అత్యంత కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఎదురుచూస్తోంది. ఈ కఠినమైన షెడ్యూల్‌లో మెజారిటీ మ్యాచ్‌లు గెలవడం భారత జట్టుకు పెద్ద సవాలుగా మారనుంది.




# డ్రాగా ముగిసిన కొలంబో టెస్ట్
## 1-0తో సిరీస్ భారత్ కైవసం

**కొలంబో:** శ్రీలంకతో కొలంబోలో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠ భరితంతో డ్రాగా ముగిసింది. శ్రీలంక బ్యాటర్లు గురువారం అద్భుత ఆటతో మ్యాచ్‌ను కాపాడుకున్నారు. కొలంబో టెస్ట్ డ్రా అయినప్పటికీ, మొదటి మ్యాచ్‌ను గెలుచుకున్న భారత్ 1-0 తేడాతో టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. ట్రాక్ రికార్డ్ ఆధారంగా కొలంబోలో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 503 పరుగుల భారీ స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీ (117), ధ్రువ్ జురెల్ అజేయ సెంచరీతో (115 నాటౌట్) రాణించారు. రిషభ్ పంత్ (63), కెప్టెన్ గిల్ (50), యశస్వి జైస్వాల్ (45), రవీంద్ర జడేజా (43) జట్టు స్కోరును 500 దాటించడంలో కీలక పాత్ర పోషించారు. అయితే భారత్ ఫాలో ఆన్ అస్త్రం ఉపయోగించింది. తొలి ఇన్నింగ్స్‌లోకి దిగిన శ్రీలంకను భారత బౌలర్లు తీవ్రంగా ఒత్తిడిలోకి నెట్టారు. సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80)తో లంక తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్ ముగిసేసరికి టీమిండియాకు 213 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో కెప్టెన్ గిల్ ప్రత్యర్థి జట్టుకు ఫాలోఆన్ ఇచ్చి రెండోసారి బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓటమి ఖాయమనుకున్న స్థితి నుంచి శ్రీలంక బ్యాటర్లు ఊహించని రీతిలో కోలుకున్నారు. ఆ జట్టు యువ బ్యాటర్ సోనల్ దినుష (264 బంతుల్లో 133) నాటౌట్‌గా నిలిచి భారత బౌలర్లకు చెమటలు పట్టించాడు. లంక ఆఖరి రోజు ద్వితీయ ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు సాధించింది. లంక వద్ద 200 పైగా ఆధిక్యం ఉండటం, మ్యాచ్‌లో కేవలం 17 ఓవర్ల ఆట మాత్రమే మిగిలి ఉండటంతో విజయం సాధించే అవకాశం రెండు జట్లకూ లేకుండా పోయింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. మొదటి టెస్టులో భారత్ విజయం సాధించడంతో ఈ 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ 1-0తో టీమిండియా వశమైంది.

# దులీప్ ట్రోఫీ: దేశవాళీలో రచ్చరచ్చే
## ఈ నెల 30 నుండి సెమీఫైనల్స్‌కు 4 జట్లు

**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. తూర్పు, ఉత్తర జోన్ జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఈ నెల 30న బెంగళూరులో రెండు సెమీఫైనల్స్ జరగనున్నాయి. బెంగళూరులో జరుగుతున్న ఈ దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్




రౌండ్ లోని మొదటి మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ జట్టు ఒక ఇన్నింగ్స్ 210 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టు వెస్ట్ జోన్ జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. దీంతో ఈస్ట్ జోన్, నార్త్ జోన్ జట్లు రెండూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఇక మొదటి సెమీఫైనల్ ఈ నెల 30న జరగనుంది. ఈ మ్యాచ్ బెంగుళూరులో ప్రారంభం కానుండగా, ఇందులో సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు తలపడతాయి. సెంట్రల్ జోన్ జట్టుకు రజత్ పాటిదార్ నాయకత్వం వహించగా, ఈస్ట్ జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ సారథ్యం వహించనున్నారు. అదేవిధంగా, రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్ సౌత్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య బెంగళూరులో ఈనెల 30నే జరగనుంది. సౌత్ జోన్ జట్టుకు తిలక్ వర్మ, నార్త్ జోన్ జట్టుకు కన్హయ్య వాధవన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. కాగా సెంట్రల్ జోన్ జట్టులో రజత్ పాటిదార్ (కెప్టెన్), రింకు సింగ్ (వైస్ కెప్టెన్), ఆర్యన్ జువల్ (వికెట్ కీపర్), శరాన్‌షా జైన్, అమన్ మొఖడే, కునాల్ చండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, ఆయుష్ పాండే, యశ్ సింగ్ రాథోడ్, యశ్ రాథోడ్, పర్వ్ రాథోడ్, పర్వ్ ఉన్నారు. ఈస్ట్ జోన్ జట్టులో అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ ఘరామి, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, షాబాజ్ అహ్మద్, సూరజ్ జైస్వాల్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), విరాట్ సింగ్, కుమార్ కుషాగ్రా, శిఖర్ మోహన్, సుబ్రాన్షు సేనాపతి, అభిజీత్ ద రోకర్, అనీషుర్ ద రోకర్, సౌత్ జోన్ జట్టులో తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్, అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె. హిమతేజ, స్మరణ్ రవిచంద్రన్, ఎన్. జగదీషన్, కరుణ్ నాయర్, టి. త్యాగరాజన్, శ్రేయాస్ గోపాల్, సాయి తేజ, టి. విజయ్, విద్వాత్ కావేరప్ప, అమన్ ఖాన్, నార్త్ జోన్ జట్టులో కన్హయ్య వాధావన్ (కెప్టెన్), ఆయుష్ బదోని (వైస్ కెప్టెన్), సనత్ సాంగ్వాన్, కమ్రాన్ ఇక్బాల్, యశ్ ధుల్, ఆయుష్ దోసెజా, అబ్దుల్ సమద్, నిషాంత్ సింధు, అర్జున్ శర్మ, అబిద్ ముస్తాక్, అర్ష్‌దీప్ సింగ్, సునీల్ కుమార్, అన్షుల్ కాంబోజ్, యుధ్‌వీర్ సింగ్, యుధ్‌వీర్ సింగ్‌ప్ ఉన్నారు.



# నేటి నుండి మహిళల ఆసియా కప్
## టైటిల్ లక్ష్యంగా బరిలోకి భారత్ జట్టు

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో మరో టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో పట్టు సాధించి, తమ ఆధిపత్యాన్ని చాటుకోవాలని భారత్ భావిస్తోంది. మహిళల క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఈసారి ఆసియా కప్‌పై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లు బరిలో ఉండటంతో పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. దుబాయ్ వేదికగా ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు మహిళల టీ20 ఆసియా కప్ జరుగనుంది. దీనికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆతిథ్యం ఇవ్వనుండగా ఈ ప్రతిష్ఠాత్మక టీ20 టోర్నీలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక సహా మొత్తం ఎనిమిది జట్లు ఆసియా అగ్రస్థానం కోసం పోటీపడనున్నాయి. ఈసారి మహిళల ఆసియా కప్‌ను టీ20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. యూఏఈలోని దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఈ టోర్నీకి పూర్తి స్థాయి వేదికగా నిలవనుంది. ఈ టోర్నమెంట్‌లోని శ్రీలంక మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో భారత జట్టుపై భారీ అంచనాలు ఉన్నాయి. భారత్ ఏడు సార్లు టైటిల్ గెలవగా, మిగిలిన రెండు ఎడిషన్లలో బంగ్లాదేశ్, శ్రీలంక ఒక్కోసారి విజేతలుగా నిలిచాయి. దీంతో మహిళల ఆసియా కప్‌లో ఇప్పటివరకు ఆధిపత్యం చలాయించిన భారత్ మరోసారి టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. గతంలో ఒకసారి ఆసియా కప్‌ను గెలుచుకున్న బంగ్లాదేశ్ రెండోసారి కప్‌ను ముద్దాడాలనే పట్టుదలతో సిద్ధమవుతోంది. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంక తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో రంగంలోకి దిగనుంది. ఇక ఇప్పటివరకు ఆసియా కప్‌ను గెలవని ఇతర జట్లు తొలిసారి ట్రోఫీని సొంతం చేసుకోవాలనే పట్టుదలతో పోటీకి సిద్ధమవుతున్నాయి. దీంతో పోటీలు అత్యంత రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్ జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్‌కెప్టెన్), షఫాలీ వర్మ, భారతీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్, జి. కమలిని, అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీకా రావల్ ఉన్నారు.

# ఐదు ఐపిఒలకు మార్కెట్లలో భారీ స్పందన




**ముంబయి, ఆగస్టు 27:** ఐపిఒల మార్కెట్‌లో పలు కంపెనీల ఇష్యూలకు గురువారం భారీ స్పందన లభించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాల ప్రకారం ఐదు ఐపిఒల సబ్‌స్క్రిప్షన్ భేషుగ్గా ఉంది. ల్యూమినో ఇండస్ట్రీస్ ఆఫర్‌లో ఉన్న 6,32,05,127 షేర్లకు గాను 7,98,37,212 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 1.26 రెట్లు కొనుగోలు అయింది. ఈనెల27న ప్రారంభమైన ఇష్యూ ఆగస్టు 31న ముగియనుంది. ధరల శ్రేణి రూ.78-82. కనీసం 182 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. అను ప్రాజెక్ట్స్ ఐపిఒలో 1,76,83,000 షేర్లకు గాను 1,52,28,501 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 0.86 రెట్లు బిడ్లు రాగాఇ ష్యూ శుక్రవారం ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.94-99. కనీస బిడ్ 151 షేర్లు.ఇక స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్‌కు సంబంధించి 2,95,83,600 షేర్లకు గాను ఏకంగా 2,09,85,50,200 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 70.94 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.131-138. కనీస బిడ్ 100 షేర్లు.సింబయోటెక్ ఫార్మాల్యాబ్ పరంగాచూస్తే 1,31,24,929 షేర్లకు గాను 93,36,33,525 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఇష్యూ 71.13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.938-988. కనీస బిడ్ 15 షేర్లు.హైటెక్ ఇంజినీర్స్ కంపెనీకి 1,81,45,406 షేర్లకు గాను 4,40,88,82,187 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 242.98 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.50-53. కనీస బిడ్ 283 షేర్లు.ఈ ఐదు ఇష్యూలలో హైటెక్ ఇంజినీర్స్ ఐపీఓకు అత్యధికంగా 242.98 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించగా, ఆ తర్వాత సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 71.13 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 70.94 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌తో నిలిచాయి.

# రుణంకంటే ఎక్కువే వసూలుచేసారు
## సోషల్ మీడియా పోస్టులో విజయ్ మాల్యా



**లండన్, ఆగస్టు 27:** బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి విదేశాలలో తలదాచుకుంటున్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మరోసారి తనకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులకు తాను చెల్లించాల్సిన అసలు మొత్తం కంటే అధికంగానే రికవరీ చేశారని, అయినా న్యాయం జరగడం లేదని ఆయన వాపోయారు. సోషల్‌మీడియా పోస్టులో ఆయన స్పందిస్తూ మీడియా అధినేత సుభాష్ చంద్ర, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబిసి) కింద కేవలం రూ.6.5 కోట్లు చెల్లించి, రూ. 22,006 కోట్ల రుణ క్లెయిమ్‌లను సెటిల్ చేసుకోబోతున్నారంటూ వచ్చిన ఒక మీడియా కథనాన్ని విజయ్ మాల్యా ప్రస్తావించారు. ఇది నిజమైతే నా స్నేహితుడు సుభాష్‌కు అభినందనలు. నా నుంచి రూ. 6,203 కోట్ల అప్పునకు గాను రూ. 14,100 కోట్లు రికవరీ చేసినట్లు బ్యాంకులు, ప్రభుత్వం అంగీకరించాయి. గత యేడాది డిసెంబర్‌లోనూ విజయ్ మాల్యా ఇవే తరహా ఆరోపణలు చేశారు. తన నుంచి రికవరీ చేసిన మొత్తంపై ప్రభుత్వానికి, బ్యాంకులకు మధ్య లెక్కల్లో పొంతన లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం పార్లమెంటులో రూ. 14,100 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొనగా, బ్యాంకులు మాత్రం రూ. 10,000 కోట్లు అంటున్నాయని, ఈ వ్యత్యాసపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రికవరీ లెక్కలను నిర్ధారించేందుకు ఒక రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాలని ఆయన కోరారు.

# ఒకటోతేదీ వచ్చేస్తోంది.. మార్పులివే

**ముంబయి, ఆగస్టు 27:** ఆగస్టు నెల ముగింపునకు వచ్చింది. మరో ఐదు రోజుల్లో సెప్టెంబర్ నెలలోకి వస్తున్నందున కీలక మార్పులు వస్తున్నాయి. సెప్టెంబర్ 1నఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలకు సంబంధించింది. చమురు విక్రయ సంస్థలు ప్రతి నెల ప్రారంభంలో కొత్త ధరలను ప్రకటిస్తాయి. ఆగస్టు 1న 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరపై రూ.202 తగ్గింపు లభించినప్పటికీ, 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరలలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. ఇక మీరు ప్రస్తుతం పొందుతున్న సబ్సిడీ లేదా నిరంతర సిలిండర్ సరఫరాను ఎలాంటి అంతరాయం లేకుండా పొందాలంటే మీకో ముఖ్యమైన సూచన. గ్యాస్ ఏజెన్సీలు ఈకైవైసి చేసుకునేందుకు ఆగస్టు 31 వరకు పొడిగించాయి. ఈ ఐదు రోజుల్లోగా ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ వినియోగదారులు తమ ఇకేవైసి పూర్తి చేయకపోతే, సెప్టెంబర్ 1 నుంచి గ్యాస్ సిలిండర్ పంపిణీలో ఇబ్బందులు ఎదురుకావచ్చు లేదా ఎక్కువ ధర చెల్లించాల్సి రావచ్చు. ఎల్పీజీ ధరలతో పాటు వైమానిక ఇంధనం, సిఎన్‌జీ, పిఎన్‌జీ ధరల్లో కూడా సెప్టెంబర్ 1న సవరణలు జరగనున్నాయి. ఎటిఎఫ్ ధరల్లో వచ్చే మార్పుల వల్ల విమాన ప్రయాణ ఛార్జీలు మారే అవకాశం ఉంది.కొత్తగా కారు కొనాలని భావిస్తున్న వారికి సెప్టెంబర్ నెల కాస్త షాక్ ఇవ్వనుంది. ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తమ అన్ని రకాల కార్లు, ఎస్‌యూవీల ధరలను గరిష్టంగా రూ.25వేలకు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ధరల పెంపు పెట్రోల్, డీజిల్ వాహనాలతో పాటు ఎలక్ట్రిక్ మోడళ్లకు కూడా వర్తిస్తుంది.




# స్టాక్ మార్కెట్లకు రెండో రోజూ నష్టాలు

**ముంబయి, ఆగస్టు 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాల్లోముగిశాయి. హెవీవెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ కీలకమైన 24,100 స్థాయి దిగువన స్థిరపడింది. లాభాల స్వీకరణ, నెలవారీ సెన్సెక్స్ ఎక్స్‌పైరీ, అమెరికాలో అధిక ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి.స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ ప్రాంతంలో సరఫరా అంతరాయాలు తగ్గేఅవకాశం ఉందన్నచర్చలతో చమురు ధరలు కొంత తగ్గడం మార్కెట్లకు స్వల్ప ఊరట నిచ్చింది. విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు నికర కొనుగోలుదారులుగా ఉన్నప్పటికీ, గురువారం అమ్మకాల ఒత్తిడికొనసాగింది.రంగాల వారీగా కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా షేర్లు లాభపడగా, మెటల్స్, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 539.35 పాయింట్లు నష్టపోయి 76,933.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 116.90 పాయింట్లు క్షీణించి 24,090.85 వద్ద స్థిరపడింది. రెండు సెషన్లలో సెన్సెక్స్ 0.93 శాతం, నిఫ్టీ 1 శాతం చొప్పున నష్టపోయాయి.నిఫ్టీ నష్టాలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధానంగా దోహదపడింది. ఈ షేరు 2.23 శాతం పడిపోయింది. భారతి ఎయిర్‌టెల్ 1.25 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.22 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.38 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.04 శాతం నష్టపోయాయి. బిఎస్ఇలో 1,824 షేర్లు లాభపడగా, 2,491 షేర్లు నష్టపోయాయి. మరో 211 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ నాటి డెలివరీ బ్రెంట్ క్రూడ్ 27 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 87.21 డాలర్లకు చేరింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా తగ్గింది. గత సెషన్‌లో 95.4400 వద్ద ముగిసిన రూపాయి, గురువారం 95.5500 వద్ద కొనసాగింది. భారత 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రిటర్నులు 6.851 శాతం నుంచి 6.884 శాతానికి పెరిగింది.

**వాణిజ్యం**

# రూ.20 లక్షల కోట్లకు ఇవి మార్కెట్ టర్నోవర్ : నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు ఇవి మార్కెట్ 2030 నాటికి రూ.20 లక్షల కోట్లకు చేరుకుంటుందని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అదే సమయంలో ఈ రంగం ద్వారా ఐదు కోట్ల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని వెల్లడించారు. సుస్థిర అభివృద్ధికోసం అన్న థీమ్‌తో సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్ నిర్వహించిన సదస్సులో గడ్కరీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 57 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ అయి ఉన్నాయని, మొత్తం వాహన మార్కెట్‌లో ఇవిల వాటా 7 శాతంగా ఉందని చెప్పారు. 2030 నాటికి భారీ వృద్ధి 2030 నాటికి భారత ఇవి మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లకు చేరుతుంది. ఈ రంగం ఐదు కోట్ల ఉద్యోగాలను కూడా సృష్టిస్తుందని గడ్కరీ తెలిపారు. దేశంలోని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థలు బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ తమ ఉత్పత్తుల్లో 50 శాతానికి పైగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.దేశంలో ఏటా లక్ష ఎలక్ట్రిక్ బస్సులకు డిమాండ్ ఉన్నప్పటికీ ప్రస్తుతం 50 వేల నుంచి 60 వేల బస్సులను మాత్రమే తయారు చేయగలుగుతున్నామని చెప్పారు.ప్రపంచంలో నంబర్ వన్‌గా ఆటో పరిశ్రానున్న ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని గడ్కరీ వెల్లడించారు. లక్ష్యం కష్టమైనదే అయినప్పటికీ అసాధ్యం కాదని అన్నారు. దేశంలో శిక్షణ పొందిన మానవ వనరులు అందుబాటులో ఉండటం పరిశ్రమకు పెద్ద బలమని చెప్పారు. భారత్‌లో తయారవుతున్న వాహనాల నాణ్యత మెరుగ్గా ఉండటంతో పాటు వాటి తయారీ వ్యయం తక్కువగా ఉందని, అందుకే ప్రపంచంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలన్నీ భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని గడ్కరీ వివరించారు.తాను రోడ్డు రవాణా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో భారత ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ.14 లక్షల కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం అది సుమారు రూ.22-23 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. అమెరికా ఆటో పరిశ్రమ పరిమాణం సుమారు రూ.78 లక్షల కోట్లు, చైనా పరిశ్రమ రూ.47 లక్షల కోట్లుగా ఉందని చెప్పారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయాన్ని 8 శాతానికి తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని గడ్కరీ తెలిపారు. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎకనామిక్ కారిడార్ల నిర్మాణం కారణంగా లాజిస్టిక్స్ వ్యయం గతంలో ఉన్న 16 శాతం నుంచి ప్రస్తుతం 10 శాతానికి తగ్గిందని తెలిపారు.లాజిస్టిక్స్ వ్యయాన్ని 8 శాతానికి తీసుకురాగలిగితే అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ మరింత పోటీతత్వాన్ని సాధించగలదని గడ్కరీ పేర్కొన్నారు.

## రూ.22వేల కోట్లకు సంబంధించి
# 6.5 కోట్లకే రీపేమెంట్ ప్లాన్

**ముంబయి, ఆగస్టు 27:** మీడియా రంగ ప్రముఖులు, జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర రుణాల చెల్లింపు విషయానికి సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సంచలన నిర్ణయం ప్రకటించింది. ఆయన వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. సుమారు రూ. 22,006.57 కోట్ల మేర ఆమోదించిన రుణ దాతల క్లెయిమ్స్‌కు సంబంధించి కేవలం రూ. 6.5 కోట్ల రీపేమెంట్ ప్లాన్‌కు ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో బ్యాంకులు దాదాపు 99.97 శాతం మేర తమ డబ్బుల్ని కోల్పోనున్నాయి. దీనిని బ్యాంకింగ్ పరిభాషలో హెయిర్ కట్ అంటారు. అంటే వారు క్లెయిమ్ చేసిన మొత్తంతో పోలిస్తే చాలా తక్కువ మొత్తం మాత్రమే తిరిగి పొందనున్నారు. సుభాష్ చంద్ర ప్రతిపాదించిన రీపేమెంట్ ప్లాన్ ప్రకారం రుణ దాతలకు రూ. 6.25 కోట్లు చెల్లించనున్నారు. మరో రూ. 25 లక్షలు దివాలా పరిష్కార ప్రక్రియలకు సంబంధించిన ఖర్చుల కోసం కేటాయించారు. అయితే మెజార్టీ బ్యాంకులు/రుణ దాతలు ఈప్రతిపాదనకు అంగీకరించినప్పటికీ, మరి కొందరు మాత్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ముఖ్యంగా ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని రుణ దాతలు, ఇంత తక్కువ మొత్తంలో రికవరీని ఆమోదించడం సరైనది కాదని వాదించారు. ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్‌కు అంగీకరించిన క్లెయిమ్ మొత్తం రూ. 1322.39 కోట్లుగా ఉంది. ప్రతిపాదిత ప్లాన్ ప్రకారం సంస్థకు కేవలం రూ. 38.09 లక్షలు మాత్రమే అందనుంది. ఇది మొత్తం క్లెయిమ్‌లో దాదాపు 0.028 శాతం మాత్రమే. ఈ కేసులో మొదట




ఎన్సీఎల్టీడివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నమైన తీర్పులు ఇచ్చారు. దీంతో అభిప్రాయ భేదం కారణంగా మూడో సభ్యుడిని నియమించారు. ఎన్సీఎల్టీ జుడీషియల్ సభ్యుడు నీలేశ్ శర్మ, మూడో సభ్యుడిగా మెజార్టీ అభిప్రాయానికి అనుగుణంగా రీపేమెంట్ ప్లాన్‌ను ఆమోదించారు. దీనికి 80.81 శాతం ఓటింగ్ వాటా సభ్యుల మద్దతు లభించిందని, వ్యతిరేకించిన రుణ దాతల ఓటింగ్ వాటా 20 శాతానికి తక్కువగా ఉందని స్పష్టం చేశారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువ, రీపేమెంట్ ప్లాన్‌లోప్రతిపాదించిన మొత్తంతో పోలిస్తే తక్కువగానే ఉందని, అందుకే ప్లాన్‌ను తిరస్కరిస్తే సుభాష్ చంద్ర పూర్తి స్థాయి దివాలా ప్రక్రియలోకి వెళ్లే అవకాశం ఉందని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | శుక్రవారం 28 ఆగస్టు 2026 | I


# పవన్ కళ్యాణ్ రక్షాబంధన్ కానుక

**ఆడపడుచులకు పుట్టింటి పట్టుచీర**
**నేడు 2389 మంది వితంతువులకు పంపిణీ**



పిఠాపురం, ఆగస్టు 27( ప్రభాతవార్త ) రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలోని ఆడపడుచులకు ప్రత్యేక కానుక అందిస్తున్నారు. 45 సంవత్సరాల లోపు వయసున్న 2,389 మంది ఆడపడుచులకు తన సొంత ఖర్చులతో 'పుట్టింటి పట్టుచీర'ను రక్షాబంధన్ కానుకగా అందజేస్తున్నారు. అన్నగా ఆడపడుచులపై తనకున్న ఆప్యాయతను చాటుకునేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జనసేన వర్గాలు తెలిపాయి. రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలోని పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఆడపడుచుల ఇళ్లకు వెళ్లి పట్టుచీరలను అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆడపడుచులతో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించనున్నారు. పిఠాపురం పట్టణ పరిధిలో 488 మంది, పిఠాపురం రూరల్ మండలంలో 575 మంది, గొల్లప్రోలు మండలంలో 536 మంది, గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలో 198 మంది, యు.కొత్తపల్లి మండలంలో 642 మంది చొప్పున మొత్తం 2,389 మంది ఆడపడుచులకు పట్టుచీరలు అందించనున్నారు. రక్షాబంధన్‌ను కేవలం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగానే కాకుండా, ఆడపడుచుల పట్ల ఆప్యాయతను చాటే వేడుకగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఆడపడుచులకు పుట్టింటి కానుక అందేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అన్నగా పవన్ కళ్యాణ్ పంపుతున్న పుట్టింటి పట్టుచీరను అందుకోవడం తమకు ప్రత్యేక అనుభూతిగా ఉంటుందని పలువురు ఆడపడుచులు పేర్కొంటున్నారు.



## జేఎన్‌టీయూకే--కోరమాండల్ మధ్య సాంకేతిక అవగాహన ఒప్పందం




**కాకినాడ రూరల్, ఆగస్ట్ 27( ప్రభాతవార్త):** జేఎన్‌టీయూ కాకినాడ, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మధ్య సాంకేతిక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కోరమాండల్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి, శిక్షణ పొందుతున్న కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అవగాహన ఒప్పందంపై జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. శ్రీనివాసరావు, కోరమాండల్ యూనిట్ హెడ్ కె. జగన్నాథం సంతకాలు చేశారు. ఈ సందర్భంగా 109 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోరమాండల్, జేఎన్‌టీయూకే అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద పార్క్ వాకర్స్‌తో ఎంపీ సానా సతీష్ బాబు ముఖాముఖి

### --సమస్యలు పరిష్కరిస్తామని హామీ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 27 (ప్రభాతవార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు గురువారం కాకినాడలోని వివేకానంద పార్క్ (రాజా ట్యాంక్ పార్క్)లో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం వాకర్స్‌తో ముఖాముఖిగా మాట్లాడి పార్క్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ టాయిలెట్ల నిర్వహణ, మురుగునీటి పారుదల, తాగునీటి సౌకర్యం తదితర సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సానుకూలంగా విన్న ఎంపీ, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్కులు, ప్రజా ప్రదేశాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, పచ్చదనం వంటి అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపడతామని సానా సతీష్ బాబు తెలిపారు.


## కోరంగి అభయారణ్యంలో ర(వృ)క్షా బంధన్.

### ప్రపంచంలోనే మొట్టమొదటిగా విత్తనాలతో రాఖీలు.



**తాళ్లరేవు, ఆగస్టు 26( ప్రభాతవార్త):** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా ఉండే రాఖీ పండుగను అటవీ శాఖ పర్యావరణహితంగా నిర్వహించడానికి వినూత్నంగా ఆలోచన చేసి వృక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కట్టిన రాఖి బయట పారవేసినప్పుడు ఆ రాఖీ లోని విత్తనాల ద్వారా మొక్కలు మొలకెత్తే ఆలోచన చేసి ఆచరణలో చూపించింది. ఈ మేరకు 200 మంది కళాశాల విద్యార్థులకు గురువారం కోరంగి సి బి ఈ టి లో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చింది. విద్యార్థినీ విద్యార్థులలో పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికి మొదటిసారిగా ఈ కార్యక్రమం పర్యాటక కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు రేంజర్ వరప్రసాద్ తెలిపారు. మడ వృక్షాలకు మహా రాఖీలు కడదాం కోరింగ అభయారణ్యానికి తరలి రండి ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా వృక్షాబందన్ లో భాగంగా మడ చెట్లు కి విద్యార్థులచే రాఖీలు కట్టించనున్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ 2000 సంవత్సరంలో దేశీయ విత్తనాలతో రాఖీలు విద్యార్థులతో తయారు చేయడం మొదలుపెట్టామన్నారు. మడ చెట్లకు రాఖీలు కట్టడం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కోరంగి లోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 రకాల విత్తనాలతో ఈ రాఖీలు తయారు చేయించినట్లు తెలిపారు. అంతరించిపోతున్న చెట్ల విత్తనాలు, కాయగూరల విత్తనాలు ఈ రాఖీల్లో ఏర్పాటు చేశామన్నారు. మడ చెట్లకు కట్టిన రాఖీలను తిరిగి విద్యార్థులకు శుక్రవారం అందిస్తామన్నారు. వాటిని ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు చల్లడం ద్వారా మొక్కలు పెరిగి పర్యావరణం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్లు సిద్ధార్థ, వీరభద్రరావు, బీట్ ఆఫీసర్ మహేష్, గోపినాగేంద్రకుమార్, ధనలక్ష్మి, సంధ్యారాణి, బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయని కెపిఎం ఎల్ లత, ఆ విద్యార్థులు, ఎకొ ప్లాంట్ ప్రతినిధి రామారావు, సామాజిక వేత్త శ్రీనివాస్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె. రాజేశ్వరి విద్యాంజలి విద్యాసంస్థల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ : జ్యోతుల నవీన్



**గండేపల్లి, ఆగస్టు 27. ప్రభాతవార్త** గండేపల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 14 మందికి రూ. 6 లక్షల 30 వేల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. నీలాద్రి రావు పేటలో నలుగురి కి, తాళ్లూరులో ఇద్దరికి, మల్లేపల్లిలో ముగ్గురికి, యల్లమల్లిలో ఒకరికి, నాయకంపల్లిలో ఇద్దరికి, యర్రంపాలెంలో ఇద్దరికీ చెక్కులు మంజూరయ్యాయి. గురువారం ఇంటింటికి వెళ్లి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై 14 మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పేరుకే పరిమితమైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారకుండా సీఎం సహాయనిధి ద్వారా నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, జీను మణిబాబు, జాస్తి వసంత్, అడబాల రామాంజనేయులు, దొమ్మా శ్రీను, శీలామంతుల వీరబాబు, పయిన్ని వెంకటేశ్వరరావు, కురుకూరి చౌదరి, తెలగ రెడ్డి భద్రరావు, యల్లమిల్లి సీ ఎం, ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

### జిల్లాలోవి. బి. జి. రామ్. జి. లో 1,531 ఎకరాల్లో

## లక్ష జీడిమొక్కలు లక్ష్యం పూర్తి ఎప్పుడో..

### మొక్కలు కోసం గోతులు తీసి గిరిజన రైతులు ఆగచాట్లు
### పశువులకు ప్రమాదం.. విషజంతువులకు గోతులు నిలయాలు





**రాజవొమ్మంగి, అగస్టు 27, ప్రభాతవార్త** వి. బి. జి. రామ్ జి ( ఉపాధి హామీ ) పథకం పేరు మార్పు జరిగినప్పటి నుండి పథకంలో పని చేస్తున్న వేతనదారులకు సకాలంలో సొమ్ములు అందటం లేదు. జీడిమామిడి మొక్కలు పెంచుకొందామని రెండు నెలలుగా ఎదురుచూస్తున్న గిరిజన రైతులు ఆశకు కనుచూపుమేర కన్పించడం లేదు. పోలవరం జిల్లాలో అన్ని మండలాల్లో 1,531ఎకరాల్లో గిరిజన రైతులు జీడిమామిడి మొక్కలు పెంచడానికి సుమారు రెండు నెలలు క్రితం ప్రతిపాదనలు ఉన్నతస్థాయి అధికారులకు చేరాయి. ఎకరానికి 70 మొక్కలు వంతున రైతులకు మొక్కలను వారివద్దకే చేర్చి ఇప్పటికే నాటించాలి.

**లక్ష 7 వేల 170మొక్కలు లక్ష్యం పూర్తి ఎప్పుడో..**

జిల్లాలో 1,531 ఎకరాల్లో ఎకరానికి 70 మొక్కలు వంతున ఒక లక్ష 7 వేల 170 మొక్కలు నాటే లక్ష్యం పూర్తి అయ్యేలా లేదు. ఇప్పటికే చనిపోయిన మొక్కలకు స్థానంలో రెండో విడత మొక్కలు సరఫరా కూడా జరగాలి. మొక్కలు కోసం తీసిన గోతులు వల్ల ముప్పు ఒక ఎకరానికి 70 మొక్కలు నాటడానికి అరమీటరు పొడవు, అరమీటరు వెడల్పు, అదే కొలత తో లోతులో గోతులను తీసి రైతులు సిద్ధం చేసుకొన్నారు. గోతులు వద్ద రైతులు కాపలా కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులుల్లో పశువులు కాళ్ళు అనుకోకుండా పడితే ప్రమాదం అని అంటున్నారు. ఇదే కాకుండా ఎండ తీవ్రత వల్ల విష జంతువులు గోతులు నిలయాలుగా మారే రైతులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుందని భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**గోతులకే రూ. 85.73 లక్షలు**

ఒక గొయ్యి తీయడానికి రూ. 80.22 లు వి. బి. జి. రామ్. జి. నిధులను వెచ్చించారు. ఎకరానికి రూ. 5,600 లు వీబిజి రామ్ జి. నిధులు కేటాయింపు జరిగింది. సుమారు రూ. 85 లక్షల 73 వేల 600 లు నిధులు వెచ్చించారు. టెండర్లు ఎప్పుడు అయ్యి మొక్కలు ఇస్తారో అని గిరిజన రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 58 ఎకరాల్లో రైతులు నర్సరీల్లో మొక్కలు తెచ్చుకొని నాటుకోవడం జరిగింది. అలా చేసినా మేము కూడా మొక్కలు నాటుకొనేవారమని 1,531 రైతులు అంతర్మధనం చెందుతున్నారు.

## పీఎంపీలకు నిబద్ధతే గుర్తింపు



**రామచంద్రపురం,ఆగస్టు 27 (ప్రభాతవార్త):** నిబద్ధతతో, నియమ నిబంధనలకు లోబడి వైద్య సేవలందించినప్పుడే పీఎంపీలకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. రామచంద్రపురంలోని తోటపేట మేర్నేడి కన్వెన్షన్ హాల్‌లో గురువారం పీఎంపీ అసోసియేషన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సర్వసభ్య సమావేశం,నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి.రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షత వహించారు.వీబీటీ రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలందిస్తున్న పీఎంపీలు నిబంధనలు పాటిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. నూతన కమిటీ ఆరోగ్య, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో చురుగ్గా పనిచేయాలని కోరారు.తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ మండలాల వారీగా ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.జిల్లా అధ్యక్షుడిగా కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు,కార్యదర్శిగా పున్నం రాము,కోశాధికారిగా మట్టా వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మట్టా వీరబాబు, కోశాధికారిగా వాడపర్తి శ్రీనివాస్,కె.గంగవరం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి రామకృష్ణ,కార్యదర్శిగా పున్నం రాము,కోశాధికారిగా సూదికొండ సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.నూతన కమిటీని రాష్ట్ర,జిల్లా నాయకులు అభినందించారు.

## పాడి పశువులతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు

### సొసైటీ చైర్మన్ మణి రామారావు



**శంకవరం ఆగస్టు 27 ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పాడి పశువుల ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని సొసైటీ చైర్మన్ బద్ది మనీ రామారావు పేర్కొన్నారు. శంకవరం మండలం నెల్లిపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్తిపాడు సౌజన్యంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మని రామారావు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బద్ది రామారావు మాట్లాడుతూ రైతు శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగపరుచుకోవలసినదిగా కోరారు . శంకవరం ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ రైతులు వర్షాభావ పరిస్థితులను తట్టుకునే విధంగా పశుగ్రాసాల సాగును చేపట్టాలని ప్రభుత్వం అందించే పశుగ్రాస విత్తనాలను వారి పొలాలలో నాటుకొని పశుగ్రాస కొరతను నివారించవలెనని కోరారు. ఈ పశువైద్య శిబిరంలో 68 పశువులకు గర్భకోస పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది మరియు 600కు పైగా గొర్రెలు మేకలకు బట్టల నివారణ మందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం నాయకులు బద్ది రమణ మండల తెలుగుదేశం ప్రెసిడెంట్ దేవుళ్ళు జనసేన నాయకులు తలపంటి బుజ్జి , బద్ది రామకృష్ణ కూటమి నాయకులు పశువైద్యాధికారి డాక్టర్ కాకర్ల ప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

## వాడపల్లి వెంకన్న కు 391 గ్రాముల వెండి ప్లేట్ బహుకరణ...

### నిత్యాన్న పథకానికి విరాళాల వెల్లువ...






**ఆత్రేయపురం, ఆగస్టు,27,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపలి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం గురువారం వేలాది మంది భక్తులతో శోభిల్లింది. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీవారికి కొత్తపేట గ్రామానికి చెందిన బొబ్బిలి వెంకట సత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులు రూ. లక్ష విలువ గల 391 గ్రాముల వెండి ప్లేటును అందజేశారు. వారికి ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు జూనియర్ అసిస్టెంట్ వెంకటరావు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. మోరంపూడి చెందిన చనుమూరి లక్ష్మీ వెంకట గణపతి, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ. 101116/- విరాళాలు అందించారు. అజ్జం చెందిన అల్లాడ సత్యనారాయణ, సారలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ. 25001/- వేల విరాళం అందించారు రావులపాలెం చెందిన నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి, జయశ్రీ దంపతులు, వారి కుటుంబ సభ్యులు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ. 25116/- వేల విరాళం అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## గోకవరంలో కోతులు, పశువులు, కుక్కల బెడద..

### ప్రజలకు నిత్యం ఇబ్బందులు - పంచాయతీ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
### మెయిన్ రోడ్డుపై వాహనదారులకు తప్పని అవస్థలు



**గోకవరం: ఆగస్టు 27:ప్రభాత వార్త** గోకవరం మేజర్ పంచాయతీ పరిధిలో కోతులు, పశువులు, కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కోతులు ఇళ్లలోకి చొరబడుతూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇంటి పరిసరాల్లో నిత్యం హడావుడి సృష్టించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రధాన రహదారిపై పశువులు, కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చే పశువులు, కుక్కల కారణంగా ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సి వస్తోంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి కోతులు వస్తున్నా, ప్రధాన రహదారిపై పశువులు, కుక్కల సంచారం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోడ్లపై పశువులు, కుక్కలు సంచరించకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని, కోతుల బెడద నివారణకు అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేయాలని కోరుతున్నారు. ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై పంచాయతీ అధికారులు ఇకనైనా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని గోకవరం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్అండ్ఆర్ ఇవ్వాలి

## సిపిఐ అధ్వర్యంలో చింతూరు - ఐ.టి.డి.ఎ.ముందు ధర్నా




**చింతూరు ఆగష్టు 27 ప్రభాత వార్త.** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పోలవరం ప్యాకేజీ ఇవ్వాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం చింతూరు ఐ టీ డి ఏ ముందు సి పి ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటిడిపిఓ శుభమ్ నొక్వాల్ కు మెమోరాండం సమర్పించారు. ఆ మెమోరాండంలో పోలవరం ప్రాజెక్టు పేరుతో విలీనం చేసుకున్న నాలుగు మండలాల అనేక సమస్యలతో నెలకొని ఉన్నాయని, విలీన మండలం అని పేర్కొన్న యటపాక మండలంలో పరిహారం ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి కలగడం లేదని . కేంద్ర పెద్దలు మాత్రం ప్రాజెక్టు 45o కాంటూరు వరకు కట్టడానికి నిధులిస్తాం కాని పరిహారం 41o కాంటూరు వరకే ఇస్తానని పార్లమెంటులో చెప్పడం నిజంగా బాధాకరమని , అలాంటప్పుడు యటపాక మండలం పరిస్థితి ఎంటని ప్రశ్నించారు, రెండు సంవత్సరాల కిత్రం పంట నష్టం ముంపు భూములకు గ్రామసభలు పెట్టి నోటిఫికేషన్ ఇచ్చారు. కాని ఇంత వరకు పరిహారం ఇవ్వలేదు. నోటిఫికేషన్ ఇచ్చిన భూముల్లో మార్పులు చేయలేము అంటున్నారు. అందువలన మరణించిన రైతుల వారసులకు అన్నదాత సుఖీభవ రావడం లేదన్నారు . యూరియా ఇవ్వడం లేదని . ఎటపాక ముంపు రైతుల పరిస్థితి చావలేక బ్రతకలేక అన్నట్లుగా ఉందన్నారు .. భద్రాచలం అనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు చాలా ఇబ్బందికర పరిస్థితిలో ఉండి తెలంగాణలో కలపమన్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని . లక్ష్మీపురం, కన్నాపురం, పాలమడుగు, పట్టుచీర గ్రామాల్లోని పోడు వ్యవసాయం చేసుకున్న రైతులకు పట్టాలు లేవని పేర్కొన్నారు. కూనవరం, వీఆరపురం, చింతూరు మండలాలలోని పట్టా భూములకు పరిహారం ఇచ్చిన గ్రామాలలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో ఇచ్చిన విధంగా అసైన్డ్, పోడు భూములకు కూడా పరిహారం ఇవ్వాలని . ఖాళీ చేయించే రోజు కటాఫ్ గా నిర్ణయించి 18 సంవత్సరాలు నిండిన వారికి పరిహారం ఇవ్వాలి. యటపాక మండలంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములకు మరణించిన రైతుల పట్టాలు మార్పు వీలు లేదంటూన్నారు. ఆన్లైన్ ద్వారా గతంలో వలె వారి వారసులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసి ఆ భూములకు యూరియా, డీఏపీ ఎరువులు ఇవ్వాలి. యటపాక మండలంలోని ముంపు భూములకు, గ్రామాలకు కాంటూర్ లెవల్ సంబందం లేకుండా పరిహారం ఇవ్వాలి. ప్రాజెక్టులో నీరు 2027లో నిలువ చేస్తామంటున్నారు. అది ఎన్ని అడుగుల వరకు నిల్వ చేస్తారు . దాని వలస వర్షాకాలం గోదావరిలో ఎంత నీరు ఉంటుంది . వేసవి, శీతాకాలంలో ఎన్ని అడుగుల నీరు గోదావరిలో ఉంటుందో ప్రభుత్వం స్పష్టం చేయాలి. ఖమ్మం జిల్లాలో ఉన్నప్పుడు ఈ నాలుగు మండలాలు గిరిజన, గిరిజనేతర నిరుపేదలందరికీ పక్కా గృహాలు ఇచ్చిన విధంగా ప్రస్తుతం కూడా ఇవ్వాలని . అర్హులైన వారికి వృద్ధాప్య వితంతు వికలాంగుల పెన్షన్లు ఇవ్వాలి. ఈ రెండున్నరేళ్లలో మరణించిన అర్హులైన వారిని ఎన్టీఆర్ బీమా కింద రూ.2 లక్షలు ఇవ్వాలని . ముంపు మండలాల్లోని రైతులకు రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని . పోలవరం బ్యాక్ వాటర్ వలన అనేక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులను ఖాళీ చేయించి 45o వరకు ముంపులోని అన్ని గ్రామాల్లోని ప్రజలకు రూ.10 వేలు ఇవ్వాలని . ప్రభుత్వం ఇచ్చిన హామీలో 18-60 సంవత్సరాలు లోపు మహిళలకు రూ.1500 ఇస్తామన్న పథకం ఇంత వరకు అమలు కాలేదన్నారు . 26x1500 =39,000 రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేసారు .

నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందజేయాలన్నారు .యటపాక మండలం అచ్యుతాపురం వద్ద వాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల మరమ్మత్తులు చేపట్టాలని . పాస్ పుస్తకంలో ఉండి ఆన్లైన్లో 1బి రాని రైతు భూములకు అన్నదాత సుఖీభవ రావడం లేదని అలాంటి వారిని అన్నదానత సుఖీభవ వర్తింపజేయాలని గుండాల నుంచి కూనవరం వరకు వరదల వలన రోడ్డు అధ్వానంగా తయారైందని . కొత్త నిర్మాణం చేయాలని . డ్వాక్రా గ్రూప్ లలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న మహిళలను 60సంవత్సరాలు నిండగానే బ్యాంకులు డ్వాక్రా ఋణం ఇవ్వడం లేదని రాజకీయాలలో 80 సంవత్సరాలు వచ్చినా ప్రజాప్రతినిధులు గా ఉండే అర్హత ఉన్నప్పుడు 60 సంవత్సరం వచ్చిన మహిళలను వృద్ధులు అని ఋణం ఇవ్వకపోవడం సరైన విధానం కాదని . 75 సంవత్సరాలు వచ్చే వరకు డ్వాక్రా మహిళలకు అన్ని బ్యాంకులు రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ, డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు, డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎటపాక సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, కూనవరం మండల కార్యదర్శి లంబూ శ్రీనివాసరావు, విఆర్ పురం మండల కర్నాటి ఏసు, డివిజన్ కార్యవర్గ సభ్యులు జుత్తుక సూర్యచంద్రరావు , చింతూరు సీపీఐ మండల కార్యదర్శి. తుర్రం మురళి, నాయకులు ఎస్కే రంజన్ తదితరులు పాల్గొన్నారు.


# పథకాల పనితీరు సంతృప్తికరం

**-ప్రభుత్వం హామీలను నిలబెట్టుకుంటుందని ప్రజలు ఆశాభావం**




**కొత్తపేట, ఆగస్టు 27, (ప్రభాతవార్త)** కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకుంటుందని పథకాల పనితీరు సంతృప్తికరంగా ఉంటున్నాయని ప్రజల ఆశాభావం వ్యక్తం చేసినట్లు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి అన్నారు కొత్తపేట గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం వేద పండితులను కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమం గురించి వివరించామన్నారునియోజకవర్గంలో ప్రచార కార్యక్రమం ఇప్పటికే 84% పూర్తయింది నియోజకవర్గంలో 69 046 కుటుంబాలను కూటమి పార్టీ శ్రేణులు కలుసుకొని ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాయని ఆయన తెలిపారు నియోజకవర్గ పరిధిలో ఆత్రేయపురం మండలంలో 100% ఇంటింటా ప్రచారం పూర్తి చేసుకోగా ఆలమూరు మండలంలో 83 శాతం కొత్తపేట మండలంలో 77 శాతం రావులపాలెం మండలంలో 76 శాతం కుటుంబాలను కూటమి నేతలు కలిశారు కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో 82 శాతం కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమం గురించి వివరించడం జరిగిందన్నారు గ్రామంలో 5 538 గృహాలను పార్టీ నేతలు సందర్శించి సంక్షేమం అభివృద్ధి గురించి వివరించామన్నారు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జులు యూనిట్ ఇన్చార్జిలు పర్యవేక్షణలో బూత్ కన్వీనర్లు పార్టీ నేతలు కూటమి నేతలు ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు కార్యక్రమంలో పల్లి ఏసు ముద్రగడ ఫణి చొల్లంగి రఘు అద్దంకి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు

# హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 27 (ప్రభాతవార్త):** కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్‌లో క్లిష్టమైన హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కేసును విజయవంతంగా నిర్వహించి తల్లి బిడ్డల ప్రాణాలను మెడికవర్ వైద్యులు కాపాడడం జరిగింది.గురువారం ఉదయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మెడికవర్ వైద్యులు మాట్లాడుతూజీవిత 7.5 నెలల గర్భంతో తీవ్రమైన హై-రిస్క్ పరిస్థితుల్లో ఉన్న గర్భిణికి గైనిక్ డా. లక్ష్మీ ప్రవీణ ఆధ్వర్యంలోని వైద్య బృందం అత్యవసరంగా ప్రసవం నిర్వహించింది. ప్రీమెచ్యూర్‌గా జన్మించిన శిశువును వెంటనే ఎన్ఐసీయూకు తరలించి, పీడియాట్రిషియన్ డా. వి. సుబ్బారావు ఆధ్వర్యంలో వెంటిలేటర్ సపోర్ట్, ఐవీ ఫ్లూయిడ్ తదితర అత్యవసర చికిత్సలు అందించారు.వైద్యుల నిరంతర పర్యవేక్షణ, మెరుగైన చికిత్సతో 15 రోజుల్లో శిశువు పూర్తిగా కోలుకోవడంతో తల్లీబిడ్డలను ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేశారు.హై-రిస్క్ గర్భధారణలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, సరైన సమయంలో వైద్య నిర్ణయాలు తీసుకోవడం ఎంతో కీలకమని గైనకాలజిస్టులు డా. లక్ష్మీ ప్రవీణ, డా. కస్తూరిబాయి వెంగ, డా. సుజన నిమ్మకాయల, డా. శ్రావణి సాత్తి తెలిపారు. ప్రీమెచ్యూర్ శిశువులకు అత్యాధునిక ఎన్ఐసీయూ సేవలు అత్యంతముఖ్యమని పీడియాట్రిషియన్లు డా. వి. సుబ్బారావు, డా. రవి అంగర పేర్కొన్నారు.మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ సంధిక్షేత్ర ఆంజనేయస్వామి (అంజిబాబు) మాట్లాడుతూ, ఏదైనా కాలంలో మహిళలు, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని, కాకినాడ పరిసర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని తెలిపారు.

# యశోద ఆసుపత్రి లో క్యాన్సర్ పై అధునాతన జన్యు చికిత్సా సాంకేతికత



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 27 (ప్రభాతవార్త):** క్యాన్సర్ చికిత్సలో ఆధునిక 'ప్రెసిషన్ ఆంకాలజీ' విధానం కీలక మార్పులకు దారితీస్తోందని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ శిఖర్ కుమార్ తెలిపారు. రోగి జన్యు నిర్మాణం, క్యాన్సర్ కణాల స్వభావాన్ని విశ్లేషించి, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించే ఇన్-హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్జీఎస్) సదుపాయాన్ని హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు.కాకినాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలపైనా ప్రభావం చూపే కీమోథెరపీనే ఎక్కువగా ఆధారపడేవారని, ప్రస్తుతం జన్యుపరమైన మార్పులను గుర్తించి క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకునే టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా రోగుల జీవన నాణ్యత, ఆయుర్దాయం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయన్నారు.యశోద ఆసుపత్రిలోనే ఎన్జీఎస్ ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల పరీక్ష నివేదికలు వేగంగా, తక్కువ ఖర్చులో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ తదితర క్యాన్సర్లలో సరైన చికిత్సను త్వరగా నిర్ణయించేందుకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ప్రపంచస్థాయి క్యాన్సర్ వైద్య సేవలను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని యశోద ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఆంకాలజీ హెడ్ సాయి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు లో ఘనంగా మాదేపల్లి రంగబాబు 11వ వర్ధంతి

**-రంగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన టీడీపీ శ్రేణులు**



**గొల్లప్రోలు, ఆగస్టు 27,(ప్రభాత వార్త)** దివంగత తెలుగుదేశం పార్టీ నేత, పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదేపల్లి రంగబాబు 11వ వర్ధంతి వేడుకలను గురువారం గొల్లప్రోలులో ఘనంగా నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు గండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు స్థానిక మెయిన్ రోడ్డుపై ఉన్న రంగబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.ఈ సందర్భంగా గండ్ర సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి రంగబాబు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివి కొనియాడారు.ఆయన ఆశయ స్ఫూర్తిని, ఆదర్శాలను తీసుకొని ముందుకు సాగాలన్నారు.ప్రతి నాయకుడు,కార్యకర్త రంగబాబు అడుగుజాడల్లో నడిచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అంతకు ముందు రంగబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు జోహార్ రంగబాబు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రంగబాబు తనయుడు మాదేపల్లి వివేక్ వర్మ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శీరం మాణిక్యం,టీడీపీ నాయకులు కడారి శివన్నారాయణ (బాబ్జి),ఐన సత్యనారాయణ,దువ్వా తాతాజీ, పెదిరెడ్ల నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఇంధన శ్రీను,మాజీ కౌన్సిలర్ గుళ్ల సుబ్బయ్య,వర్మత కొండయ్య,వేమూరి మాణిక్యం,బలిరెడ్డి నాని,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా జాతీయ అధికార ప్రతినిధిగా కోటి మాదిగ ఎంపిక...



**ఆత్రేయపురం, ఆగస్టు 27,(ప్రభాత వార్త)** ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) సోషల్ మీడియా జాతీయ అధికార ప్రతినిధిగా ప్రత్తిపాటి కోటి మాదిగ నియామకంపట్ల డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా అత్యవసర సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు, ఇప్పటివరకు ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రత్తిపాటి కోటి మాదిగకు ఈ బాధ్యతలను అప్పగించారు.ఈ సందర్భంగా ఆయన కొమ్మర రాఘవ మాదిగ మాట్లాడుతూ ఉద్యమం పట్ల అంకితభావంతో పనిచేస్తూ సోషల్ మీడియా వేదికగా ఎమ్మార్పీఎస్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రత్తిపాటి కోటి మాదిగ విశేష కృషి చేశారని ఆయన కొనియాడారు.అలాగే ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నియామకం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్తిపాటి కోటి మాదిగ మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో తాను నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో అండగా నిలిచిన జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యత తనకు లభించిన గౌరవం మాత్రమే కాకుండా ఉద్యమ భావజాలాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

# అసంఘటిత భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



**గోకవరం: ఆగస్టు 27 ప్రభాత వార్త** అసంఘటిత భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాలెం రాము డిమాండ్ చేశారు. గోకవరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రకటించినప్పటికీ, ఐదు నెలలు గడుస్తున్నా వాటి అమలులో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని జాలెం రాము విమర్శించారు. వివాహానికి రూ.20 వేలు, ప్రసవానికి రూ.20 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేలు వంటి సంక్షేమ ప్రయోజనాలు కార్మికులకు అందడం లేదన్నారు.ఆన్‌లైన్ సేవల కోసం ప్రవేశపెట్టిన ఏపీ పోర్టల్ సక్రమంగా పనిచేయక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలలుగా లేబర్ కార్డుల రెన్యువల్స్ నిలిచిపోయాయని, ఈ సమస్యపై వినతిపత్రం సమర్పించినా స్పందన లేదన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు 36 వేల క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఓసీ కార్డుల రెన్యువల్స్‌ను తక్షణమే చేపట్టాలని, మే నెల నుంచి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను విడుదల చేయాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, బోర్డులో సభ్యులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు టూల్‌కిట్లు, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి చెందితే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షల పరిహారం అందించే విధానాన్ని వెంటనే అమలు చేయాలని జాలెం రాము డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో కార్మికుల సొమ్మును వృథా చేయడం నిలిపివేయాలని ప్రభుత్వానికి సూచించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు

# చిత్తశుద్ధి ఉంటే ఎన్ఐఏ విచారణ జరిపించండి


**- కూటమి ప్రభుత్వానికి జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సవాల్**



**రావులపాలెం, ఆగస్ట్ 27 (ప్రభాతవార్త) :** కొవ్వూరు జగదీశ్వరరెడ్డి మరణం, నూకరాజు కుటుంబ విషాద ఘటనలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు కూటమి నేతలు చేస్తున్న రాజకీయ విమర్శలను జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను రాజకీయ కోణంలో వాడుకుంటూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురదజల్లే యత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, దీన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మలచుకోవడం హేయమైన చర్య అని స్పష్టం చేశారు. ఎన్ఐఏ విచారణ ఎందుకు కోరట్లేదు ఈ వ్యవహారాన్ని 'లవ్ జిహాద్', 'టెర్రరిజం' అంశాలతో ముడిపెడుతూ మాట్లాడుతున్నారని జగ్గిరెడ్డి ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నేత సోము వీర్రాజు, విజయసాయిరెడ్డి వంటి నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ కేసును తక్షణమే నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదం, మత మార్పిడుల కోణాలు ఉన్నట్లు భావిస్తే కేంద్ర ఏజెన్సీలతో దర్యాప్తు జరిపించి నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని సవాల్ విసిరారు. ?మతసామరస్యానికి ప్రతీకగా వైఎస్ జగన్ పాలన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా ఆదరించిందని జగ్గిరెడ్డి గుర్తుచేశారు, కొత్తపేట నియోజకవర్గంలోనే సుమారు 54 ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, 28కి పైగా దేవాలయ నిర్మాణాలను పూర్తి చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని తెలిపారు. ?కరోనా విపత్తు సమయంలో కులమతాలకు అతీతంగా పూజారులు, పాస్టర్లు, ఇమామ్‌లకు ఆర్థిక చేయూత అందించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని పేర్కొన్నారు.టీటీడీ ఆధ్వర్యంలో అమరావతి, విశాఖపట్నంతో పాటు విదేశాల్లోనూ ఆలయాల నిర్మాణాలు చేపట్టారని వివరించారు. రాజకీయ కుట్రలను కట్టిపెట్టాలిఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, వంగా గీత వంటి వైఎస్సార్సీపీ నాయకుల పేర్లను ఉద్దేశపూర్వకంగా ప్రస్తావిస్తూ బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో కొందరు నేతలు వైఎస్సార్సీపీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అమాయక యువత ఇలాంటి ఉదంతాల వల్ల నష్టపోకుండా ఉండాలంటే సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితులకు పూర్తి న్యాయం చేయాలని జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.

# "స్లాస్" పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి..

**-డీఈవో మహబూబ్ బాషా..**



**అంబాజీపేట,ఆగస్టు 27,(ప్రభాతవార్త):** విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని గుర్తించేందుకు మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించే స్టేట్ లెర్నింగ్ ఎసెస్మెంట్ సర్వే (స్లాష్) పరీక్షలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమర్ధవంతంగా నిర్వహించాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ను డీఈఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు.ఈ సందర్భంగా డీఈఓ బాషా మాట్లాడుతూ మండలంలో ఎంపికకాబడిన 13 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రైవేటు పాఠశాలల్లోని సామాజిక వర్గాల వారీగా స్లాష్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 4,6,8 తరగతుల నుండి 40 మంది చొప్పున సామాజిక వర్గాల వారీగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ నుంచి 14, బీసీ 13, ఓసీ 13 మంది విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. లాంగ్వేజ్లలో తెలుగు,ఇంగ్లీష్లలో ఏదో ఒకటి విద్యార్థి ఎంపిక చేసుకోవాలని, మ్యాథ్స్ మాత్రం అందరూ చేయాలన్నారు. స్లాష్ పరీక్ష విషయంలో ఎవ్వరూ ఎటువంటి అలసత్వానికి పోకూడదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం మండల వనరుల కేంద్రంను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులకు, ఇన్విజిలేటర్లకు స్లాష్ పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. అంతకుముందు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అగ్ని బాధితులకు తదేకం ఫౌండేషన్ ఆర్థిక సహాయం.



**తాళ్ళరేవు, ఆగస్టు 27 (ప్రభాతవార్త):** తాళ్ళరేవు సంతపేట లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన అగ్ని బాధితులకు పూణే మహా అవతార్ బాబాజీ తదేకం ఫౌండేషన్ అందించిన రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని జనసేన పార్టీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ ముత్యాల జయలక్ష్మి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తదేకం ఫౌండేషన్ ఉభయగోదావరి జిల్లాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తుందని దీనిలో భాగంగా రాబోయే పుష్కరాల్లో భక్తుల సౌకర్యార్థం అంతర్వేది, కుండలేశ్వరం, గేదెలంక ప్రాంతాల్లో పుష్కర ఘాట్ లు నిర్మిస్తుందన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు తదేకం ఫౌండేషన్ బాధితులకు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అండగా నిలుస్తుందని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్, సుందరపల్లి సత్యనారాయణ, పోతుల రాజు, చింతపల్లి రమేష్, సంతోష్ కుమార్ దంగుడు బియ్యం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# జగదీశ్వర రెడ్డి కుటుంబానికి జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

**-రియాన్ష్ భవిష్యత్తుకు అండగా ఉంటాం - చిర్ల జగ్గిరెడ్డి**



**రావులపాలెం, ఆగస్ట్ 27 (ప్రభాతవార్త):** జగదీశ్వర రెడ్డి కుటుంబానికి జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రావులపాలెంలో రియాన్ష్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన చిన్నారి రియాన్ష్‌కు ధైర్యం చెప్పారు.జగదీశ్వర రెడ్డి, నూకరాజు, భాస్కర్ రెడ్డి కుటుంబాల్లో జరిగిన విషాదాలు ప్రతి ఒక్కరికీ గుణపాఠమన్నారు. రియాన్ష్‌కు తండ్రికి సంబంధించిన ఆస్తులు, ఆర్థిక ప్రయోజనాలు సహా చట్టబద్ధంగా రావాల్సిన ప్రతి హక్కు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను 'లవ్ జిహాద్'తో ముడిపెట్టి రాజకీయాలు చేయడం సరికాదని, వాస్తవాలను దర్యాప్తు సంస్థలే తేల్చాలని అన్నారు. నిజంగా ఉగ్రవాద కోణం ఉన్నట్లు ఆధారాలు ఉంటే కేసును వెంటనే ఎన్ ఐ ఏ కి అప్పగించి సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పోలీసు భద్రత కల్పించాలని కోరారు. సాదిక్ ఖాన్ ను కఠినంగా శిక్షించాలని జగ్గిరెడ్డి అన్నారు. రియాన్ష్ భవిష్యత్తుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని, అతడి హక్కులు, ఆస్తుల పరిరక్షణ కోసం అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి,సంక్షేమం..

**-రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెదబాబు..**



**అంబాజీపేట,ఆగస్టు 27, (ప్రభాతవార్త):** సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే ముడిపడి ఉందని, రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు( పెదబాబు) తెలిపారు. క్లస్టర్ 007 ఇన్చార్జ్ గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలో114 పోలింగ్ బూత్లో "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి,సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమంను గురువారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి రవణం రాము,టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు,మండల తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య,బూత్ కన్వీనర్ మట్టపర్తి శ్రీనివాస్,నేలపూడి సత్యనారాయణ, మట్టపర్తి ఏసు తదితరులు పాల్గొన్నారు. అలాగే పుల్లేటికుర్రు క్లస్టర్ 009 పరిధిలోని 144 పోలింగ్ బూత్ లో గ్రామ శాఖ అధ్యక్షుడు పబ్బినీడి రాంబాబు ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొమ్మేటి సురేష్ కుమార్, బూత్ కన్వీనర్లు చిట్టూరి హరికృష్ణ, కాసా నాగమల్లేశ్వరరావు, బొక్కా ధర్మారావు, బొక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్ర సంరక్షకుని ఆలయ పునః నిర్మాణం నకు శంకుస్థాపన.... ఎమ్మెల్యే దేవ..



**సఖినేటిపల్లి ఆగస్టు 27, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో క్షేత్ర సంరక్షకుని ఆలయ పునః నిర్మాణం నకు రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ శంకుస్థాపన చేసినారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ రాజు ఆధ్వర్యంలో రూ 60 లక్షల పుష్కరాల నిధులతో అంతర్వేది శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయ పునః నిర్మాణ పనులకు శ్రీకారం చేశారు. పూజాది కార్యక్రామాలు స్థల దాత వెలువెల బాపూజీ, శైలజ దంపతులచే నిర్వహించి, శంకు ను పెన్మచ్చ నీలాద్రిరాజు లు ప్రతిష్టించారు. ఎంపీటీసీ నాగరాజు అధ్యక్షతన సమావేశంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడుచూ రాజోలు నియోజకవర్గంలో ఈ నిధులతో రోడ్లు అన్ని పూర్తయ్యాయని, అభివృద్ధి సాధించామని, గుర్రాలక్క ఆలయం నిర్మించే పనులను వేగ వంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ లార్డ్ జంపన సత్యనారాయణ రాజు, మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరక్టర్ గుబ్బల ఫణి కుమార్, డీసీ చైర్మన్ ఆకన బాబ్జీ నాయుడు, బిజెపి నాయకులు మాలె శ్రీనివాస నగేష్, నర్సింహాలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొనినారు.

# రేషన్ డీలర్ల సమస్యలపై తహశీల్దార్ కు వినతి



**గోకవరం:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గోకవరం మండల రేషన్ డీలర్లు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. అయితే ఇటీవల నూతనంగా తీసుకొచ్చిన రేషన్ బస్తాలపై క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విధానాన్ని మరోసారి పునఃపరిశీలించాలని కోరారు. అదేవిధంగా నిర్వహణ ఖర్చులు రోజురోజుకూ పెరగడంతో రేషన్ దుకాణాల నిర్వహణ భారంగా మారిందని పేర్కొన్నారు. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని రేషన్ డీలర్లకు కమిషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారులకు చేపడుతున్న డోర్ డెలివరీకి ఒక్కో కార్డుదారుడికి రూ.50 చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు బుంగ రాజు, గోకవరం మండల యూనియన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొండా రమేష్, జాయింట్ సెక్రెటరీ కాకర విష్ణు తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో కొత్త విధానం రేషన్ బియ్యం పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, అక్రమాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం రేషన్ డీలర్లకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ-పాస్ విధానంలో నమోదు చేయాల్సి ఉండటంతో డీలర్లు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్ నెల నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీలో భాగంగా మండల స్థాయి స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు చేరే ప్రతి బస్తాను డీలర్లు స్కాన్ చేసి తమ దుకాణంలోని నిల్వల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసే సమయంలోనూ నిర్దేశిత విధానంలో క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి ఈ-పాస్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు సూచించినట్లు సమాచారం. అయితే రేషన్ దుకాణాల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ సమయంలో నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలు తలెత్తితే పంపిణీ ప్రక్రియ ఆలస్యం అయ్యే అవకాశం ఉందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎక్కువ మొత్తంలో బియ్యం బస్తాలు వచ్చినప్పుడు ప్రతి బస్తాను స్కాన్ చేసి నమోదు చేయడం అదనపు పనిభారంగా మారుతోందని చెబుతున్నారు. మరోవైపు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, ప్రత్యేక అవసరాలు ఉన్న లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇంటివద్దకే అందించే విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచనలు ఉన్నాయి. ఇందుకోసం రేషన్ డీలర్లు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా బియ్యం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. క్యూఆర్ కోడ్ విధానం వల్ల రేషన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడే అవకాశం ఉన్నప్పటికీ, సాంకేతిక సమస్యలను పరిష్కరించి డీలర్లపై అదనపు భారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి రేషన్ పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు బుంగ రాజు, గోకవరం మండల యూనియన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొండా రమేష్, జాయింట్ సెక్రెటరీ కాకర విష్ణు విజ్ఞప్తి చేస్తున్నారు

# సమాధి చేసి వెలికి తీసి పంచనామాలు..



**సఖినేటిపల్లి ఆగస్టు 27, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,సఖినేటిపల్లి గ్రామానికి చెందిన గొల్లమందల కిరణ్ కుమార్(కన్నులు) తండ్రి పీటర్ వయస్సు 40 సం.లు అను అతను 2025 మార్చి 6 వ తేదీన పాయిజన్ త్రాగటం వలన అతనిని మలికిపురం సాయి సంజీవిని హాస్పిటల్ నందు జాయిన్ చేసినారు అక్కడ చికిత్స పొంది ది మార్చి13 న డిశ్చార్జ్ చేసినారు. 2025 మార్చి 15 వ తేదీన తీవ్ర అనారోగ్యమునకు లోనుకాగా అంతటా అమలాపురం కిమ్స్ హాస్పిటల్ కు తీసుకుని వెళ్ళగా అక్కడ డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లుగా నిర్ధారించినారు. అంతట ది 2025, మార్చి 16 వ తేదీన కుటుంబ సభ్యుల సమక్షంలో మృతుని సమాధి చేసినారు. తర్వాత మృతిని అక్క ఆయన మహేంద్రవాడ నిస్సి రాజాశ్రీ తన తమ్ముడు మరణం పై అనుమానంగా ఉండదని రాజోలు కోర్టు నందు ఫిర్యాదు చేసినారు ఆమె తన ఫిర్యాదులో మృతిని భార్య దీపాటి స్రవంతి, దీపాటి ధనలక్ష్మి, చింతా సజ్జనరావు, గెద్దం స్వరూపరాణి, దీపాటి రాజశేఖర్, తాడి ఆనంద్ తిలక్, దీపాటి రవికాంత్, దీపాటి మోహన్, దీపాటి లిల్లీ అనువారులపై ఫిర్యాదు చేసినారు. కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సఖినేటిపల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి, ది 26 ఆగస్టు 27వ తేదీన రాజోలు సిఐ సురేష్, ఎమ్మార్వో సూర్యనారాయణ రాజు, ఎస్ఐ దుర్గశ్రీనివాస్, టీమ్ ఆఫ్ డాక్టర్స్, మధ్యవర్తుల సమక్షంలో ఈరోజు సమాధిలో ఉన్న శవమును బయటకు తీసి పంచ నామాలు చేసినారు. రాజోలు సీఐ ఆధ్వర్యంలోకేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భూగర్భ జలాల అక్రమ రవాణా

**-రైతుల పేరుతో బోర్లు తవ్వకం -పట్టించుకోని అధికారులు**



**యు.కొత్తపల్లి, ఆగస్టు 27(ప్రభాతవార్త)** :తీర ప్రాంతంలో లభించే ప్రకృతి వనరులను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ వ్యాపారులు దోచుకుంటూనే ఉన్నారు. తీరప్రాంతంలో లభించే బొండు ఇసుకకు గిరాకీ ఉంటుంది. దీంతో పొన్నాడ, అమరవల్లి, మూలపేట, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా కొల్లగొట్టుకు పోయారు. అయితే పిఠాపురం ఎమ్మెల్యేగా కొణిదెల పవన్ కళ్యాణ్ ఎన్నిక కావడం, ఉప ముఖ్యమంత్రిగా ఉండడంతో ప్రస్తుతం ఆ వ్యాపారాన్ని ఎక్కడికక్కడ నిలిపివేశారు. కవితకేదీ కాదనర్హం అన్నట్టు ఇప్పుడు భూగర్భ జలాల అక్రమ వ్యాపారానికి తెరతీసారు. మండలంలోని పొన్నాడ శివారు రావివారిపోడు, శ్రీరాంపురం బీచ్ రోడ్డు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ బోర్లు తవ్వి భూగర్భ జలాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఇతర రైతులే ఆరోపిస్తున్నారు. విపరీతంగా భూగర్భ జలాలు మోటార్లుతో తోడి లారీ ట్యాంకర్లలో నింపి రొయ్యల సుద్ది కర్మాగారానికి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూగర్భ జలాల అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భూగర్భ జలాల అక్రమ తోడకాన్ని నిలుపుదల చేయకపోతే భవిష్యత్తులో మంచినీటికి కటకటలాడే పరిస్థితి వస్తుందని పరిసర గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**కడియం, ఆగస్టు 27 ( ప్రభాతవార్త)** ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని కడియం ఎస్సై బి. నాగదుర్గా ప్రసాద్ సూచించారు. మండల కేంద్రం కడియం గ్రామంలో గల మినర్వా ఇంగ్లీషు మాధ్యమ పాఠశాల విద్యార్థులకు జిల్లా సైబర్ ప్రయోగశాల సిబ్బంది సహకారంతో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై నాగదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, గోప్య సంకేతాలు, సంకేతపదాలు వంటి కీలక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలు, ఇంటి నుంచే ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, లాటరీలు, బహుమతుల పేరుతో వచ్చే సందేశాలు, వినియోగదారుల సేవల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని పలువురు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం, వారు పంపే అనుమానాస్పద అనుసంధానాలను తెరవడం, తెలియని దరఖాస్తులను నిక్షిప్తం చేసుకోవడం, అనుమానాస్పద సందేశాలకు స్పందించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సహాయవాణికి ఫోన్ చేయాలని, అలాగే ప్రభుత్వ సైబర్ నేరాల ఫిర్యాదు వేదికలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ ప్రయోగశాల సిబ్బంది పి. దుర్గాప్రసాద్, అబ్దుల్ షౌకత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# అటవీ ఫలసాయ విక్రయదారులు ఖాతాల్లోకి సొమ్ములు..

## -రూ. 1 కోటి 80 లక్షలు కొనుగోలు లక్ష్యం.. డి. ఎం.విజయలక్ష్మి



**రాజవొమ్మంగి, అగస్టు 27, ప్రభాతవార్త** జి. సి. సి. కి అటవీ ఫలసాయం అమ్మే వారికి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో సొమ్ములు జమ చేసే నూతన పద్దతిని ఎం. డి. సోబిక అమలు చేస్తున్నారని జి. సి. సి. డి. ఎం. విజయలక్ష్మి అవగాహన కల్పించారు. గురువారం శరభవరం గ్రామంలో జి. సి. సి. కమిటీ డైరెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం రాజవొమ్మంగి బ్రాంచ్ మేనేజర్ బేబీరాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా విచ్చేసిన డి. ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ దళారులకు అటవీ ఫలసాయ ఉత్పత్తులు అమ్మి మోసపోకూడదని అన్నారు. గిట్టుబాటు ధరతో బాటు ఆర్థికంగా నష్టం రాకుండా వారి ఖాతాల్లోకి సొమ్ములు జమఅవుతాయని అన్నారు. అనంతరం రాజవొమ్మంగి జి. సి. సి బ్రాంచ్ కార్యాలయంలో అటవీ ఫలసాయ కొనుగోలు లక్ష్యంపై సిబ్బందితో సమావేశం నిర్వహించి వివరించారు. డి. ఎం. ప్రభాతవార్తతో మాట్లాడుతూ 8 మండలాల్లో గల రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, కె. ఆర్. పురం బ్రాంచ్ లు పరిధిలో 33 కొనుగోలు కేంద్రాలు ద్వారా రూ. 1 కోటి 80 లక్షలు అటవీ ఫలసాయం కొనుగోలు లక్ష్యం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. షీకాయి ఎక్కువగా కొనుగోలు చేస్తామన్నారు. ఏలేశ్వరం ఉన్న గోడౌన్ లు రూ. 11.50 లక్షలు వ్యయంతో మరమ్మత్తులను చేయించనున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో డి. ఎం. విజయలక్ష్మి, జి. సి. సి. కమిటీ డైరెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, పీసా ఉపాధ్యక్షులు పప్పుల శ్రీనివాస్, మేనేజర్ బేబీరాణి, మాతయ్యమ్మ, కె. వి. రమణ, లక్ష్మి, చిన్నయ్య, సుభాషిణి, అబ్బాయిరెడ్డి, డి. ఈ. ఓ శ్రీహరి పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలం ఉపాధ్యాయుల ఔదార్యం



**అడ్డతీగల, ఆగస్టు 27, ప్రభాతవార్త** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండల విద్యాశాఖ అధికారి--1 కే. రమేష్‌కు అడ్డతీగల మండల ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. గత 20 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.52,000ను మండల విద్యాశాఖ అధికారి--2 పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి విరాళంగా సేకరించారు. సేకరించిన మొత్తాన్ని కే. రమేష్ కుటుంబ సభ్యులకు ఫోన్‌పే ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ--2 పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న తోటి అధికారికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ఉపాధ్యాయుల ఔదార్యం, మానవత్వం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల ఐక్యత, సహృదయత మరోసారి నిరూపితమైందని ప్రశంసించారు. కే. రమేష్ త్వరగా కోలుకుని తిరిగి విధులకు హాజరు కావాలని పి. శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

## నాగేశ్వరరావు ను పరామర్శించిన సత్యం వాసంశెట్టి,ఏఎంసి చైర్మన్ రిషి



**కె గంగవరం, ఆగస్టు 27, (ప్రభాతవార్త):** మాతృవియోగంతో బాధపడుతున్న కూటమి సీనియర్ నాయకులు పేరాబత్తుల నాగేశ్వరరావు ను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్ (రిషి) లు పరామర్శించారు. కె గంగవరం మండలం గంగవరం గ్రామంలో పేరాబత్తుల నాగేశ్వరరావును స్వగృహము వద్ద కలిసి ఆయన తల్లి మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంచుమర్తి బాబూరావు, వల్లికుర్తి రాంప్రసాద్,బాబి, వీరబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లక్ష గాజులతో అపర్ణాదేవి అమ్మవారికి విశేష అలంకరణ



**కడియం ,ఆగస్టు 27 ( ప్రభాతవార్త)** శ్రావణమాస పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా కడియం మండలం కడియపులంక గౌతమి గోదావరి నదీ తీరంలో కొలువైన శ్రీ హరిహర మహా క్షేత్రంలోని శ్రీ అపర్ణాదేవి అమ్మవారికి లక్ష గాజులతో విశేష అలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లక్ష గాజులతో అత్యంత సుందరంగా అలంకరించారు.పౌర్ణమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు శ్రీ హరిహర మహా క్షేత్రం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్షీరాన్నం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణను తిలకించేందుకు కడియం మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మార్గం సత్యనారాయణ మాట్లాడుతూ.. శ్రావణమాస పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అమ్మవారి విశేష అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకోగా, ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## నర్సరీ సంఘం ఆధ్వర్యంలో కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ విద్యార్థులకు ఆతిథ్యం



**కడియం ,ఆగస్టు 27 (ప్రభాతవార్త)** ఉద్యాన విద్యార్థులకు కడియం నర్సరీలు ఆదరణాత్మక పరిజ్ఞానాన్ని అందించే వేదికగా నిలుస్తున్నాయని డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్, చినతరిపేడి విద్యార్థులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమిక్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కు చెందిన 40 మంది ఉద్యాన విద్యార్థులు బుధవారం కడియం మండలంలోని నర్సరీలను సందర్శించారు.ఉద్యాన కళాశాల, చినతరిపికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె. సాయి మనోజ్ (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్), ఎన్. నరసింహుడు (ఎంటమాలజీ) ఆధ్వర్యంలో విద్యార్థులు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌కు చేరుకున్నారు. అనంతరం శ్రీ సత్యదేవా నర్సరీకి చెందిన పుల్లా ఆంజనేయులు, పుల్లా సత్యనారాయణ సహకారంతో నర్సరీలతో పాటు పలు నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదల, అంటుకట్టే విధానాలు, నర్సరీ నిర్వహణ పద్ధతులను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లో, పుస్తకాల్లో చదివిన అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా తమకు ఎంతో ఆచరణాత్మక పరిజ్ఞానం లభించిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఇతర ప్రాంతాల్లో అధ్యయన పర్యటనల సందర్భంగా ఎదురైన ఇబ్బందులతో పోలిస్తే కడియం నర్సరీ రైతులు, నర్సరీ సంఘం సభ్యులు తమను ఎంతో ఆప్యాయంగా ఆదరించారని విద్యార్థులు తెలిపారు. నర్సరీ రంగానికి సంబంధించిన అనేక విషయాలను రైతులు స్వయంగా వివరించడం ద్వారా తమకు మరింత అవగాహన కలిగిందన్నారు.కడియం నర్సరీలలో సాగుతున్న ఆధునిక మొక్కల పెంపకం విధానాలు, నర్సరీ నిర్వహణ తీరు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులు పేర్కొన్నారు. నర్సరీ సంఘం కార్యాలయంలో విద్యార్థులకు ఆతిథ్యం ఏర్పాటు చేశారు. తమ అధ్యయన పర్యటనకు సహకరించిన, ఆతిథ్యం అందించిన నర్సరీ సంఘం సభ్యులు, పెద్దల కమిటీ, ఎన్నికల కమిటీ సభ్యులు పుల్లా ఆంజనేయులు, తడాల చక్రవర్తి, పాతంశెట్టి చినమహాలక్ష్మి నాయుడు, కొత్తపల్లి నాగశివాజీ, బొర్రు వెంకటేశ్వరరావు, సింగంశెట్టి శ్రీను, గాద నాగేశ్వరరావు, జంగా సుబ్బారావు, మల్లు శివన్నారాయణ తదితరులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

### -జిల్లా విద్యాశాఖ అధికారి మహమూద్ భాష



**కొత్తపేట, ఆగస్టు 27. (ప్రభాతవార్త)** పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి షేక్ మెహబూబ్ బాషా మధ్యాహ్న సమయం లో ఆకస్మికంగా సందర్శించారు 10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు సూచనలు చేశారు అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసినారు సమావేశంలో ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్ టీచర్ డైరీ టి ఎల్ ఎం ను ఉపయోగించి బోధన చేయాలని పదవ తరగతి పరీక్షలకు ఇప్పటి నుండే విద్యార్థులను తయారు చేయవలసినదిగా సూచించారు

## కిమ్మలగడ్డ.. ముర్లవారివీధి బి. టి. రహదారి పనులు ప్రారంభం

### -900 మీటర్లు అనుమతులు ఇప్పించాలని గిరిజనులు మొర



**రాజవొమ్మంగి, అగస్టు 27, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం కిమ్మల గడ్డ నుండి అమ్మిరేకుల గ్రామం మీదుగా ముర్లవారివీధి వరకూ 6 కి. మీ. రహదారి పనుల్లో భాగంగా 5.100 కి. మీ బి. టి. రహదారి పనులు గురువారం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డి. ఇ. గౌతమి పర్యవేక్షణలో ప్రారంభించారు. అటవీశాఖ అనుమతులు కోసం ఆగిన 900 మీటర్ల రహదారికి అనుమతులు ఇప్పించాలని ఏ . పి.ఐ. ఐ. సి డైరెక్టర్, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, మాజీ ఎంపిటిసి చిన్నతల్లి, గిరిజనులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా అటవీ శాఖ అధికారిని కోరుతున్నారు.

## పిఠాపురం అభివృద్ధికి పునాది.. గర్భిణులకు గేల్ అండ



**పిఠాపురం, ఆగస్టు 27 ( ప్రభాతవార్త )** పిఠాపురంనియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ప్రజల తీర్పు కీలకమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడం వల్లే నియోజకవర్గానికి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని అన్నారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో గేల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో 1,500 మంది గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే గర్భిణులకు ఇంటింటికీ పోషకాహార కిట్లు అందించడం ప్రత్యేక కార్యక్రమమని ఎంపీ తెలిపారు. గేల్ సంస్థ ప్రతినిధి రతన్ టాటా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజాప్రతినిధులు, సంస్థలు సమన్వయంతో పనిచేస్తే సంక్షేమం చివరి వ్యక్తి వరకు చేరుతుందనే దానికి ఈ కార్యక్రమం నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాడా పిడి, ఎన్. వి శివరామ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎస్. టి. వి. రాజేశ్వరరావు, జనసేన పార్టీ పిఠాపురం అధ్యక్షురాలు చిక్కాల వరలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజరు బాబు, గర్భిణీ స్త్రీలు, అధిక సంఖ్యలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీడియా సమావేశంలో నూతన విధానాలను వెల్లడించిన వైద్యుడు శిఖర్ కుమార్




**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 27, ప్రభాతవార్త,** క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించే దిశగా ఆధునిక వైద్యరంగం మరో కీలక ముందడుగు వేసింది. రోగులు ఎదుర్కొంటున్న దుష్ప్రభావాలకు చెక్ పెడుతూ విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి రోగి జన్యు నిర్మాణాన్ని విశ్లేషించి, వ్యాధి కణాల స్వభావానికి అనుగుణంగా చికిత్స అందించే అధునాతన జన్యు విశ్లేషణ (నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్) కేంద్రాన్ని ప్రారంభించింది.స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ శిఖర్ కుమార్ మాట్లాడుతూ, ప్రాథమిక దశలోనే వ్యాధి మూలాలను గుర్తించడం ద్వారా సమర్థవంతమైన చికిత్స అందించవచ్చన్నారు. గతంలో ఆరోగ్యకరమైన కణాలను కూడా ప్రభావితం చేసే కీమోథెరపీకి బదులుగా, ఇప్పుడు వ్యాధి కణాలనే లక్ష్యంగా చేసుకునే అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.ఆసుపత్రిలోనే జన్యు విశ్లేషణ కేంద్రం ఉండటం వల్ల తక్కువ సమయంలో నివేదికలు అందుతాయని చెప్పారు. ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్ వంటి సంక్లిష్ట కేసుల్లో వేగంగా చికిత్స నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స, అధునాతన రేడియేషన్‌తో పాటు ఈ సదుపాయం ద్వారా సమగ్ర వైద్య సేవలు అందుతాయని తెలిపారు. సమావేశంలో ఆంకాలజీ మార్కెటింగ్ మేనేజర్ సాయి వెంకట్ మద్దు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి. సాయికిరణ్ పాల్గొన్నారు.


## వైశ్య నాయకుడు శ్రీఘాకొళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం రూ.11 లక్షలు ఇచ్చిన మాట వాస్తవమే

### -మీడియా సమావేశంలో మృత్యుంజయ సేవా సమితి నాయకుడు కందకం శ్రీను




**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 27: ప్రభాతవార్త**యంగ్ మెన్ వైశ్య అసోసియేషన్ (వైఎంవీఏ) ఆక్రమించుకున్న స్థలం వైఎంవీఏకు గానీ, పోతుల వీరాస్వామి వ్యాయామ కళాశాలకు గానీ చెందినది కాదని, మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినదని మృత్యుంజయ సేవా సమితి నాయకుడు, వైసీపీ నాయకుడు పడాల శ్రీను (కందకం శ్రీను) స్పష్టం చేశారు.స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1960 దశకంలో వైఎంవీఏ హాలు పక్కనే ఉన్న సుమారు 33 చదరపు గజాల స్థలంలో తమ తండ్రి పడాల వెంకటేశ్వరరావుతో పాటు ఒక ముస్లిం గురువు, మరికొందరు మట్టి కుస్తీ శిక్షణ పొందేవారని తెలిపారు. కాలక్రమంలో కుస్తీలకు ఆదరణ తగ్గడంతో స్థలం ఖాళీగా ఉండేదన్నారు. ఆ స్థలంలో షెడ్ వేసుకుని ముస్లిం గురువు భార్య కొంతకాలం నివసించేదని చెప్పారు.వైఎంవీఏ హాలు కార్యకలాపాలు విస్తరించడంతో లిఫ్ట్ అవసరం ఏర్పడిందని, అక్కడ నివసిస్తున్న మహిళను ఖాళీ చేయించేందుకు ఆర్యవైశ్య నాయకుడు శ్రీఘాకొళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం రూ.11 లక్షలు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. అందులో రూ.2 లక్షలు మహిళకు ఇచ్చి ఖాళీ చేయించామని, మిగిలిన రూ.9 లక్షల్లో మృత్యుంజయ సేవా సమితికి రూ.4 లక్షలు, శ్రీ శ్యామలమ్మ ఆలయ కమిటీకి రూ.5 లక్షలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆడప రాజు, నరేష్, కృష్ణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వానపల్లి లో ఆక్రమణల ఇండ్లు తొలగింపు



**కొత్తపేట, ఆగస్టు 27, (ప్రభాతవార్త)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానానికి వానపల్లి గ్రామ సర్వే నెంబరు 320 గల సుమారు ఒక ఎకరం భూమి నందు ఆలయ సమీపములో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల ఇండ్లను గురువారం తొలగించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సలాది సత్య మహేంద్ర తెలిపారు కోనసీమ జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమీషనర్ వేములపూడి సత్యనారాయణ ఉత్తర్వులు మేరకు ఆలయ ధర్మకర్మల మండలి చైర్మన్ మద్దింసెట్టి ఆదినారాయణ సభ్యులచే దేవాదాయ శాఖ పోలీసు రెవిన్యూ విద్యుత్ శాఖాధికారులు సిబ్బంది సమక్షంలో తొలగించినట్లు ఈవో మహేంద్ర తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మదాయ శాఖ తరపున పలువురు కార్యనిర్వహణాధికారులు కొత్తపేట తహశీల్దారు వై రాంబాబు రావులపాలెం సి ఐ సిహెచ్ విద్యాసాగర్ కొత్తపేట ఎస్సై జి సురేంద్ర వానపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ వీఆర్వో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది గ్రామ పెద్దలు గ్రామస్థులు పలువురు పాల్గొన్నట్లు ఈవో తెలిపారు

## ఎ.ఎస్.డి.ఎస్ సంస్థ సహకారంతో శబరి వారధిపై విద్యుత్ వెలుగులు



**వి.ఆర్.పురం ,ఆగష్టు27, ప్రభాతవార్త** వి.ఆర్.పురం, కూనవరం రెండు మండలాల నడుమ గల శబరి వారధిపై, ప్రముఖ ఎ.ఎస్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సోలార్ విద్యుత్ వెలుగులు వెలిగాయి. ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు, ఎ.ఎస్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఉండవల్లి.గాంధీబాబు గురువారం వారధిపై ఆటోమ్యాటిక్ సోలార్ విద్యుత్ దీపాలను ప్రారంభించారు. ఆర్.పురం,కూనవరం రెండు మండలాల నడుమ శబరినడిపై ఉన్న ఈ వారధి గుండా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు, పాదచారులు తిరుగుతుంటారు. 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఈ వారధి నిర్మాణం జరిగింది. అప్పట్లో అప్పటి, రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల.నాగేశ్వరావు ఈ వారధిని ప్రారంభించారు. అప్పట్లో ఈ వారధిపై అత్యంత విలువైన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణా లోపంతో అవి కొన్నాళ్ళకే శిధిలమైపోయాయి. ఇక అప్పటి నుండి నిన్న, మొన్నటి వరకు వారధిపై చిమ్మచీకటి అలుముకుంది. దీంతో రెండు మండలాల ప్రజలు ఇంతకాలం వారధిపై వెలుగులు లేక చీకట్లతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది గమనించిన గాంధీబాబు వారధిపై మొత్తం 22 స్థానాలకు గాను, 10 స్తంభాలకు సోలార్ ఆటోమ్యాటిక్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేపించి, లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం ఎంపిపి కారం.లక్ష్మీ, జడ్.పి.టి.సి సభ్యులు వాళ్ళ.రంగారెడ్డి, ఎంపిటిసి పూనెం.ప్రతీఫ్ కుమార్, ఎంపిడిఒ ఇమ్మానుయేల్, కూనవరం బిజెపి నాయకులు నోముల.రామారావు, వైసిపి నాయకులు ఆవుల. మరియదాసు, వి.ఆర్.పురం టిడిపి మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్, మాజీ జడ్.పి.టి.సి సభ్యులు ముత్యాల.రామారావు, జనసే న మండల అధ్యక్షులు ములకాల.సాయికృష్ణ, వైసిపి నాయకులు మాదిరెడ్డి.సత్తిబాబు, చిక్కాల.బాలు, బొడ్డు.సత్యనారాయణ, సిపిఎం నాయకులు కారం. సుందరయ్య, సోడె.మల్లయ్య, పంకు.సత్తిబాబు, నాళ్ళవరుపు.ప్రకాష్ రావు, కుంజా.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ “కుమార నారాయణ స్వామి”కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి. ఆగస్టు 27. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న” కుమార నారాయణ స్వామి సి.” వెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వి.(వి.ఐ.టి.) నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్లూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వి.(వి.ఐ.టి.) కి చెందిన డా.టి.వేల్ మురుగన్ నేతృత్వంలో కుమార నారాయణ స్వామి సమర్పించిన “థీసిస్ శీర్షిక: ‘ఇన్వెస్టిగేషన్ ఆన్ నోమా – బెస్ట్ ఆప్టిమల్ రిసోర్స్ ఆలోకేషన్ స్కీం ఫర్ వెహిక్యూలర్ కమ్యూనికేషన్స్ యూజింగ్ ఫాగ్ కంప్యూటింగ్ ” అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. “డా.” కుమార నారాయణ స్వామి “ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి డా.చవ్వాకుల జానకీదేవి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా. కుమార నారాయణ స్వామి సి. కు అభినందనలు తెలియజేశారు.

## ఆదిత్య యూనివర్సిటీలో లియో క్లబ్ 2026-27 ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం



**గండేపల్లి. ఆగస్టు 27. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామంలోని ఆదిత్య యూనివర్సిటీ, లియో క్లబ్ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా నూతన లియో క్లబ్ బృందాన్ని అధికారికంగా బాధ్యతల్లోకి తీసుకోవడంతో పాటు, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవా భావం, సామాజిక బాధ్యత మరియు యువత అభివృద్ధికి సంబంధించిన విలువలను మరింత బలోపేతం చేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య యూనివర్సిటీ ప్రో వైస్–చాన్సలర్ (జుడూ) డా. ఎ. రమేష్ సర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. ఎ. రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు మరియు సమాజానికి అర్థవంతమైన సేవ చేయడానికి లియో క్లబ్ అందిస్తున్న అవకాశాలను కొనియాడారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమానికి లిలయన్ ఎం.వి.ఆర్. మోహన్, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, మరియు లిలిలయన్ .డి. రామ సుబ్రహ్మణ్యం సర్, రీజినల్ ఆఫీసర్‌లితో పాటు ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లియో సభ్యులకు తమ విలువైన మార్గదర్శకత్వం మరియు ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమం డా. డి . కిషోర్, డీన్ -- స్టూడెంట్ యాక్టివిటీస్, మరియు ఐ. వీరాంజనేయులు, కన్వీనర్ -- ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్.,పి వి బి . అన్నపూర్ణ, లియో క్లబ్ కోఆర్డినేటర్, ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

## మండలంలో ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు



**రాజవొమ్మంగి, ఆగస్టు 27, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో చెకుముకి సైన్స్ సంబరాలు--2026 కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. వివిధ ప్రభుత్వ, గిరిజన సంక్షేమ, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షకు 8, 9, 10వ తరగతులకు చెందిన మొత్తం 612 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా హాజరై పరీక్ష రాశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగిలో ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగిలో ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు.జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకుమారి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, లాగరాయిలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగిలో నాగసుశీల, ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ సత్యవేణి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, సింగంపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరి, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, జడ్డంగిలో హెచ్. ఎం.లక్ష్మమ్మ, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, అమీనాబాద్ లో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల రాణి, ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, బోర్నగూడెంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులు పరీక్షలను నిర్వహించారు.పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించేందుకు మండల విద్యాశాఖ అధికారి సూరయ్యరెడ్డి వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జడ్డంగి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులతో మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు తీగల బొజ్జయ్య, యు. టి. ఎఫ్ ప్రధాన కార్యదర్శి కానేం శ్రీను, జిల్లా కౌన్సిలర్ దాసరి పైడిమల్లి, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ సభ్యులు పరీక్షా కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి




**రంపచోడవరం, ఆగస్టు 27, ప్రభాత వార్త** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ప్రత్యేక టెట్‌లో పాస్ మార్కులను 40 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు జి. విశ్వరాజ్, ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ నాయకత్వంలో రాజవొమ్మంగి నుంచి ప్రారంభమైన ర్యాలీ అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లోని పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం సెక్షన్ 23(1)ను సవరించి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని, సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించేలా సిలబస్ మార్చాలని, ఆన్‌లైన్ బదులు ఆఫ్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో సుమారు 100 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొజ్జియ్య, సహాధ్యక్షులు ఎస్. నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె. సూరిబాబు, మంగరాజు, రాజవొమ్మంగి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీను, పి. లక్ష్మణరెడ్డి, జి. శ్రీను, అడ్డతీగల మండల అధ్యక్షులు గాంధీ రెడ్డి, గంగవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జిదొర, రామకృష్ణరెడ్డి, రంపచోడవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సనాతనబాబు, వెంగళరావు, మారేడుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, దేవీపట్నం మండల అధ్యక్షులు కె. శ్రీనివాస్, చింతూరు మండల ప్రధాన కార్యదర్శి ముత్తయ్య పాల్గొన్నారు.

## 4 దుకాణాలు దోచిన దొంగ దొరికాడు సీఐ శ్రీనివాస్



**యు.కొత్తపల్లి, ఆగస్టు 27(ప్రభాతవార్త) :** మండలంలోని ఉప్పాడ, అమీనాబాదు బీచ్ రోడ్డు కూడలిలో గత 15తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత 4దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడిన యువకుడిని గురువారం అరెస్టు చేయడం జరిగిందని పిఠాపురం సిఐ శ్రీనివాస్ తెలిపారు . స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై వెంకటేష్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు. దొంగతనాలకు పాల్పడిన నిందితుడు బాపట్ల జిల్లా చీరాల మండలం అడివిపల్లి గ్రామానికి చెందిన గంగిరి అశోక్ గా తమ విచారణలో తేలింది అన్నారు. నిందితుడిని ఉప్పాడ సినిమా హాలు వెనక అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఇక్కడ దొంగతనాలే కాకుండా పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడని, అశోక్ పై ఇప్పటికే 13కేసులు కేసులు నమోదయి ఉన్నట్లు తెలిపారు. నిందితుడిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని, కోర్టులో హాజరు పరచడం జరుగుతుందన్నారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై వెంకటేష్, సిబ్బందిని అభినందించారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



**సీతానగరం, ఆగస్టు 27, (ప్రభాతవార్త) :** రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతానగరం మండల రేషన్ డీలర్లు గురువారం ఎమ్మార్వో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కిలో బియ్యంపై కమిషన్‌ను రూ.3కు పెంచాలని, ప్రతి నెల కమిషన్‌ను సకాలంలో చెల్లించాలని కోరారు. బియ్యం బస్తాలను ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే తూకం వేసి స్కాన్ చేసి, డీలర్ల డివైజ్‌లో స్టాక్ చూపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 65 ఏళ్లు నిండిన వారికి డోర్ డెలివరీ చేస్తున్నందుకు డీలర్లకు కనీస రవాణా ఛార్జీలు చెల్లించాలని కోరారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం అమలు చేస్తే ప్రతి డీలర్‌కు స్మార్ట్‌ఫోన్ అందించాలని, రేషన్ డీలర్లకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. డీలర్లపై అనవసర ఒత్తిడి లేకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు వాకపల్లి సూరిబాబు, కార్యదర్శి ముప్పిడి చంద్రశేఖర్, వి.సీతాదేవి, వలవల వల్లి, కె.నాగమణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా ముమ్మిడి శివశంకర్



**పిఠాపురం, ఆగస్టు 27:( ప్రభాతవార్త)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా పిఠాపురం నియోజకవర్గం పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెంకు చెందిన ముమ్మిడి శివశంకర్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు ఆయన తెలిపారు.తనకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్కు, కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు ముమ్మిడి శివశంకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గ్రీవెన్స్ సెల్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి వాటిని సంబంధిత పార్టీ నాయకత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ముఖ్యంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అర్హులకు పథకాలు అందకపోవడం, స్థానికంగా అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పార్టీ గ్రీవెన్స్ సెల్ ద్వారా ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps